అనుదినం... జనస్వరం
Dwaraka
# నవతెలంగాణ
శుక్రవారం 12-1-2018 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 15 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00



# తెలంగాణకు కొత్తబాట



మాట్లాడుతున్న తమ్మినేని, చిత్రంలో కంచ ఐలయ్య, నల్లా సూర్యప్రకాశ్‌రావు, వనజ, అమ్జదుల్లాఖాన్

## బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటు

- 25న హైదరాబాద్‌లో ఆవిర్భావ సభ
- హాజరుకానున్న సీతారాం ఏచూరి, ప్రకాశ్ అంబేద్కర్, ఎమ్‌డీ గౌస్
- కార్యవర్గం, విధి విధానాలపై చర్చ
- కార్యక్రమం విడుదల
- వచ్చే ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ
- వేదికలోకి రావాలంటూ సీపీఐ, న్యూడెమోక్రసీలకు ఆహ్వానం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి అనే అంశాలే ప్రధాన అజెండాగా తెలంగాణాలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) అనే ప్రత్యామ్నాయ వేదిక రూపుదిద్దుకున్నది. గతంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, ప్రస్తుత టీఆర్ఎస్ విధానాలకు భిన్నంగా ఇది తెలంగాణాలో ప్రత్యామ్నాయ పాలనా ప్రణాళికను, అభివృద్ధి నమూనాను తయారు చేసింది. తద్వారా రాష్ట్రంలో సరికొత్త బాటలు వేయనుంది. బీఎల్ఎఫ్ రూపొందించిన కార్యక్రమా(ముసాయిదా)న్ని చర్చకోసం ప్రజల ముందు ఉంచారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫ్రంట్‌లో భాగస్వాములుగా ఉన్న 28 పార్టీలతో కీలక సమావేశం నిర్వహించారు. చైర్మెన్, కన్వీనర్, కో కన్వీనర్లతోపాటు ఇతర కార్యవర్గంలో ఎవరెవరు ఉండాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. వేదిక విధి విధానాలు, కార్యాచరణ తదితరాంశాలపై సమాలోచనలు జరిపారు. రాష్ట్ర రాజకీయాలు, ప్రత్యామ్నాయ కూటమి ఆవశ్యకత, దాని లక్ష్యం, నిర్మాణ రూపం, రాష్ట్ర అభివృద్ధి, ప్రత్యామ్నాయ నమూనా, కూటమి ప్రత్యామ్నాయ పాలనా ప్రణాళిక, సాంస్కృతిక విషయాలకు సంబంధించి 9

# విషాహారం

- ఏకపక్షంగా నిబంధనల్ని మార్చేసిన ప్రధానమంత్రి కార్యాలయం
- సురక్షితం కాని ఆహార ఉత్పత్తులతో ప్రాణాలకు ముప్పు
- ఏండ్లుగా సాగుతున్నా లైట్ తీసుకున్న మోడీ సర్కారు
- నిబంధనలకు వ్యతిరేక లైసెన్సింగ్‌పై 'కాగ్' నివేదిక

## 'ఆహార భద్రత, ప్రమాణ చట్టం-2006' కు తూట్లు

**అందమైన, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో ప్రజల్ని ఆహార ఉత్పత్తులు (ప్రాసెసింగ్ ఫుడ్) ఆకట్టుకుంటున్నాయి. అయితే కంపెనీలు తయారుచేసిన ప్రాసెసింగ్ ఫుడ్ సరైందేనా ? సురక్షితమైనదేనా ? అని తేల్చాల్సింది భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ 'ఎఫ్ఎస్ఎస్ఏఐ'. కార్పొరేట్ కంపెనీల నుంచి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి మోడీ ప్రభుత్వం 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' నిబంధనల్ని ఏకపక్షంగా మార్చివేసింది. ఫలితం...సురక్షితం కాని 'ప్రాసెసింగ్ ఫుడ్' ప్రజలు తినాల్సి వస్తోంది. ఈ మధ్యకాలంలో 4500 రకాల ఆహార ఉత్పత్తుల్లో అత్యధికం సురక్షితం కానివే ఉన్నాయని, విదేశాల నుంచి దిగుమతి అవుతున్న వాటిలో కూడా నాణ్యతా ప్రమాణాలు లేవని 'కాగ్' ఆధారాలతో సహా నివేదిక రూపొందించింది. ఈ నివేదిక మొదటి భాగంలోని విషయాలు ఇలా ఉన్నాయి...**



న్యూఢిల్లీ : కేంద్రంలో మోడీ సర్కార్ వచ్చాక, ప్రధానమంత్రి కార్యాలయం స్వయంగా జోక్యం చేసుకొని సడలింపు పేరిట నిబంధనల్ని నీరుగార్చింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో, పారిశ్రామిక వర్గాలతో ప్రధాని ప్రిన్సిపాల్ కార్యదర్శి సమావేశమై కొత్త ప్రమాణాలను నిర్దేశించారు. వీటిని అప్పటి ఆహార భద్రతా సంస్థ (ఎస్ఎస్ఎస్ఏఐ) చీఫ్ మాలిక్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆహార ఉత్పత్తులపై కంపెనీలే భరోసా ఇస్తుంటే...మీకెందుకు అభ్యంతరం ? అని ప్రిన్సిపాల్ సెక్రటరీ వాదన చేశారు. దీనికి మాలిక్ తలొగ్గకపోతే కేంద్రం బదిలీ చేసింది. ప్రొప్రయిటరీ ఫుడ్స్ అంటే...మనం తినే రకరకాల చిరు తిండ్లు. ఇక రెండోది 'నావల్ ఫుడ్స్' కొత్త రుచుల ఆహారం లేదా ఆహార మిశ్రమంతో కూడుకున్నది. 'యాడింగ్స్' అంటే... ఎక్కువ కాలంపాటు నిల్వ ఉంచేందుకు మిశ్రమాలతో తయారైంది. నావల్ ఫుడ్స్ కంపెనీ యాజమాన్యం ఇష్ట ప్రకారం 9

# టీఆర్టీ సవరణ గడువు 15కు పెంపు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థుల వివరాల సవరణ గడువును తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఈనెల 15వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీఆర్టీకి దరఖాస్తు చేసిన అభ్యర్థుల వివరాల సవరణకు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు అవకాశమిచ్చిన విషయం తెలిసిందే. టీఎస్‌పీఎస్సీ 9

## హెచ్‌సీయూ ఘటనపై కేంద్రం ఆరా!




**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ప్రొఫెసర్ లక్ష్మీనారాయణపై ఏబీవీపీ జాతీయ నాయకులు చేసిన బూతుపురాణంపై మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ(ఎంహెచ్ఆర్డీ) ఆరా తీసినట్టు తెలిసింది. దళిత సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్‌పై వ్యాఖ్యలు చేయడంపై కొందరు ఎంహెచ్ఆర్డీకీ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీంతో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలనీ హెచ్‌సీయూ అధికారులను 9



# ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- ఆరుగురు మావోయిస్టులు మృతి
- చనిపోయిన వారిలో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు

**నవతెలంగాణ-చర్ల**

పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా ఓత్సా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మృతుల్లో నలుగురు మహిళలు,ఇద్దరు పురుషులు ఉన్నారు. నారాయణపూర్ ఎస్పీ సంతోష్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓత్సా పోలీస్ స్టేషన్ పరిధిలో గల అడవిలో సురక్ష బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టులు తారసపడ్డారు. మవోయిస్టులు కవ్వింపు చర్యలకు పాల్పడి కాల్పులు జరపగా పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో సుమారు గంట పాటు కాల్పులు జరిగాయి. ఆరుగురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలంలో మావోయిల సామాగ్రితో పాటు భారీగా తుపాకులు లభ్యమైనట్టు ఎస్పీ తెలిపారు. ఈ కాల్పులపై పౌరహక్కుల సంఘాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి

# మొసలికి టైరు కష్టం



వివరాలు 9లో

- వేటగాళ్లు మెడకు టైర్ బిగించడంతో... రెండేండ్లుగా తప్పని బాధ
- ఇండోనేషియాలో ఘటన



## తరలిస్తున్న సబ్సిడీ గొర్రెల పట్టివేత

16మందిపై కేసు... రెండు లారీలు సీజ్




వివరాలు 9లో

## సత్యం స్కాంలో.. ఆడిటింగ్ సంస్థపై నిషేధం



- రూ.13 కోట్ల జరిమానా : సెబీ

**న్యూఢిల్లీ:** ఐటీ కంపెనీల చార్టర్డ్ అకౌంటెంట్ ఆడిటింగ్ సంస్థ ప్రైస్ వాటర్‌హౌజ్‌పై రెండేండ్ల నిషేధం విధిస్తున్నట్టు మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) తెలిపింది. తప్పుడు లెక్కలతో అక్రమ సంపాదనకు పాల్పడిందన్న ఆరోపణలతో రూ.13 కోట్ల జరిమానాను కూడా ప్రైస్‌పై సెబీ విధించింది. ఇదే ఆడిటింగ్ సంస్థ ద్వారా సత్యం కంప్యూటర్స్ యాజమాన్యం తప్పుడు లెక్కలు చూపినట్టు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. 2009లో 9

## నాణేల ముద్రణ నిలిపివేత ఉద్యోగుల ఆందోళన

- చర్లపల్లిలో మింట్ గేటు ఎదుట ధర్నా
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం



**నవతెలంగాణ- హైదరాబాద్ సిటీబ్యూరో**

నాణేల ముద్రణను నిలిపేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ మింట్ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. ముద్రించిన నాణేలను రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా తీసుకోవడం లేదనే సాకుతో ముద్రణ ఆపడం తగదని పలు యూనియన్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణేల ముద్రణ నిలిపివేత నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్‌లోని చర్లపల్లిలో గల మింట్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా గుర్తింపు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరిశంకర్, హైదరాబాద్ మింట్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఉమామహేశ్వర్‌రావు, ఆర్.భీష్మ, బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దశవర్ణం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా కలకత్తా, ముంబాయి, నోయిడా, హైదరాబాద్ మింట్లలో నాణేల 9

### కొక్కొరోకో..



అలాగే వారికి ఇచ్చిన బాంబులు, ఆయుధాల్ని కూడా వెనక్కి తెప్పించండి సార్..మరో దేశానికి అమ్ముకుందాం..!!

# డంపింగ్‌యార్డ్‌తో గర్భస్రావాలు



- సంతానలేమితో కుటుంబాలు సతమతం
- ప్రజల ఆరోగ్యాలపై 'లీచెట్' తీవ్ర ప్రభావం
- 17 గ్రామాల ప్రజలు ఇబ్బందులు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ



**నవతెలంగాణ-హైదరాబాద్ సిటీబ్యూరో**

ఆ దంపతులు సంతానం కోసం ఎంతోకాలంగా ఎదురు చూశారు. ఆమె గర్భవతి కావడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు. కానీ వారి ఆనందం ఆవిరైంది.. ఆరు నెలల సమయంలో అకస్మాత్తుగా ఆమెకు తీవ్ర కడుపు నొప్పి వచ్చింది. సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా గర్భస్రావమని చెప్పిన డాక్టర్లు పిండాన్ని తొలగించారు. దాంతో ఎన్నో ఏండ్లుగా పిల్లల కోసం ఎదురుచూస్తున్న ఆ దంపతులతో పాటు కుటుంబ సభ్యులకు పుట్టెడు శోకం మిగిలింది. ఇదీ మేడ్చల్ జిల్లాలోని జవహర్‌నగర్ గ్రామ పంచాయతీ 9

## కాంగ్రెస్‌లోకి బీజేపీ ఎంపీ

**ముంబయి:** రైతు సమస్యలపై ప్రధాని మోడీతో విభేదిస్తూ ఇటీవల బీజేపీకి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆ పార్టీ మహారాష్ట్ర ఎంపీ నానా పటోలే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రైతు సమస్యల పరిష్కారంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యధోరణికి వ్యతిరేకంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన ఆయన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. 'నేను కాంగ్రెస్ పార్టీలో చేరాను. ఆ పార్టీ ఇచ్చే ఏ బాధ్యతనైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. అది జాతీయ స్థాయి లేదా రాష్ట్ర స్థాయిలో అయినా 'సరే' అన్నారు. రైతు సమస్యలపై పోరాడతానని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. మోడీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ 2017 డిసెంబర్ 8న పటోలే బీజేపీకి రాజీనామా చేశారు. ప్రజా సమస్యలను అధిష్టానం వద్ద ప్రస్తావించినా పట్టించుకోలేదని అందుకే రాజీనామా చేస్తున్నానని ఆయన లోక్‌సభ స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆయన బాంద్రా–గోండియా నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పటోలే 2014 లో కాంగ్రెస్ నుంచి బీజేపీకి వెళ్లారు.

## అఫ్జల్‌గురు కొడుకు చదువులో మేటి

- 12వ తరగతిలో 88 శాతం మార్కులు

**శ్రీనగర్:** కరుడు గట్టిన ఉగ్రవాది కొడుకు విద్యా కుసుమమై వికసిస్తున్నాడు. చదువులో మేటి ర్యాంకులు సాధిస్తూ ఔరా అనిపించుకుంటున్నాడు. పార్లమెంటుపై దాడి కేసులో దోషిగా తేలిన అఫ్జల్ గురు కొడుకు గలీబ్‌గురు 12వ తరగతిలో డిస్టింక్షన్ సాధించాడు. 2001లో పార్లమెంటుపై దాడి చేసిన కేసులో అఫ్జల్ గురును 2013లో ఉరి తీసిన సంగతి తెలిసిందే. కాగా.. కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో విద్యావ్యవస్థన్నిస్తున్న అతడి కొడుకు గలీబ్.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. గురువారం వెల్లడైన 12వ తరగతి ఫలితాల్లో అతడికి 88 శాతం మార్కులు వచ్చాయి. మొత్తం 500 మార్కులకు 441 మార్కులు సాధించాడు. దీంతో అతడిపై సోషల్‌మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురుస్తున్నది. జిల్లాలోని సోపోర్ పట్టణంలో ఉన్న అతడి ఇంటికి స్నేహితులు, బంధువులు వెళ్లి అభినందనలు తెలియజేశారు. గలీబ్‌ను నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధికార ప్రతినిధి సరహ్ హయత్ ప్రత్యేకంగా అభినందించారు. గలీబ్ 10వ తరగతిలోనూ 95 శాతం మార్కులు సాధించడం గమనార్హం.

## నా భర్తను హైదరాబాద్ జైలుకు తరలించండి

- నాగపూర్ జైలులో ఆయన బతికే అవకాశం లేదు : ప్రొ. జీఎన్ సాయిబాబా భార్య వసంతకుమారి

**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలోని నాగపూర్ జైలులో ఉన్న తన భర్త, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను హైదరాబాద్ జైలుకు తరలించాలని ఆయన భార్య వసంతకుమారి డిమాండ్ చేశారు. 90 శాతం వైకల్యంతో, 19 రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సాయిబాబాకు నాగపూర్ జైలులో తగిన వైద్యం అందటంలేదని ఆమె తెలిపారు. ఆయన జీవితం జైలులోనే ముగిసిపోవాలని రాజ్యం(ప్రభుత్వం) కోరుకుంటున్నదని ఆమె విమర్శించారు. ఢిల్లీలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. వీల్‌చైర్‌కే పరిమితమైన సాయిబాబాను మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 2014 మే నెలలో అరెస్ట్ చేశారు. 2017 మార్చిలో ఆయనకు యావజ్జీవ శిక్ష విధించారు. అప్పటి నుంచి ఆయన్ని నాగపూర్ కేంద్ర కారాగారంలోనే ఉంచారు. ఆయన ఆరోగ్యం పట్ల అక్కడి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వసంతకుమారి అన్నారు. తమ కుటుంబం హైదరాబాద్‌లో ఉంటున్నందున ఆయన్ని అక్కడికి తరలించాలని ఆమె డిమాండ్ చేశారు. చాలారోజులుగా ఆయనకు మందులు కూడా అందించలేదని ఆమె తెలిపారు. మూడు,నాలుగుసార్లు చెవులు, ముక్కులోంచి రక్తం కారినట్టు ఆమె తెలిపారు. చలికాలం జైలులో ఆయనకు స్వెట్టర్ కూడా ఇవ్వలేదని తెలిపారు. తాను ఎక్కువరోజులు బతికే అవకాశం లేదని డిసెంబర్‌లో సాయిబాబా తనకు రాసిన లెటర్‌లో చెప్పారని ఆమె గుర్తు చేశారు. న్యాయమా..? చావా..? ఏది ముందని తాను ఎదురు చూస్తున్నట్టు తన భర్త ఆవేదన వ్యక్తం చేశారని వసంతకుమారి తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి చూస్తే ఆయన ఇంకా బతికేందుకు చాలా తక్కువ అవకాశాలున్నా యని ఢిల్లీ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు నందితానారాయణ్ అన్నారు. చూడబోతే ఆయన చావుకే అధికారులు ప్రణాళికతో వ్యవహరిస్తున్నట్టుగా అర్థమవుతోందని ఆమె విమర్శించారు. అలా జరిగితే అది హత్యే అవుతుందని ఆమె స్పష్టం చేశారు.

## న్యాయమూర్తి లోయా మృతిపై పిటిషన్

- విచారణకు స్వీకరించిన సుప్రీం

**న్యూఢిల్లీ:** గుజరాత్‌కు చెందిన సెషన్స్ కోర్టు మాజీ న్యాయమూర్తి బ్రిజ్‌గోపాల్ లోయా మృతిపై విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు గురువారం ఈ పిటిషన్ వచ్చినపుడు దీనిపై శుక్రవారం విచారణ చేపట్టేందుకు న్యాయమూర్తులు అంగీకరించారు. గుజరాత్‌కు చెందిన సొహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి లోయా కేసు విచారణ సమయంలో 2014 డిసెంబర్ 1న మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆయన గుండెపోటుతో మరణించినట్టు ఆస్పత్రి రికార్డుల ద్వారా తెలుస్తుండగా, ఆయన మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా న్యాయమూర్తి లోయా మరణానికి దారి తీసిన పరిస్థితులపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరుతూ ముంబయి న్యాయవాదుల సంఘం గత సోమవారం ముంబయి హైకోర్టును ఆశ్రయించింది. ధర్మాసనంలోని న్యాయమూర్తులు ఎస్‌సి ధర్మాధికారి, భారతీ డంగ్రేలు ఈ కేసును ఈ నెల 23న విచారించేందుకు అంగీకరించారు. న్యాయమూర్తి లోయా మృతిపై ఆయన కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేసినట్టు కారవాన్ పత్రిక గతేడాది ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది.



### హాస్టల్ మెస్స్ బిల్లులపై 5 శాతం

# జీఎస్టీని ఉపసంహరించాలి

### కేంద్ర ప్రభుత్వానికి ఎస్ఎఫ్ఐ డిమాండ్





**న్యూఢిల్లీ:** హాస్టల్ మెస్స్ బిల్లులపై 5 శాతం జీఎస్టీ విధించడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. నిత్యావసరాల ధరలు పెరిగిన సమయంలో విద్యార్థులపై దీని ప్రభావం మరింత తీవ్రం కానున్నట్టు ఎస్ఎఫ్ఐ కేంద్ర కార్యనిర్వాహక కమిటి ఓ ప్రకటనలో తెలిపింది. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన దగ్గరి నుంచి విద్యార్థులకు ఉపకార వేతనాలు కూడా క్రమం తప్పకుండా అందడంలేదని ఎస్ఎఫ్ఐ విమర్శించింది. మెస్స్ బిల్లులపై జీఎస్టీని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు అందే సేవలను జీఎస్టీ నుంచి మినహాయిస్తున్నట్టు జులై 12న ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన ఆరు నెలల తర్వాత ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవడాన్ని ఎస్ఎఫ్ఐ గుర్తు చేసింది. విద్యార్థులు తమ ఆహారాన్ని తామే వండుకోవాలని ప్రభుత్వ ఉద్దేశమా అని ఎస్ఎఫ్ఐ ప్రశ్నించింది. ప్రయివేటీకరణ విధానంలో భాగంగా బీజేపీ ప్రభుత్వం విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించిందని, విద్యార్థులకు ఫెల్లోషిప్‌లను తగ్గించిందని ఎస్ఎఫ్ఐ గుర్తు చేసింది. దీంతో, విద్యార్థులు పెద్దసంఖ్యలో మధ్యలో చదువులు మానేయాల్సి వస్తోందని ఎస్ఎఫ్ఐ తెలిపింది. 2015, మే నెలలో యూజీసీ విడుదల చేసిన నోటిఫికేషన్ ఫలితంగా ఇప్పటికే ఎంఫిల్, పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్య తగ్గిందని ఎస్ఎఫ్ఐ తెలిపింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ తమ కార్యకర్తలకు పిలుపునిచ్చింది.

సోషల్ టాక్




# లావాలిన్ కేసు విచారణపై సుప్రీం స్టే



**న్యూఢిల్లీ :** కేరళలో ఎస్ఎన్‌సీ లావాలిన్ కేసు విచారణను తదుపరి ఉత్తర్వులు వెలువరించేదాక నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, విద్యుత్ శాఖ మాజీ ప్రిన్సిపాల్ సెక్రెటరీ కె మోహనచంద్రన్, ఇదే శాఖకు చెందిన అప్పటి సంయుక్త కార్యదర్శి ఎ ఫ్రాన్సిస్‌పై దాఖలైన నేరపూరిత, అవినీతి అభియోగాలను కొట్టిపారేస్తూ వారిని ఈ కేసు నుంచి తప్పిస్తూ గతేడాది ఆగస్టు 23 కేరళ హైకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేయగా..దానిపై విచారణను నిలిపివేస్తూ జస్టిస్ ఎన్‌వి రమణ, జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం గురువారం స్టే ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఈ కేసు నుంచి తమను కూడా తప్పించాలని అప్పటి కేరళ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు (కెఎస్ఇబీ) సభ్యుడు (అకౌంట్స్) కెజి రాజశేఖరన్, ఛీఫ్ ఇంజనీరు (జనరేషన్) కస్తూరి రంగా అయ్యర్ దాఖలు చేసుకున్న పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. విజయన్, మరో ఇద్దరిని తప్పించినట్టుగా వారిని కూడా ఎందుకు విముక్తి చేయలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. 'కొందరిని మాత్రమే విడుదల చేయడంలో తమకు అభ్యంతరాలున్నాయ'ని అడిషనల్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 227లో పేర్కొన్న తన న్యాయ పరిధులను హైకోర్టు దాటిపోయిందని, అందువల్ల ఈ కేసుపై పునఃవిచారణ చేపట్టాల్సిన అవసర ముందని మెహతా విన్నవించారు. తాము కొందరిని ఐచ్ఛికంగా ఎంపిక చేసుకొని అభియోగాలు నమోదు చేస్తున్నట్టు హైకోర్టు తమపై ఆరోపణలు చేసిందని, వాస్తవానికి హైకోర్టే ఎంపిక చేసుకొని ఈ కేసు నుంచి కొందరికి మినహాయింపు నిచ్చిందంటూ ఏకంగా హైకోర్టు ధర్మాసనంపైనే సీబీఐ ఆరోపణలు గుప్పించింది. ఇదే కేసులో ఇంకా విముక్తి పొందని నిందితుల తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, ఆర్ బసంత్ తమ వాదనలు వినిపిస్తూ సుప్రీంకోర్టులో తమ క్లయింట్లు దాఖలు చేసుకున్న డిచ్చార్జ్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నం దున ఈ కేసులో యథాతథ స్థితిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. 'మేము ఇంకా ఈ కేసుల నుంచి విముక్తి పొంద లేదు. విచారణ కొనసాగిస్తే మాకిప్పుడు హాని తలపెట్టినట్లే అవుతుంది' అని పేర్కొన్నారు. దీంతో ఏకీభవించిన ధర్మాసనం లావలీన్ కేసు విచారణను నిలిపివేస్తూ యథాతథ స్థితిని కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది.



## 'ఆధార్' కష్టాలు తీరేదెన్నడో..

- ఏడాదిన్నర కాలంగా దళితులకు అందని రేషన్
- కర్నాటకలో పచ్చి కూరగాయలు తిని నిరసన

**బెంగళూరు:** ఆధార్ కష్టాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. సంక్షేమ పథకాలకు ఆధార్ అనుసంధాన గడువు సుప్రీంకోర్టు పొడిగించినా అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. కర్నాటకలో ఆధార్ నెంబరును లింక్ చేసుకోలేదన్న కారణంతో కర్నాటకలో వందలాది కుటుంబాలకు రేషన్ సరుకులు అందడం లేదు. దీంతో వారు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు గోడు చెప్పుకున్నప్పటికీ కష్టాలు షరా మామూలే అయ్యాయి. దీంతో దళిత కుటుంబాలు ఊరి శివారులో నిరసన చేపట్టాయి. రాష్ట్రంలోని చిక్‌బల్లాపూర్ జిల్లా చౌడదేనహల్లి గ్రామంలో 40 దళిత కుటుంబాలకు ఏడాదిన్నర కాలంగా రేషన్ సరుకులు అందడం లేదు. కారణమేంటని అధికారులను ప్రశ్నిస్తే.. ఆధార్ లింకు చేసుకోవాలని మెలిక పెడుతున్నారు. రేషన్ సరుకులు అందకపోవడంతో వారికి పూట గడవడమే కష్టంగా మారింది. దీంతో దళితులు తమ పిల్లలతో సహా ఊరికి అర కిలోమీటరు దూరంలో ఆందోళన చేపట్టాయి. పచ్చి ఆకుకూరలు, కూరగాయాలు తిని నిరసన తెలిపారు. రేషన్ సరుకుల విషయమై ఇదివరకే రాష్ట్ర ఆహార సరఫరాల శాఖ మంత్రి యుటి ఖాదేర్‌ను కలిస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు. అయినాగానీ ఈ వ్యవహారంలో ఎలాంటి ముందడుగూ పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో లబ్దిదారులకు రేషన్ సరుకులు అందడం లేదని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# చెప్పాలనుకున్న విషయాలను ప్రజలకే వివరిస్తా

- పార్టీ అధినేతలతో ఇక కలవదలుచుకోలేదు..
- ఇది అప్పటి బీజేపీ కాదు
- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విమర్శిచారు...
- అధికారంలోకి వచ్చాక వాటినే అమలుచేస్తున్నారు : యశ్వంత్ సిన్హా




**జబల్పూర్ :** 'దాదాపు 13 నెలల క్రితం ప్రధాన మంత్రి మోడీని కలిసేందుకు అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. కానీ ఇంతవరకూ దానికి సమాధానం రాలేదు. అందుకే ఇక నుంచి ఎవరినీ కలవకూడదని, చెప్పాలనుకున్న విషయాలను ప్రజలకు నేరుగా వివరించాలని నిర్ణయించుకున్నాను' అని బీజేపీ సీనియర్ నేత యశ్వంత్ సిన్హా అన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్సింగ్‌పూర్ జిల్లా గదర్వార్‌లో శుక్రవారం జరిగే రైతు ఆందోళనా కార్యక్రమంలో యశ్వంత్‌సిన్హా పాల్గొననున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన విధానాలన్నింటినీ అధికారంలోకి వచ్చాక బీజేపీ అమలుచేస్తున్నదని ఆరోపించారు. 'దేశంలో రైతులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో కూడా రైతుల పరిస్థితి ఏమీ బాగోలేదు' అన్నారు. 'ఇది అప్పటి బీజేపీ కాదు.. అటల్ బిహారీ వాజ్‌పేయి, అద్వానీ హయాంలో పార్టీ పరిస్థితి ఎంతో బాగుండేది. కింది స్థాయి కార్యకర్త సైతం ఢిల్లీకి వెళితే పార్టీ అధ్యక్షుడితో ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకుండానే కలవగలిగేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు' అన్నారు. 'ఇప్పుడు సీనియర్, ముఖ్య నేతలకు కూడా పార్టీ అధ్యక్షుడితో అపాయింట్‌మెంట్ దొరకడంలేదు. వివిధ అంశాలపై ప్రధాన మంత్రితో చర్చించేందుకు 13 నెలల క్రితం ఆయన అపాయింట్‌మెంట్ కోరాను. కానీ, ఇంతవరకూ లభించలేదు. అందుకే ఇక బహిరంగంగానే మాట్లాడాలని నిర్ణయించుకున్నాను' అన్నారు. ప్రధానమంత్రి, అమిత్ షా తదితరులున్న ఒక ఫోటోను చూపిస్తూ.. 'ఈ ఫోటోలో రాజ్‌నాథ్ సింగ్, అనంత్‌కుమార్, సుష్మా స్వరాజ్ ఇతరులందరూ కనిపిస్తున్నారు. కానీ, అద్వానీ కనీసం వెనుక వరుసలో కూడా లేరు. ముఖ్యమైన నేత నుంచి ఆయన ఇప్పుడు సాధారణ కార్యకర్త అయిపోయారు' అని యశ్వంత్ సిన్హా విమర్శించారు. గత కొంతకాలంగా బీజేపీ పాలనపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే.

# బాగ్దాదీ, పాకిస్థానీ, ఒసామా,ఐఎస్

- మీ తల్లిదండ్రులు బాంబులు తయారు చేస్తారా..?
- ఢిల్లీ పాఠశాలల్లో ముస్లిం విద్యార్థుల పట్ల వెటకారపు వ్యాఖ్యలు... వెల్లడించిన బాధితులు
- 'మదరింగ్ ఏ ముస్లిం' పేరుతో నజియాఎరుమ్ రచన

**నవతెలంగాణ డెస్క్**



ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ లక్ష్యంగా ఆ దేశంపై వరుస దాడులు, పశ్చిమాసియా దేశాల్లో జోక్యం, ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా సాగించిన మారణకాండ..ఈ నేపథ్యంలో అమెరికాలోని న్యూయార్క్ నగరంపై ఒసామా బిన్‌లాడెన్ నేతృత్వంలోని అల్‌ఖైదా జరిపిన ఉగ్రదాడి(సెప్టెంబర్, 2001)..1990 నుంచి 2001 వరకూ ప్రపంచంలో జరిగిన కొన్ని సంఘటనలివి..ఇదే కాలంలో భారత్‌లోనూ కొన్ని హింసాత్మక ఘటనలు జరిగాయి. బాబ్రీమసీద్–రామజన్మభూమి వివాదం నేపథ్యంలో 1990లో బీజేపీ అగ్రనేత ఎల్‌కె అద్వానీ చేపట్టిన రథయాత్ర రెండు మతాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. హైదరాబాద్‌సహా దేశంలోని కొన్ని నగరాల్లో మత కలహాలు జరిగాయి. 1992, డిసెంబర్ 6న అయోధ్యలోని బాబ్రీ మసీద్‌ను హిందూత్వవాదులు కూల్చి వేశారు. ఆ సంఘటన జరుగుతున్నపుడు బీజేపీ, సంఘ్‌పరివార్‌కు సంబంధించిన ముఖ్య నేతలు అక్కడే ఉన్నారు. దాంతో, దేశవ్యాప్తంగా మరోసారి మత కలహాలు రాజుకున్నాయి. 1993లో ముంబయిలోని కొన్ని చోట్ల దావూద్ ఇబ్రహీం ముఠాకు చెందిన వ్యక్తులు బాంబు దాడులకు పాల్పడ్డారు. 2002లో గుజరాత్‌కు ప్రస్తుత ప్రధాని మోడీ సీఎంగా ఉన్నపుడు ఆ రాష్ట్రంలో మత కలహాలు జరిగాయి. మైనారిటీలు పెద్దసంఖ్యలో ఆ దాడుల్లో చనిపోయారు.

అటు అమెరికాసహా యూరోపియన్ దేశాల్లో, ఇటు భారత్‌లోనూ ముస్లింల పట్ల వ్యతిరేక భావాలను పెంచి పోషించేందుకు కారణమైన సంఘటనలవి. కానీ, కొద్దిమంది ఉగ్ర చర్యల కారణంగా యావత్ ముస్లిం సమాజాన్ని నిందితులుగా చూడటం న్యాయ సూత్రాలను, ఆదర్శాలను వక్రీకరించడమే అవుతుంది. అయితే, ఈ పరిస్థితిని ఓ రాజకీయ పార్టీ తాను బలపడేందుకు వ్యూహాత్మకంగా ఉపయోగించుకున్నది. విభజన రాజకీయాల ద్వారా మెజార్టీ ఓట్లను కొల్లగొట్టి అధికారం చేజిక్కించుకోవడం తేలికన్న భావన ఆ పార్టీ నేతల్లో బలంగా నాటుకుపోయింది. బాబ్రీ మసీద్ కూల్చివేత అనంతరం తాము బలపడిన తీరునే ఆ పార్టీ నేతలు ఎప్పుడూ నెమరువేసుకుంటారు.

కానీ,మన దేశానికి ఓ రాజ్యాంగం ఉన్నది. రాజ్యాంగం పీఠికలోనే లౌకిక విధానాన్ని అనుసరించాలని స్పష్టంగా చెప్పారు. ప్రాథమిక హక్కుల్లో మత స్వేచ్ఛకు హామీ ఇచ్చారు. భిన్నత్వంలో ఏకత్వమే మన విధానమనేలా మన రాజ్యాంగం మనకు స్ఫూర్తినిస్తుంది. పాఠశాల స్థాయి నుంచి ఇవే ఆదర్శాలను విద్యార్థులకు బోధిస్తారు. ఆచరణలో మాత్రం మత సంకుచిత భావాల్నే కొందరు ఉపాధ్యాయులు అనుసరిస్తున్నతీరు ఆందోళన కలిగిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలోని పాఠశాలల విద్యార్థులకు విభజన బీజాలు నాటుతున్నారంటే..పరిస్థితి ఏస్థాయికి దిగజారిపోతుందో అర్థం చేసుకోవాలి. ముస్లిం కుటుంబాలకు చెందిన చిన్నారులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్వేష దాడుల గురించి నజియాఎరుమ్ అనే రచయిత క్షేత్రస్థాయిలో ఓ అధ్యయనం నిర్వహించారు. బాధితులు చెప్పిన వివరాలను 'మదరింగ్ ఏ ముస్లిం' పేరుతో గ్రంథస్తం చేశారు. 2014లో సార్వత్రిక ఎన్నికల కోసం ప్రచారాలు జోరుగా సాగుతున్న సమయంలో తన రచనను ప్రారంభించినట్టు ఆమె తెలిపారు. తమపై ఎవరికైనా కోపం వస్తే బాగ్దాదీ, పాకిస్థానీ, బంగ్లాదేశీ, ఒసామా, ఐఎస్ఐఎస్ అంటూ తిట్ల దండకం అందుకునేవారని బాధిత ముస్లిం విద్యార్థులు తనతో చెప్పారని ఆమె అందులో వివరించారు. మీ ఇంట్లో మీ తల్లిదండ్రులు బాంబులు తయారు చేస్తారా..? మీ నాన్నకు కోపం వస్తే నన్ను తుపాకీతో కాల్చేస్తాడా..? అంటూ వెటకారంగా ప్రశ్నించేవారని ముస్లిం విద్యార్థులు తెలిపారు. ఇలాంటి విద్వేష భాషణ,దూషణ కేవలం చిన్నారుల విషయంలోనేకాదు, అన్ని వయసులవారి పట్లా జరుగుతోందని ఆమె తన పుస్తకంలో పేర్కొన్నారు. ఇటువంటి ధోరణి సమాజానికి మంచిది కాదని ఆమె హితవు పలికారు. విద్వేష దూషణ కేవలం ఢిల్లీ పాఠశాలలకే పరిమితం కాదని, అమెరికా పాఠశాలల్లోనూ ఇది తీవ్ర రూపం దాల్చినట్టు ఆమె తెలిపారు. కేవలం మతం కారణంగానే తమ పిల్లలు బెదిరింపులకు గురయ్యారని అమెరికాలోని 42 శాతం ముస్లిం తల్లిదండ్రులు 2017 మార్చిలో నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడించారని ఆమె తెలిపారు. అవమానించడం లేదా భౌతిక దాడికి పాల్పడ్డారని వారు చెప్పారు. ఉపాధ్యాయులు లేదా పాఠశాల నిర్వాహకులు వేధింపులకు పాల్పడినట్టు నలుగురిలో ఒకరు తెలిపారు. 2017 అక్టోబర్‌లో అమెరికా–ఇస్లామిక్ సంబంధాల మండలి విడుదల చేసిన నివేదిక ప్రకారం ముస్లిం విద్యార్థులపై పాఠశాలల్లో వేధింపులు పెరిగిపోయాయి. తమ హిజాబుల ను బలవంతంగా తొలగించేవారని 36 శాతంమంది ముస్లిం బాలికలు తెలిపారు. తమ మతాన్ని దూషిస్తూ ఆన్‌లైన్‌లో వ్యాఖ్యలు పోస్ట్ చేసినట్టు 57 శాతంమంది తెలిపారు. ముస్లింలంటేనే ఉగ్రవాదులన్న తీరుగా డోనాల్డ్ ట్రంప్ సాగించిన ఎన్నికల ప్రచారం కూడా విద్వేష భావాల్ని మరింతగా పెంచినట్టు చెబుతున్నారు.

### విద్వేష బీజాలు

ఆయేషా అనే విద్యార్థిని 2015లో మధ్య ఢిల్లీలోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదివేందుకు చేరారు. 1965లో జరిగిన భారత్–పాకిస్థాన్ యుద్ధానికి సంబంధించి పాఠశాలలో అలంకరణకు ఇంచార్జ్‌గా ఆమెకు బాధ్యత ఇచ్చారు. ఆ సందర్భంగా పాక్ జెండాను ఆమె కత్తిరించారు. దాంతో, ' ఓ..మీ దేశపు జెండాను కత్తిరిస్తావా..?' అంటూ ఆమె క్లాస్‌మేట్ ఆశ్చర్యంగా ప్రశ్నించారు. 'మొదట ఆ మాటలు నాకు అర్థం కాలేదు. ఎందుకలా అన్నావని అతన్ని అడిగాను. నీకు తెలియదా అంటూ అతను నాకు వివరించారు' అంటూ ఆరోజు జరిగిన సంఘటనను ఆమె గుర్తు చేశారు. ఇప్పుడు ఆయేషా 11వ తరగతి చదువుతున్నారు. ఆమె తల్లి నజ్రీన్(50) వాణిజ్య సలహాదారుగా పని చేస్తున్నారు. '1970, 80లలో ఈశాన్య భారత్‌లో నేను పెరిగాను. ఢిల్లీలోని కళాశాలలో చేరకముందు ఇది నా దేశం కాదు అన్న అభిప్రాయం నాకు ఎన్నడూ కలగలేదు' అని నజ్రీన్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యానంతరం జరిగిన దేశ విభజననాటి నుంచీ ముస్లిం వ్యతిరేకత కొనసాగుతున్నదని జామియా మిలియా ఇస్లామియా ప్రొఫెసర్ జానకీరాజన్ అన్నారు. పాఠశాల విద్యార్థుల మధ్య 30 ఏండ్లు పని చేసిన అనుభవం రాజన్‌కు ఉన్నది. మతహింస క్రూరత్వాన్ని చూసిన ఆనాటి తరం తమ వారసులకు ఆ అనుభవాలను చెబుతూ రావడమే అందుకు కారణమని ఆయన వివరించారు. మత ఉద్రిక్తతల సమయంలో విద్వేషం తీవ్ర రూపంలో వ్యక్తమవుతుందని రచయిత విశ్లేషించారు. 1992 ముంబయి అల్లర్ల సమయంలో నాలుగేండ్ల వయసున్న తన మేనకోడలిని అదే వయసులోని పొరుగింటి బాలిక కాకరపూలతో(మతాబు) ఒంటిపై కాల్చిందని నజ్రీన్ తెలిపారు. పశ్చిమ ఆసియా దేశాల్లో జరుగుతున్న ఉగ్రదాడుల గురించి వార్తా ఛానళ్లు ఎడిట్ చేయకుండా వీడియోలను చూపించడం వల్ల కూడా తమ పట్ల వ్యతిరేకత పెరగడానికి కారణమని ముస్లిం తల్లిదండ్రులు తెలిపారు. పెద్దలు చెప్పగా విన్నవాటికీ, తాము చూసిన వాటికీ త్వరగా స్పందించే గుణం పిల్లల్లో ఉంటుందని సఫ్దర్‌జంగ్ ఎన్‌క్లేవ్‌లోని సెయింట్ మేరీ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నీకోషీ అన్నారు. పాక్ సరిహద్దులో జరుగుతున్న సంఘటనలు, గో సంరక్షకులు, ట్రిపుల్ తలాక్‌కు సంబంధించిన వార్తలు ముస్లింలను వేరు పరిచి చూపిస్తాయని, ముస్లిం అంటే పాకిస్థానీ అన్న భావన కలిగిస్తాయని అన్నీకోషీ వివరించారు. తమ దృష్టికి అటువంటివి వచ్చినపుడు ప్రత్యామ్నాయ భావజాలాన్ని బోధిస్తామని ఆమె తెలిపారు. దక్షిణఢిల్లీలోని ఓ కాన్వెంట్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన సమయంలో ముల్లా లేదా ఉగ్రవాది అన్న వెటకారపు మాటలను వినడం తమకు అలవాటైపోయిందని ఓ విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిసార్లు ఈ మాటలు చిన్నపాటి కొట్లాటలకు దారితీస్తాయని కూడా ఆ విద్యార్థి తెలిపారు. ఢిల్లీలోని ముస్లిం విద్యార్థులకు ఓ స్వచ్ఛంద సంస్థ ఇటువంటి ఘటనలను ఎలా ఎదుర్కోవాలన్నదానిపై సలహాలు ఇస్తున్నట్టు రచయిత తెలిపారు. గొడవలకు దారితీయకుండా సర్దుకుపోవాలని తల్లిదండ్రులు కూడా పిల్లలకు సూచిస్తున్నారు.

పాఠశాలల్లో సమ్మిళిత, సానుకూల వాతావరణం ఎలా..?

మత విద్వేషానికి సంబంధించిన సంఘటనలు జరిగినపుడు వాటి గురించి పాఠశాలలోని విద్యార్థులతో విమర్శనాత్మకంగా చర్చించాలని అన్నీకోషీ సూచించారు. అటువంటి ఆలోచనలను వేర్లతోసహా తొలగిస్తే సమస్యే ఉత్పన్నం కాదని ఆమె అన్నారు. అందుకు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ అవసరమనని కూడా ఆమె తెలిపారు. ఉపాధ్యాయులకు శిక్షణ తప్పనిసరి అవసరమని సెంటర్ ఫర్ సోషల్ ఈక్విటీ అండ్ ఇన్‌క్లూసియన్ డైరెక్టర్ అన్నీనామాల అన్నారు. 2010లో విద్యాహక్కు చట్టం అమలు కోసం ఏర్పాటైన జాతీయ సలహా మండలిలో ఆమె సభ్యురాలు. ఈ అంశంలో శిక్షణలేనివాళ్లు విద్యార్థులకు సరైన బోధన చేయలేరని ఆమె స్పష్టం చేశారు.

విద్యార్థులు తమకు తాముగా సామరస్యంగా పరిష్కరించుకోవడం మరో పద్ధతి. ఆయేషా తనకు ఎదురైన సంఘటన గురించి స్నేహితులకు చెప్పారు. దాంతో, ఆమె తన స్నేహితులతో కలిసి తనను అవమానించిన విద్యార్థితో చర్చించారు. చివరికి ఆ బాలుడు క్షమాపణ చెప్పారు. ఉన్నత పాఠశాలలో మాత్రం ముల్లా లేదా ఉగ్రవాది అన్న వెటకారపు మాటలను తాను ఏనాడూ వినలేదని మరో ముస్లిం విద్యార్థి సాహిల్ తెలిపారు. ఇది పరిపక్వతకు సంబంధించినదని సాహిల్ అన్నారు. తమ దోషాలను తాము గుర్తించగలినపుడు వారు మంచిగా మాట్లాడ్తారని ఆయన అన్నారు. ముస్లిం లేదా ఇతరులు ఎవరైనా సమానమే అన్న భావన ఉంటే మతం, కులం, రంగు భేదంతో ఎవరూ వ్యాఖ్యలు చేయరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**(వారి రక్షణమేరకు పేర్లు మార్చాం)....హిందుస్తాన్‌టైమ్స్ సౌజన్యంతో**

# రైతుల పాస్‌బుక్కులు ఇప్పట్లో లేనట్టే

## 26కు ఇచ్చే అవకాశం తక్కువే

- 70 లక్షల ఖాతాలకు పుస్తకాలు అవసరం
- ఇంకా టెండర్లే పూర్తిగాలే


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతులకు జారీచేసే ఎలక్ట్రానిక్ పాస్‌బుక్కుల పంపిణీ ఇప్పుడప్పుడే కొలిక్కివచ్చేలా లేదు. భూరికార్డుల ప్రక్షాళన వ్యవహారం ఇంకా పూర్తి కాకపోవడం, పాస్‌బుక్కుల కోసం అధికారికంగా టెండర్లను ఇంకా పిలవకపోవడం ఇందుకు కారణాలుగా అధికారులు చూపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూరికార్డుల తనిఖీల వ్యవహారం జరుగుతున్న క్రమంలో పలుమార్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులు, కలెక్టర్లు, సీసీఎల్‌ఏ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా జనవరి ప్రారంభంలోనేత రైతులకు ఎలక్ట్రానిక్ తరహా పాస్‌బుక్కులు ఇస్తామని ప్రకటించారు. ఇలాంటి ప్రకటలు రాష్ట్రంలో ఆయా పర్యటనల తరుణంలోనూ చెప్పారు. అయితే ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈమేరకు చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం వెనుకబడింది. దాదాపు రెండేండ్లుగా పర్మినెంట్ భూపరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ) లేకపోవడం, ముఖ్యకార్యదర్శి ఉన్నా ప్రభుత్వ కార్యక్రమాల్లో తీరికలేకుండా ఉండటంతో ఎలక్ట్రానిక్ పాసుపుస్తకాల తయారీలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఇప్పటికీ టెండర్లు పిలవలేదు. దీనికి మరో ప్రధాన కారణం కూడా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. 'మా భూమి' పేర ప్రారంభించిన వెబ్‌ల్యాండ్ ప్రస్తుత ప్రభుత్వ, రైతుల అవసరాలను తీర్చేపరిస్థితి లేదని అంటున్నారు. ఈనేపథ్యంలో కొత్త సాఫ్ట్‌వేర్‌తో కొత్త పోర్టల్‌ను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు అధికారిక సమాచారం. ఈ పోర్టల్‌కు, పాస్‌పుస్తకాలతో లింక్ ఉంటుందని, అంతేగాక రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ, బ్యాంకులకు సమన్వయం చేయాల్సిన అవసరం కూడా ఉందని అంటున్నారు. ఈనేపథ్యంలో ఇంకా కొంత సమయం పడుతుందని కూడా అభిప్రాయపడుతున్నారు.

**70 లక్షల ఖాతాలు**

రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల రైతు, ఇతర ఖాతాలు ఉన్నాయి. గ్రామాలవారీగా పాసుబుక్కులు జారీచేయాల్సి ఉంటుంది. ఒక గ్రామంలో ఒకరి పేరు మీద ఎన్ని సర్వే నెంబర్లలో భూమి ఉన్నా ఒకే పాస్‌పుస్తకం జారీచేస్తారు. అదే వ్యక్తి ఇతర గ్రామాలు, ప్రాంతాల్లో కూడా ఇతర ఆస్తులు, భూములు కలిగి ఉంటే మరో పుస్తకం ఇస్తారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని రైతులు, ఇతరులకు 2 కోట్ల ఎలక్ట్రానిక్ పాస్‌పుస్తకాలను ముద్రించాల్సి రావచ్చని రెవెన్యూ శాఖ అంచనా వేస్తున్నది.

ఇతమిద్ధంగా ఒక నిర్ణయానికి రావాలంటే రెవెన్యూ భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం పూర్తి కావాల్సి ఉంటుంది. గ్రామాల్లో అధికారులు తిరిగి సర్వే పూర్తిచేసినా, వాటిని పహణీలో నింపి, దానిని ఆన్‌లైన్ అప్‌డేట్ చేసేవరకు ఇంకా సమయం పడుతుందని కూడా రెవెన్యూ యంత్రాంగం చెబుతున్నది. అది జరిగితేగాని పాసుబుక్కులు ఎన్ని ప్రింట్ చేయాలనే విషయంలో స్పష్టత రాదని కూడా అంటున్నారు.

**20 నుంచి 30 సెక్యూరిటీ ఫీచర్లు**

ఎలక్ట్రానిక్ పాస్‌బుక్కుల్లో 20 నుంచి 30 సెక్యూరిటీ ఫీచర్లు పొందుపరిచే అవకాశం ఉందని సమాచారం. సహజంగా భూయజమాని పేరు, చిరునామా, సర్వే నెంబరు, భూముల వివరాలు, ఎంత భూమి ఉంది, గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం పేరు ఇవ్వనే ప్రత్యేకంగా మరికొన్ని ఫీచర్లను ఎలక్ట్రానిక్ పాస్‌పుస్తకం ద్వారా పరిచయడం చేయనున్నారు. అవి ఏంటంటే పాసుబుక్కు నీటిలో కూడా తడవకుండా ఉండటం, ట్యాంపరింగ్, డూప్లికేషన్ లేకుండా చేయడం, ఇటీవల ఆర్‌బీఐ జారీచేసిన కొత్త నోట్ల తరహాలో రూపొందించడం, ప్రభుత్వ ఎంబ్లం అంతర్లీనంగా అమర్చడం తదితర సెక్యూరిటీ ఫీచర్లతో ఈ ఎలక్ట్రానిక్ పాస్‌బుక్కులు తయారవుతాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

**ధర పెరిగే అవకాశం**

ఎలక్ట్రానిక్ పాసుబుక్కులు విభిన్న తరహాలో ప్రింట్ చేయాలని భావిస్తున్న తరుణంలో వీటికి రేటు సైతం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులే అంటున్నారు. పాత పాసుబుక్కులు(పుస్తకం)తోపాటు టైటిల్‌డీడ్‌లకు రూ.30కి మించి ఉండగా కొత్తగా వచ్చేవి ఆ ధరకు సాధ్యం కాదని అభిప్రాయపడుతున్నారు. కనీసం రూ. 300 నుంచి రూ. 500 ఉండే అవకాశం లేకపోలేదని తెలిసింది. లేకపోతే ఆ ఖర్చును ప్రభుత్వమే భరించి ఉచితంగా ఇచ్చే అవకాశాన్ని కూడా సర్కారు పరిశీలనలో ఉందని అంటున్నారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసే బదులు, కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడమే మేలనే అభిప్రాయంతో రెవెన్యూ ఉన్నతాధికారులు ఉన్నట్టు సమాచారం.

## కైట్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి చందూలాల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం కైట్ మరియు స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తుందని పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి చందూలాల్ తెలిపారు. గురువారం సచివాలయంలో పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో కలిసి ఆయన ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 13 నుంచి 15వరకు ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ స్వీట్స్ ఫెస్టివల్‌లో వెయ్యి రకాల స్వీట్లను ఒకే వేదికపై ప్రదర్శించటం ప్రపంచం లోనే ఇదే మొదటిసారి అన్నారు. వివిధ రాష్ట్రాల దేశాల ప్రజల స్వయం గా తయారు చేసిన ఈ స్వీట్లను ప్రదర్శించడంతోపాటు అమ్మకాలను జరుపుకు నేందుకు కౌంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. బుర్రా వెంకటేశం మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ నగరంగా పేరుందని, ఆ స్థాయిలో స్వీట్ పెస్టివల్‌ను నిర్వహిస్తామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు ఒకే కౌంటర్ వద్ద స్వీట్లను తయారు చేయడం ద్వారా మిని ఇండియాను తలపిస్తుందన్నారు.



## మద్దతు ధర ఇచ్చి వేరుశనగ రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కష్టాల్లో ఉన్న వేరుశనగ రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేశారు. మద్దతు ధర ఇచ్చి ఆయిల్‌ఫెడ్ లేదా మార్క్‌ఫెడ్ ద్వారా వేరుశనగను కొనిపించాలని, ఎక్కువ తూకాన్ని ఆపివేయాలని రైతులు ఆందోళన చేస్తున్నారని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని మార్కెట్లలో రైతులకు మద్దతు ధర లభించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి జంగారెడ్డి, టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ చివర్లో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిందని, మద్దతు ధరలు గిట్టక వేరుశనగ రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అధికవర్షాల వల్ల మామూలుగా ఎకరానికి 10-12 క్వింటాళ్ల సగటు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 5-6 క్వింటాళ్ల దిగుబడినే రైతులు ఈ సంవత్సరం పొందుతున్నారని పేర్కొన్నారు. వేరుశనగకు నిర్ణయించిన మద్దతుధర క్వింటాలుకు రూ 4550కు గాను మార్కెట్లో సగటున 3వేలకే కొంటున్నారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేరుశనగను ఎక్కువగా సాగు చేస్తున్నారని, జిల్లాలో ఉన్న 18 మార్కెట్లలోకి వేరుశనగ అమ్మకానికి వస్తోందన్నారు. మట్టి, తేమ ఉన్నదనే పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు కుమ్మక్కై రైతులకు చెల్లించే ధరను బాగా తగ్గించి కొంటున్నారని చెప్పారు. ఎకరానికి రూ 25-30 వేల పెట్టుబడి పెట్టిన వేరుశనగ వస్తున్న ధరకు రైతులు సాగుఖర్చును కూడా రాబట్టుకోలేకపోతున్నారన్నారు. ఈ స్థితి రైతుల్లో ఎంతో ఆందోళన కల్గిస్తుందన్నారు. మార్కెట్ సిబ్బంది కూడా వ్యాపారులకే అనుకూలంగా ఉంటున్నారు తప్ప రైతులకు సహాయకారిగా ఏ మాత్రం ఉండటం లేదని విమర్శించారు. వ్యాపారస్తులు బస్తాకు ఒక కిలో కాయల్ని అదనంగా తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

## రుణమాఫీ వడ్డీపై సర్కార్‌ను నిలదీయాలి

### కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో ఉత్తమ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రైతులకు లక్ష రూపాయలు రుణ మాఫీ చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేసిందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రైతురుణ మాఫీ నాలుగు విడతలుగా ఇవ్వడమే కాకుండా దానికి వడ్డీ మాఫీ చేస్తామని సీఎం అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదని మండిపడ్డారు. ఈ విషయంలో శాసనసభ స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ కిసాన్ ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ చెర్మెన్ కోదండరెడ్డి అధ్యక్షతన జరిగిన కిసాన్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ వడ్డీ మాఫీపై అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చి సీఎం మాట తప్పారన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రైతు సమస్యలపై ఆర్మూర్ డిక్లరేషన్ ప్రకటించామని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దానిపై రైతుల నుంచి ఎంతో ఆదరణ లభించిందన్నారు. 2019 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. 7న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరోసారి స్పీకర్‌ను కలిసి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, జి చిన్నారెడ్డి జిల్లాల రైతు నాయకులు పాల్గొన్నారు.

**కోయ, గొండుల సమస్యపై గవర్నర్ ప్రేక్షకపాత్ర : మాజీ ఎంపీ రవీంద్రనాయక్**

రాష్ట్రంలో కోయ, గొండు, ఆదివాసులు తమకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన చేస్తుంటే ఆ సమస్యను పరిష్కరించాల్సిన రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ విమర్శించారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు భజన చేయడానికి మాత్రమే గవర్నర్ పరిమితమవుతున్నారని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో సీనియర్ నేత సూర్యానాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మేడారం జాతర వరకు వేచి చూస్తామని, అప్పటికీ ఈ సమస్యను పరిష్కరించకపోతే హస్తినలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.



## మీడియాపై సమాజం బాధ్యత

- మహిళలు కింగ్ మేకర్‌గా ఎదగాలి: కలెక్టర్ అనితారామచంద్రన్
- 'నవతెలంగాణ-స్టాన్‌ఫోర్డ్' ముగ్గుల పోటీలను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి



నవతెలంగాణ-యాదాద్రిభువనగిరి ప్రతినిధి

మీడియాపై సమాజం బాధ్యత ఉందని, ఆ దిశగా మీడియా పనిచేయాల్సి ఉందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ అనితారామచంద్రన్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నవతెలంగాణ దినపత్రిక - స్టాన్‌ఫోర్డు మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ అనితారామచంద్రన్, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బోగి మంటలను కలెక్టర్ వెలిగించారు. అనంతరం పతంగులను ఎగురవేశారు. ముగ్గుల పోటీలో విజేతలకు జాయింట్ కలెక్టర్ రవినాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కర్నాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మహిళలనుద్దేశించి ప్రసంగించారు. సంక్రాంతి పండుగ సమాజానికి నైతిక విలువలు నేర్పుతుందన్నారు. సమాజంలో నైతిక విలువలను కాపాడటానికి నవతెలంగాణ దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆర్థిక బంధాలతో మానవ సంబంధాలు తెగిపోతున్న క్రమంలో పండుగలు వాటి విలువను గుర్తు చేస్తాయన్నారు. మహిళలు డిజిటల్ యుగంలో రాణిస్తున్నా ఇంకా అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో మహిళలు కింగ్ మేకర్‌గా ఎదిగినప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ప్రతి మహిళాఆర్థిక స్వావలంభన వైపు అడుగులు వేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంట సిరులు కురిపించేందుకు వచ్చే సంక్రాంతిని నవతెలంగాణ పత్రిక- స్టాన్‌ఫోర్డు ముగ్గుల పోటీతో మూడు రోజుల ముందే తీసుకొచ్చిందన్నారు. సమాజ అభ్యున్నతి కోసం నవతెలంగాణ చేస్తున్న అక్షరపోరాటం అభినందనీయమన్నారు. జాయింట్ కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ.. సేవ్ చైల్డ్, భ్రూణహత్యలు నివారించాలి, కులవ్యవస్థను నిర్మూలించండి అంటూ పాలు సామాజిక అంశాలను గుర్తు చేస్తూ మహిళలు వేసిన ముగ్గులు నిజంగా అభినందనీయమన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, కళాశాల చైర్మెన్ లయన్ దేవరం లింగారెడ్డి, కరస్పాంటెండెంట్ నాగస్వాతి, నవతెలంగాణ జిల్లా స్టాఫ్‌రిపోర్టర్ దుడుక రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ ఆర్సీ ఇన్‌చార్జి కొలుపుల వివేకనంద, ఏడీవీటీ ఇన్‌చార్జి ఎస్‌కె ఉస్మాన్ షరీఫ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కుంట సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


సంపాదకీయం

# అమెరికా అమానవీయ నిర్ణయం!

ఎల్ సాల్వెడార్‌కు చెందిన 2,60,000మంది ప్రజలకు ఇచ్చిన తాత్కాలిక రక్షణ హోదా (టీపీఎస్)ను రద్దు చేస్తున్నట్టు అమెరికా ప్రభుత్వానికి చెందిన హోమ్‌లాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ సోమవారంనాడు ప్రకటించింది. 18నెలల్లో అంటే 2019 సెప్టెంబరు9వ తేదీకల్లా వీరందరూ అమెరికాను విడిచి వెళ్ళాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అలా చేయని వారిని నిర్బంధంగా ఎల్ సాల్వెడార్‌కు పంపటం జరుగుతుందని చెప్పారు. ఇలా టీపీఎస్ హోదాగల 2,60,000 మందితో పాటుగా వారి 1,90,000 మంది పిల్లలు కూడా ఇలా అమెరికాను వీడవలసిన ఎల్ సాల్వెడార్ ప్రజలలో ఉన్నారు. అంటే అమెరికాలోని టొలేడో, న్యూ ఓర్లీన్స్‌వంటి పట్టణాలలో ఎంత జనాభా ఉంటుందో అంతమందిని అమెరికా నుంచి బలవంతంగా పంపనున్నారు.

**అమెరికాలో నివసిస్తున్న ప్రజలందరూ ఎప్పుడోఒకప్పుడు వలసగా వచ్చిన వారే. ఎల్ సాల్వెడార్ నుంచి వలసగా వచ్చి టీపీఎస్ హోదావున్న కార్మికులను కాపాడే శక్తి వర్ణ, జాతి వివక్షలకు అతీతమైన కార్మిక వర్గానికి మాత్రమే ఉన్నది. తమ మధ్య జీవిస్తున్న తమ తోటి ఎల్ సాల్వెడార్ కార్మికులను కాపాడుకునే కర్తవ్యాన్ని తోటి అమెరికా కార్మికులు ఎలా నిర్వహిస్తారో రాబోయే రోజుల్లో తెలుస్తుంది.**

అయితే అంతమంది ప్రజలను వారి స్వదేశానికి బలవంతంగా పంపటం అంత తేలిక కాదు. ఉదాహరణకు అమెరికా రాజధాని నగరమైన వాషింగ్టన్ డీసీ ప్రాంతంలో 50వేలమంది, లాస్ ఏంజెల్స్ నగరంలో 40వేలమంది, హూస్టన్, న్యూయార్క్ నగరాలలో మరో 50వేలమంది ఎల్ సాల్వెడార్ ప్రజలు నివసిస్తున్నారు. వీరందరినీ నిర్బంధంగా వారి దేశానికి పంపాలంటే ఫాసిస్టు తరహా ఆపరేషన్ అవసరమౌతుంది. అంత ర్యుద్ధాల నుంచీ లేక ప్రకృతి వైపరీత్యాలనుంచీ పారిపోయి తలదాచుకునే వారికి అమెరికాలో అనుమతి ఇచ్చినవారిలో ఎల్ సాల్వెడార్ ప్రజలే అత్యధిక శాతం ఉన్నారు. సంప్రదాయ కాందిశీకులకు ఇచ్చే అనుమతుల కంటే టీపీఎస్ హోదా ఉన్నవారికి ఎక్కువ కాలం అనుమతులు ఉంటాయి.



టీపీఎస్ హోదాతో ఎల్ సాల్వెడార్ నుంచి స్థిరపడినవారి మూలాలు అమెరికా కార్మికవర్గంలో చాలా లోతుగా ఉన్నాయి. సాల్వెడార్ నుంచి అమెరికాకు వలస వచ్చినవారు సగటున గత 21ఏండ్లుగా జీవిస్తున్నారు. ప్రస్తుతం నిర్బంధంగా పంపదలచిన వారు మధ్యవయసుకు వచ్చారు. వారి జీవితాలలో ప్రధాన భాగం అమెరికాలోనే గడిచింది. ఒక అంచనా ప్రకారం ఈ ఎల్ సాల్వెడార్ కార్మికులను నిర్బంధంగా అమెరికా నుంచి పంపివేస్తే రాబోయే పదేండ్లలో అమెరికా స్థూల జాతీయోత్పత్తి దాదాపు 110బిలియన్ డాలర్లు తగ్గిపోతుంది.

ఎల్ సాల్వెడార్‌లో అనేక భారీ భూకంపాలు సంభవించిన కాలంలో 1994 సంవత్సరానికి ముందు 1,90,000మందినీ, 2001 సంవత్సరానికి ముందు 2,60,000 మందినీ అమెరికాలోకి అనుమతించారు. 1980 సంవత్సరం నుంచి 1992 సంవత్సరందాకా ఎల్ సాల్వెడార్‌లో సాగిన అంతర్యుద్ధం బారిన పడకుండా అనేక వేలమంది ప్రజలు తప్పించు కున్నారు. అమెరికా మద్దతుగల హంతక ముఠాలు అనేక వేలమంది రైతులను చంపివేశాయి. మొజేటే అనే గ్రామంలోనే 1200మంది రైతులను ఊచకోత కోశారు. హంతకముఠాలచే హత్యగావింపబడుతున్నవారి సంఖ్య ప్రపంచంలోనే అత్యధికంగా నమోదవుతున్న దేశానికి వేలాదిమందిని నిర్బంధంగా పంపటమంటే వారికి మరణ శిక్ష వేయటమే. 2014-2015 మధ్యకాలంలో ఒబామా ప్రభుత్వం ఎల్ సాల్వెడార్‌కు బలవంతంగా పంపినవారిలో అనేక మంది హత్యగావింప బడినట్టు గార్డియన్ పత్రికలో ప్రచురింపబడిన ఒక నివేదిక పేర్కొన్నది.

ఎల్ సాల్వెడార్ నుంచి వలస వచ్చిన ప్రజలకు ఇచ్చిన టీపీఎస్ హోదాను రద్దు చేయటమంటే ట్రంప్ ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని పూర్తిగా ఎత్తివేయాలనే నిర్ణయానికి వచ్చినట్టుగా భావించాలి. అంతకు ముందు నికరాగువా నుంచి వలస వచ్చిన 2500మందికి ఇచ్చిన టీపీఎస్ హోదా రద్దు చేశారు. వారు అమెరికాను విడిచి వెళ్ళటానికి 2019 సంవత్సరం జనవరి 5వ తేదీదాకా గడువు ఇచ్చారు. హైతీ నుంచి వలస వచ్చిన 57వేలమందికి ఇచ్చిన టీపీఎస్ హోదా 2019 సంవత్సరం జులై 22వ తేదీకల్లా ముగుస్తుంది. అయితే ట్రంప్ ప్రభుత్వం ఇటువంటి దారుణమైన నిర్ణయం తీసుకోవటంలో డెమోక్రటిక్ పార్టీ ప్రమేయం కూడా ఉన్నది. ట్రంప్‌కు ముందున్న అధ్యక్షుడు బారక్ ఒబామా అమెరికాకు వలస వచ్చిన లక్షలాది పేద కార్మికులను బలవంతంగా దేశం నుంచి గెంటివేశాడు. నేడు ట్రంప్ పాలన తీసుకున్న నిర్ణయం అటువంటి విధానం కొనసాగించినట్టుగా అర్థం చేసుకోవాలి. 2014 సంవత్సరంలో మధ్య అమెరికాలో చెలరేగిన హింస నుంచి తప్పించుకుని అమెరికా చేరిన వేలాది మహిళలను, వారి పిల్లలను ఒబామా ప్రభుత్వం జైళ్లలో నిర్బధించింది.

బతకటానికి అమెరికాకు వలసగా వచ్చిన ప్రజలకు వ్యతిరేకంగా ట్రంప్ ప్రతిపాదిస్తున్న జాతీయవాదాన్ని అశేష అమెరికా ప్రజానీకం ఆమోదించటం లేదు. అనేక ఏండ్లుగా అమెరికాలో జీవిస్తున్న వలసగా వచ్చిన ప్రజలకు పౌరసత్వం ఇవ్వాలని 10మందిలో 9మంది అమెరికన్లు కోరుతున్నారు. వలస 'సంస్కరణ' పేరుతో జరుగుతున్న 'చర్చ'ను అమెరికాలోని ప్రగతిశీల ప్రజానీకం తిరస్కరిస్తున్నది. అనధికారికంగా అమెరికాలో నివసిస్తున్నవారు నేరం చేశారనే భావన అత్యంత లోపభూయిష్టమైనది. ఎందుకంటే అమెరికాలో నివసిస్తున్న ప్రజలందరూ ఎప్పుడోఒకప్పుడు వలసగా వచ్చిన వారే. ఎల్ సాల్వెడార్ నుంచి వలసగా వచ్చి టీపీఎస్ హోదావున్న కార్మికులను కాపాడే శక్తి వర్ణ, జాతి వివక్షలకు అతీతమైన కార్మిక వర్గానికి మాత్రమే ఉన్నది. తమ మధ్య జీవిస్తున్న తమ తోటి ఎల్ సాల్వెడార్ కార్మికులను కాపాడుకునే కర్తవ్యాన్ని తోటి అమెరికా కార్మికులు ఎలా నిర్వహిస్తారో రాబోయే రోజుల్లో తెలుస్తుంది.

# మకరజ్యోతి దేవుని మాయకాదు.. మనిషి కల్పితమే!



డాక్టర్ దేవరాజు మహారాజు

శబరిమలను హిందువులు పుణ్యక్షేత్రంగా భావిస్తారు. పెరియార్ టైగర్ రిజర్వు ప్రాంతంల్లో పశ్చిమ కనుమల కొండల్లోఉంది. చుట్టూ ఉన్న 18 కొండల మధ్య.. అడవుల మధ్య ఒక కొండ మీద అయ్యప్ప గుడి ఉంది. సముద్ర మట్టానికి 4,133 ఫీట్ల ఎత్తులో.. పతనం తిట్ట జిల్లాలో, పెరునద్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. ప్రతీ యేటా ఈ దేవాలయాన్ని 45-50 మిలియన్ల భక్తులు దర్శించుకుంటున్నారు. అయ్యప్పను సస్త అనీ, ధర్మ సస్త అనీ కూడా పిలుచుకుంటారు. పన్నెండో శతాబ్దంలో పండలం రాజవంశీకుడు, యువరాజు మణికందన్ శబరిమలలో తపస్సు చేశాడని, ఆయన అయ్యప్ప అవతారమనీ భక్తులు భావిస్తారు. పండలం రాజవంశీకుల కాలం (1821) నాటికే ఈ గుడి అతిపురాతనమైందని చెపుతారు. ఇప్పుడున్న అయ్యప్ప విగ్రహం 1910లో ప్రతిష్ఠాపించారు.

**కొండమీదికి చేరిన ఆ బృందం సంధ్యవేళ 6-16 నుండి 6-20 వరకు అఖండ జ్యోతి వెలిగిస్తుంది. సుమారు పది కిలోల కర్పూరం వెలిగించే సరికి పెద్దజ్యోతి పైకి లేస్తుంది. ఆ వెలుగుకు అడ్డంగా కొందరు లావుపాటి దుప్పటి మూడుసార్లు అడ్డుపెట్టి తొలగిస్తారు. దాంతో శబరిమల ఆలయంలో ఉన్న భక్తులకు, ఇంకా చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉన్నవారికి ఆకాశంలో నక్షత్రం మూడుసార్లు మినుకుమని వెలిగి మాయమైందన్న భ్రమ కలుగుతుంది. అదే మనిషి చేసే మకర జ్యోతి మహాత్మ్యం!**

కేరళ శబరిమలలో ప్రతీ సంవత్సరం మకరవిలక్కు.. అనే పండగ జరుగుతుంది. ఇందులో తిరువాభరణం.. మకరజ్యోతి అనే రెండు ముఖ్యమైన కార్యక్రమాలుంటాయి. తిరువాభరణం అంటే అయ్యప్పస్వామి ఆభరణాల్ని ఊరేగించడం. రెండోది మకరజ్యోతి దర్శనం. వీటిని చూడడానికే భక్తులు అక్కడికి చేరుకుంటారు.

రామాయణ కావ్యంలో కథానాయకుడు శ్రీరాముడు, ఆయన తమ్ముడు లక్ష్మణుడు. ఆదివాసి భక్తురాలైన శబరిని ఆ ప్రాంతంలో కలుసుకున్నందువల్ల దానికి శబరిమల అనే పేరు వచ్చిందని స్థల పురాణం ఉంది. అక్కడ శబరి-పండ్లు మంచివా కాదా అని ఒక్కొక్కటి రుచిచూసి, మంచి పండ్లు ఏరి రామునికి సమర్పించుకుందని కూడా స్థల విశేషాల్లో ఉంది. కొద్ది దూరంలో తపస్సు చేసుకుంటున్నది ఎవరని రాముడు శబరిని అడిగితే, అతను సస్త అని చెపుతుంది. రాముడు సస్త దగ్గరికి వెళతాడు. సస్తలేచి నిలబడి రాముడికి స్వాగతం పలుకుతాడు. ఆ సస్త ఎవరో కాదు.. అయ్యప్పే అని తెలుస్తుంది. అక్కడ పూజింపబడుతున్న అయ్యప్పకు హరిహర పుత్ర అనే మరో పేరు ఉంది. అంటే ఈయన హరికి-హరుడికి కలిగిన సంతానం. మహావిష్ణు-శంకరుల సంతానమన్నమాట. మన హిందూ దేవుళ్ళకున్న మహిమల్లో ఇదొకటి. ఇద్దరు మగవాళ్లకు అయ్యకు అప్పకు పుట్టడమేమిటని అమాయకంగా ఎవరూ అడగొద్దు. కల్పించుకున్న దైవ మహిమలు ఎలాగైనా ఉంటాయి. అసంబద్ధమైన అంశాల్నే మన భక్తులు భక్తిపారవశ్యంతో పూజిస్తుంటారు. హేతుబద్ధత కోసం అంగలార్చేవారికి అదొక సమస్య. కానీ.. కండ్లు మూసుకుని విశ్వసించే వారికి అది సమస్యే కాదు.

హిందువులు ఏర్పరచుకున్న రాశులలో మకరరాశి ఒకటి. మకరజ్యోతి అంటే మకరరాశి వెలుగు. అయ్యప్ప మకరజ్యోతిగా మారి ప్రతి సంవత్సరం జనవరి 14 నాడు భక్తులకు ఒక నక్షత్రంగా (వెలుగుగా) కనిపించి దీవిస్తాడని స్థలపురాణం. ఒక విశ్వాసం ఉంది. ఉత్తరాయణంలో సూర్యుడు ఉత్తర దిశగా ఆరు నెలల పాటు ప్రయాణిస్తాడని, మకర సంక్రాంతి (జనవరి 14) రోజు ప్రారంభమై ప్రయాణం కర్క సంక్రాంతి (జూలై 14) రోజున ముగుస్తుందని చెపుతారు. సంక్రాంతికి పంటలు ఇండ్లకు రావడం, గ్రామాలన్నీ సంతోషంతో కళకళలాడడం జరుగుతుంది. మనిషి ప్రకృతితో అనుసంధానమైన పండగ ఇది. అని అనుకుంటే చాలా గొప్పగా అనిపిస్తుంది. మళ్ళీ రాముడు, శబరి, అయ్యప్ప అంటే మాత్రం కొన్ని ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. మకర జ్యోతి వేరు. మకర విలక్కు అనేది వేరు. మకర జ్యోతి భక్తుల విశ్వాసం. మకర విలక్కు అనేది కేవలం మనిషి వెలిగించే అఖండ దీపం. దాన్నే ఇప్పుడు భక్తులు 'మకరజ్యోతి'గా పరిగణిస్తున్నారు.

శబరిమలలో అయ్యప్పదేవాలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో పొన్నాంబలం కొండమీద గతంలో మలార్య అనేగిరిజన జాతివారు పూజచేసి పెద్ద దీపం వెలిగించేవారు. దాన్నే 'మకర విలక్కు' అని అనేవారు. పొన్నాంబలం కొండ మీద కూడా ఒక చిన్న గుడి ఉంది. అక్కడి గిరిజనులు ఆ గుడిలోని దేవతా మూర్తికి హారతి ఇచ్చేవారు. కర్పూరం, నెయ్యి వంటి వాటితో పెద్ద దీపం వెలిగించి, అక్కడున్న విగ్రహం చుట్టూ మూడు సార్లు తిప్పి హారతి ఇచ్చేవారు. ఇప్పుడు ఆ కొండమీది దేవాలయం వైపు ఎవరినీ పోనివ్వడం లేదు. అది అటవీశాఖ వారి ఆధీనంలో ఉంది. అటవీశాఖ పోలీసుశాఖ శబరిమల అయ్యప్ప దేవాలయ సిబ్బంది కలసికట్టుగా, గుట్టుగా నిర్వహిస్తున్న కార్యక్రమమే మకర విలక్కు. వీరు వెలిగించే అఖండ దీపమే మకర జ్యోతి. అంటే కొండమీద నక్షత్రమనే ఒకప్పటి భ్రమే, ఇప్పుడు వాస్తవంగా మారింది! కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవోసం (దేవాలయ) బోర్డు, అటవీశాఖల సహకారంతో ఆ కార్యక్రమం నిర్వహిస్తోందని కేరళ హైకోర్టు ధృవీకరించింది. వాస్తవాలన్నీ బహిర్గతమయ్యాయి. కాబట్టి, ఇంకా ఈ విషయం మీద పరిశీలనలు అవసరం లేదని కూడా కోర్టు చెప్పింది.

ఒకప్పటి అమాయక గిరిజన సంప్రదాయాన్ని నేటి నాగరిక మూఢ భక్తాగ్రేసరులు కొనసాగిస్తున్నారు. దానికి ప్రభుత్వ యంత్రాంగాలన్నీ తమ శాయశక్తులా సహకరిస్తున్నాయి. ఒక మూఢ భక్తి, ఆచారం, చాదస్తం కొనసాగడానికి ఎక్కువ సంఖ్యలో ఉన్న విశ్వాసులే కారణం కాదు. రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలన్నీ కారణమేనని చెప్పడానికి ఇది చక్కటి ఉదాహరణ. భద్రాద్రికి వెళ్ళే ముత్యాల తలంబ్రాలే కావొచ్చు. సమ్మక్క సారక్క జాతరే కావొచ్చు. ఇంకా అలాంటి ఏ ఇతర సంప్రదాయాలైనా కావొచ్చు. అన్నిటికీ సూత్రమొక్కటే! ఏ ప్రాంతంలోనైనా, సూత్రధారులు ఒకేరకంగా వ్యవహరిస్తారనేది మనం తెలుసుకోవాలి!!



జనవరి 14, ఉదయం పొన్నాంబలం (యిడు) కొండకు ఒక బృందం బయలుదేరి సాయంత్రానికి అక్కడికి చేరుకుంటుంది. మధ్యలో మధ్యాహ్నం కాసేపు సేదతీరి, భోజనాలు చేసి, మళ్ళీ ప్రయాణమవుతారు. ఆ బృందంలో యాభైమంది అటవీశాఖవారు, యాభైమంది పోలీసులు, విద్యుత్‌శాఖవారో పది మంది. అయ్యప్ప ఆలయ సిబ్బంది మరో పది మంది సామాన్లు మోయడానికి కూలీలు వగైరా అంతా కలసి ఆ బృందంలో వెళతారు. సాయంత్రానికి కొండమీదికి చేరిన ఆ బృందం సంధ్యవేళ 6-16 నుండి 6-20 వరకు అఖండ జ్యోతి వెలిగిస్తుంది. సుమారు పది కిలోల కర్పూరం వెలిగించే సరికి పెద్దజ్యోతి పైకి లేస్తుంది. ఆ వెలుగుకు అడ్డంగా కొందరు లావుపాటి దుప్పటి మూడుసార్లు అడ్డుపెట్టి తొలగిస్తారు. దాంతో శబరిమల ఆలయంలో ఉన్న భక్తులకు, ఇంకా చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉన్నవారికి ఆకాశంలో నక్షత్రం మూడుసార్లు మినుకుమని వెలిగి మాయమైందన్న భ్రమ కలుగుతుంది. అదే మనిషి చేసే మకర జ్యోతి మహాత్మ్యం!

ఈ కార్యక్రమాన్ని సన్నిధానం (అయ్యప్ప గుడి ఆవరణ) నుండి, పండిత వలం, పుల్‌మేడు, కొండపై నుండి చలకయం, అట్టతోడు, సరంకుతి, నీలిమల, మరకుటమ్ వంటి నిర్ణీత స్థలాల నుండి భక్తులు మకరజ్యోతిని దర్శించుకుంటూ ఉంటారు. పొన్నాంబలం (యిడు) కొండమీద హారతి కార్యక్రమం అయిపోగానే, కొండ కింద అయ్యప్పగుడి గోపురం నుండి అర్చకులు భక్తులకు సంకేతాలిస్తారు. దాంతో కార్యక్రమం ముగిసిందని భక్తులు తెలుసుకుని ఎవరి దారిన వారు వెళ్లిపోతారు.

అయ్యప్ప దర్శనానికి సంబంధించి... మహిళల విషయమొకటి కోర్టు కెక్కింది. 1991లో కేరళ హైకోర్టు 10-50 ఏండ్ల మధ్య గల బాలికల, మహిళల ప్రవేశాన్ని నిషేధించింది. ఆ వయసులో వారు రుతుక్రమంలో ఉంటారని, వారి ప్రవేశం వల్ల ఆలయం అపవిత్రమైపోతుందన్న కారణంతో కోర్టు ఆ ఉత్తర్వు నిచ్చింది. (అదీగాక, అయ్యప్పకు తల్లిలేదు. ఆయన అయ్యకు అప్పకు పుట్టినవాడు కదా? స్త్రీలు అపవిత్రులయితే, పుట్టికే అపవిత్రం, మనుషులంతా అపవిత్రులే.. మరి దానికేమంటారు?) ఈ విషయం అక్టోబర్ 2017లో కాన్సిటిట్యూషన్ బెంచ్‌కి వెళ్లింది.

పొన్నాంబలం కొండమీద 1950 కంటే ముందు ఆదిమ తెగలు నివసిస్తూ ఉండేవి. సంక్రాంతి రోజున దేవుడికి పెద్ద దీపం వెలిగించి పూజలు చేసుకోవడం ఆనాటి గిరిజన సంప్రదాయం. అది ఆకాశంలో నక్షత్రమని చుట్టు పక్కల ప్రాంతాల్లోని వారు అనుకుంటూ ఉండేవారు. హైడల్ ప్రాజెక్ట్ కట్టడం మూలాన ఆ కొండ ప్రాంతం వారు నిర్వాసితులయ్యారు. మూడు నాలుగేండ్ల పాటు అక్కడ ఎవరూ దీపం వెలిగించలేదు. ఎవరికీ ఏ నక్షత్రమూ కనిపించలేదు. ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని అలాగే నిలపడానికి కేరళ ప్రభుత్వమే మకరజ్యోతి వెలిగించడం ప్రారంభించింది. 1983, 84 సంవత్సరాల్లో కేరళ రాష్ట్ర హేతువాద, మానవ వాద సమాఖ్య (ఫొరా) పూనుకుని, పొన్నాంబలం కొండపైకెక్కి రాకెట్లు, బాణా సంచా పేల్చారు. ఆ రోజుల్లో దూరదర్శన్ ప్రేక్షకులు ఆ దృశ్యాలు చూశారు. ఈ వ్యాసకర్త కూడా ఆ ప్రేక్షకుల్లో ఒకరు.

**వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీ వేత్త, బయాలజీ ప్రొఫెసర్, సెల్: 9573706806**

మెయిల్ @ నవతెలంగాణ



టి.యన్.వి. రమణ

# కాలుష్య నివారణకు చైనా మార్గం

**"ప్రకృతిని మనం ధ్వంసం చేస్తే కాలక్రమంలో అది మనలను వెంటపడి వెంటాడుతుంది."**

**"మేము ప్రపంచ వాతావరణ నిర్వహణలో క్రియాశీలకంగా పాల్గొని, మా వంతుగా విడుదలయ్యే ఉద్గారాలను తగ్గించి మా బాధ్యతను పూర్తిచేస్తాం.."** ఈ మాటలు అన్నది చైనా అధ్యక్షుడు జిన్ పింగ్. ప్రపంచంలోని అత్యధికంగా వాతావరణ కలుషితం చేసిన దేశాల జాబితాలో చైనా ఒకటి. 2008 ఒలింపిక్స్ నాటికి బీజింగ్ నగరం ఇప్పటి ఢిల్లీని మించిన కాలుష్య పొగమంచుతో కమ్ముకుపోయింది. "గ్యాస్‌చేంబర్'లా మారింది. 2010లో ప్రపంచంలో అత్యధికంగా 11.2 బిలియన్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్ విడుదల చేసిన దేశం చైనా. అప్పుడు అమెరికా 6.7 బిలియన్ టన్నులు, భారతదేశం 2.1 బిలియన్ టన్నులు విడుదల చేస్తున్న దేశం. పిల్లలు నెలలు నిండకుండానే పుట్టి చనిపోయేవారు. చైనా 140 కోట్ల జనాభాతో పారిశ్రామికరంగంలో కొన్ని దశాబ్దాలుగా వేగంగా అభివృద్ధి అవుతున్న దేశం. అత్యధిక జనాభా కలిగి, పారిశ్రామిక ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో కాలుష్యం పెరిగింది. 2015లో తాన్సెట్ మెడికల్ జర్నల్ నిర్వహించిన తాజా అధ్యయనంలో ప్రపంచ వ్యాప్తంగా కాలుష్య మరణాలు 90లక్షలు అయితే, చైనాలో 18 లక్షలు, భారత్‌లో 25 లక్షలుగా ప్రకటించింది.

చైనా ప్రభుత్వం ఈ పరిస్థితిని ఒక సవాలుగా తీసుకుని దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. 2015లో కాలుష్యానికి చిరునామాగా మారిన 17,600 పరిశ్రమలను మూసివేశారు. నిబంధనల్ని ధిక్కరించిన ఇంకో 28,710 సంస్థల పనుల్ని ఉన్నపళంగా నిలిపివేశారు. కాలుష్య కారక పరిశ్రమలపై ఉక్కుపాదం మోపేలా చట్టాలను తిరిగి రాసింది. ఈ పరిశ్రమలపై పన్నులు పెంచింది.

బొగ్గు వినియోగాన్ని బాగా తగ్గించింది. 2017లోనే బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేసే 100 పరిశ్రమలను మూసివేసింది. 2014 నుండి మూడేండ్ల వరకు కొత్త బొగ్గు గనులు ప్రారంభించరాదని నిషేధం పెట్టింది. 2015లో బొగ్గు వినియోగాన్ని 3.7శాతం తగ్గించింది. ప్రత్యామ్నాయ సోలార్ విద్యుత్‌ను గణనీయంగా పెంచుతున్నది. 2006 నుండి 2017 మధ్య సోలార్‌శక్తికి 600శాతం పెట్టుబడిని పెంచింది. సోలార్ విద్యుత్ ఉత్పత్తి 1700 మెగావాట్ల నుంచి చైనా లక్ష మెగావాట్లకు పెంచుకున్నది. అదే కాలానికి భారతదేశం 4500 మెగా వాట్ల నుండి 17000 మెగావాట్లకు మాత్రమే పెంచింది.

వాహనాల ద్వారా కాలుష్యం బాగా పెరుగుతున్నదని గమనించిన చైనా ఒక బీజింగ్‌లో 3 లక్షల పాత వాహనాలను నిషేధించింది. తక్కువ కార్బన్‌డయాక్సైడ్ విడుదల చేసే వాహనాలనే వినియోగించాలని నిర్ణయించింది. ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టి, వాటిని కొనేవారికి ప్రోత్సాహకాలు కల్పించింది. వాహనాలు జనావాసాలలోనే ఉంటాయి. కాబట్టి వాహనకాలుష్యం నిత్యం వుండే సమస్య. అందుకని ఒక వ్యక్తి ఒక కారు మాత్రమే కొనాలనే చట్టం తెచ్చింది. హైదరాబాద్ నగరంలో ఒక కోటి జనాభాకు 45 లక్షల వాహనాలు ఉన్నాయి. ఇది దేనికి సంకేతం.

బీజింగ్‌లో సైకిల్ ట్రాక్స్ ఏర్పాటుచేసి సైకిల్ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు. వారంలో ఒక రోజు సైకిల్ మాత్రమే వాడాలనే నిబంధన పెట్టి అమలు జరిపారు. 1978 నుండి చైనా "గ్రేట్ గ్రీన్ వాల్" అంటే చెట్లతో గోడలాంటిది ఏర్పాటు చేస్తున్నది. 4500 కిలోమీటర్లు పొడవున ఎడారికి ఆనుకుని ఇప్పటికి 66 మిలియన్ చెట్లు నాటారు. భూమి కోతకు గురికాకుండా ఇది నివారిస్తుంది. ఇవి కాకుండా అడవులను విపరీతంగా పెంచుతున్నారు. నగరాలలో జనాభా కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకరణ జరుగుతున్నది. పారిశ్రామిక వాడలను కూడా నగరాలకు దూరంగా నిర్మిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల్లో బాణా సంచాలు పేల్చడాన్ని 710 నగరాలలో నిషేధించారు. చైనాలో 900 నగరాలలో 1500 గాలి స్వచ్ఛత మానిటరింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మనదేశంలో 23 నగరాలలో 39 స్టేషన్లు మాత్రమే ఉన్నాయి.

పారిశ్రామిక అభివృద్ధి అంటేనే కాలుష్యం అనే అభిప్రాయం తప్పు. పారిశ్రామిక అభివృద్ధి జరగాలి. అయితే కాలుష్యాన్ని నియంత్రిస్తూ ఆ స్పృహలో సమన్వయంతో జరగాలి. కాలుష్యం అనేది పేదవాడిని బాధపెట్టినట్టే పెట్టుబడిదారులను బాధపెడుతుంది. అయితే డబ్బు ఉన్నవారు కాలుష్యం ప్రభావాన్ని తగ్గించే పరికరాలను వాడి దాని ప్రభావాన్ని తగ్గించుకుంటారు. మరి పేదవాడి సంగతేమిటి? ఇక్కడ ప్రభుత్వం పేదవాడితరపు బాధ్యత తీసుకోవాలి. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చైనా అనుసరిస్తున్న పద్ధతులను కచ్చితంగా పాటించాలి, మరింత మెరుగుపర్చాలి.

గ్రీన్ కవర్ అంటే పచ్చదనాన్ని పెంచాలి. ఇంధన వనరులను తగ్గించే ప్రత్యామ్నాయ రవాణా విధానాన్ని రూపొందించాలి. వ్యక్తిగత వాహన వినియోగాన్ని తగ్గించి, ప్రజా రవాణా పెంచాలి. బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తిని తగ్గించి, సౌర, పవన్ విద్యుత్తు వాడకాన్ని పెంచాలి. సైకిల్ వాడకాన్ని పెంచాలి. కాలుష్యం అనే నిశబ్ద హంతకిని కట్టడిచేయాలి.

**సెల్: 9494731091**

# చరిత్ర గతినే మార్చిన అక్టోబర్ మహా విప్లవం!

నాదెండ్ల శ్రీనివాస్

**(నిన్నటి సంచిక తరువాయి)**

1917 ఏప్రిల్ 3వ తేదీన లెనిన్ రష్యా తిరిగి వచ్చి విప్లవానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. ఏప్రిల్ 4వ తేదీన బోల్షివిక్ కేంద్ర కమిటీ సమావేశంలో లెనిన్ సిద్ధాంత పత్రం ప్రవేశపెట్టాడు. దానినే ఏప్రిల్ థీసిస్ అంటున్నారు. అందులో ముఖ్యమైన సూత్రీకరణలు.

రష్యాలో రెండు అధికార కేంద్రాలు, రెండు నియంతృత్వాలు ఎక్కువ కాలం ఉండలేవు. విప్లవం తొలిదశ నుండి రెండో దశకు పరివర్తన చెందాల్సి ఉంది.


శ్రామికవర్గంలో తగినంత వర్గ చైతన్యం, నిర్మాణపటిమ లేనందున విప్లవ తొలిదశ బూర్జువావర్గం చేతిలో పెట్టింది.

రెండవ దశలో అధికారం శ్రామికవర్గం, పేద రైతాంగం చేతుల్లోకి వెళ్ళాలి అని లెనిన్ నిర్ధారించాడు.

బూర్జువా విప్లవం సోషలిస్టు విప్లవంగా పరివర్తనం చెందాలి.

ఈ నిర్ధారణలు మెన్షివిక్‌లు, బూర్జువావర్గంతో చేరిన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. చివరికి ప్లెఖనోవ్ కూడా దీన్ని పిచ్చివాగుడుగా జమకట్టాడు. కానీ బోల్షివిక్ పార్టీ కమిటీలన్నీ దీన్ని ఆమోదించాయి. ఏప్రిల్ 24 నుండి 29 వరకు జరిగిన అఖిల రష్యా బోల్షివిక్ మహాసభ దీన్ని ఆమోదించింది. దానికి అనుగుణంగా పార్టీ కార్యక్రమం సవరించబడింది.

శాంతి, భూమి, భుక్తి, సోవియట్లకే సర్వాధికారాలు అనే నినాదాలతో బోల్షివిక్‌లు ప్రజలను ఉత్తేజపర్చారు. అధికారంలోని బూర్జువావర్గం బలహీనపర్చే ప్రయత్నాలు ప్రారంభించింది. సైన్యం కార్మిక వాడల్లోకి ప్రవేశించి బోల్షివిక్‌లను నిరాయుధులను చేసింది. బోల్షివిక్ పార్టీని నిషేధించింది. ప్రచురణాలయాన్ని ధ్వంసం చేసింది. లెనిన్ కనిపిస్తే కాల్చేయమని ఆదేశించింది. వెంటనే సర్వాధికారాలు విప్లవ ప్రతీఘాత శక్తుల చేతుల్లోకి వెళ్ళాయి కనుక కార్మికవర్గం సాయుధ తిరుగుబాటు ద్వారా మాత్రమే అధికారం హస్తగతం చేసుకోవాలని లెనిన్ పిలుపును ప్రకటించి, పిలుపుతోపాటు కార్మిక-కర్షక మైత్రితోనే విప్లవం విజయం సాధిస్తుందన్నాడు. విప్లవం ద్వారా ప్రభుత్వాన్ని కూలదోసి బోల్షివిక్‌లు అధికారం చేపట్టడమొక్కటే మార్గమని గ్రహించాడు. సోషలిస్టు విప్లవానికి రష్యా సిద్ధంగా ఉందని చెప్పాడు. ఈ సమయంలోనే లెనిన్ రాజ్యాంగ యంత్రం విప్లవం అనే గ్రంథాన్ని పూర్తిచేశాడు. సోషలిజం



నిర్మించాలంటే బూర్జువా రాజ్యాంగ యంత్రాంగం స్థానే శ్రామికవర్గ రాజ్యాంగ యంత్రాంగాన్ని నెలకొల్పాలని పిలుపు ఇచ్చాడు. చారిత్రక మార్పు సంభవిస్తున్న వేళ రాసిన ఈ పుస్తకం సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య గల సంబంధాన్ని తెలియజేస్తుంది.

బోల్షివిక్‌లు అధికారం చేపట్టటం కోసం సాయుధ విప్లవానికి తిరుగుబాటు దళాల కేంద్ర కార్యాలయం ఏర్పాటైంది. కీలక స్థావరాలను తిరుగుబాటుదారులు ఆక్రమించడం ప్రారంభించారు. మరోవైపు విప్లవాన్ని అణచివేయడానికి, ప్రక్కదోవ పట్టించడానికి ప్రతీఘాత శక్తులు అన్ని రకాల ప్రయత్నాలు ప్రారంభించారు. రాజ్యాధికారం విప్లవ సైనిక కమిటీల చేతుల్లోకి వచ్చిందని లెనిన్ ప్రకటించాడు. కార్మిక, సైనిక, రైతాంగ సోవియట్లకు అధికారం బదిలీ అయిందని లెనిన్ చేసిన ప్రకటనను ఆరోజు (1917 అక్టోబర్ 25) సాయంత్రం జరిగిన అఖిల సోవియట్ల ద్వితీయ మహాసభ ఆమోదించింది. ఈ విధంగా చరిత్రలో తొలి సోషలిస్టు విప్లవం జయప్రదమైన రోజుగా, చిరస్థాయిగా నిలిచిపోతుంది. లెనిన్ విప్లవంలోని ప్రతి మలుపునూ నిర్దిష్టంగా విశ్లేషించి దానికి తగ్గ వ్యూహాన్ని, ఎత్తుగడలనూ అనుసరించాడు.

నిజానికి అక్టోబర్ విప్లవం లేనిదే లెనిన్ లేడు - లెనిన్ లేనిదే అక్టోబర్ విప్లవం లేదు.

1917లో అధికారంలోకి వచ్చిన సోషలిజం లెనిన్ నాయకత్వంలో అనేక విజయాలు సాధించింది. భూమినీ, ఫ్యాక్టరీలనూ, సంపదనూ ప్రజల పరం చేసింది. సహకార వ్యవస్థ ద్వారా, కమ్యూన్‌ల ద్వారా ప్రజల మౌలిక అవసరాలైన తిండి, బట్ట, నివాసం కొరత లేకుండా చేసింది. సోషలిజం విజయవంతం అయిన తర్వాత కూడా వర్గాలు - వర్గ పోరాటాలు నిరంతరం ఉంటాయి అని హెచ్చరించారు. కూల్చబడిన పెట్టుబడిదారులు తిరిగి తమ సామ్రాజ్యాన్ని నిలబెట్టుకునేందుకు, రెట్టింపు శక్తితో కార్మికవర్గాన్ని దెబ్బ తీయడానికి నిరంతరం కుట్రలు చేస్తారని హెచ్చరించారు. ప్రపంచ సోషలిస్టు వ్యవస్థను నాశనం చేయడానికి ప్రపంచ పెట్టుబడిదారులు నిరంతరం కుట్రలూ, కుయుక్తులూ పన్నుతారని కార్మికవర్గాన్ని హెచ్చరించారు.

రష్యా అనుభవాలు, సాధించిన విజయాలతో పాటు పొందిన ఓటమి, గుణపాఠాలను హెచ్చరికగా తీసుకొని భవిష్యత్ విప్లవోద్యమాన్ని నిర్మిద్దాం. గర్వించదగిన గతమే కాదు - ఉజ్వలమైన భవిష్యత్ మార్క్సిజం-లెనినిజం కు ఉందని ఈ జగతికి మనం ఎలుగెత్తి చాటుదాం.

**అక్టోబర్ విప్లవం అజరామరం...!**
**సోషలిజం అజేయం...!**

**సెల్: 9676407140**



రిపోర్టింగ్ ఇప్పుడు కత్తిమీద సాము. అయినా జాతీయ మీడియాలో మహిళల ప్రభంజనం కొనసాగుతోంది. తెహెల్కా, బోఫోర్స్, బేబీ లిఫ్టింగ్, గుజరాత్ ఫైల్స్‌వరకు... ప్రభుత్వాల పునాదులు కదిలించే కథనాలన్నీ మహిళా జర్నలిస్టులు రాసినవే. ఓవైపు ప్రభుత్వాల నుంచి ఎన్ని ఒత్తిడులు ఎదురైనా... వెనుకడుగేయకుండా సాగుతున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే.. కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, బస్తర్... ఇలా మారుమూల ప్రాంతాలు, కల్లోల సమూహాల నుండి రిపోర్టింగ్ చేయడం మరో ఎత్తు. అలాంటి ప్రాంతాలనుంచి రిపోర్టింగ్ చేస్తున్న మహిళలు వీరు. ప్రభుత్వం, అధికారులనుంచి ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. ప్రజల పక్షాన నిలుస్తున్నారు. ఎన్నో చీకటి కోణాలను వెలుగులోకి తెస్తున్నారు. ఈ క్రమంలో వాళ్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, అసలు లోపల జరుగుతున్నదేమిటి? బయటికి వస్తున్నదేమిటి? జర్నలిస్టులు పంచుకున్న అభిప్రాయాలు...



# కల్లోల ప్రాంతాలనుంచి కలం ఝుళిపిస్తూ...

కట్ట కవిత

## దాడులను ఎదుర్కొంటూ...



నేను టెంత్‌లో ఉన్నప్పుడు నాన్నగారికి పక్షవాతం వచ్చింది. దాంతో కుటుంబానికి ఆసరగా నిలవడానికి అప్పటినుంచే పనిచేయడం ప్రారంభించాను. మొదట డైలీ ప్రకార్‌కి పేపర్‌వర్క్ చేసేదాన్ని. అప్పుడు నెలకు 600 రూపాయలు వచ్చేవి. 2003లో ప్రూఫ్‌రీడర్‌గా ఉద్యోగం మొదలుపెట్టాను. చదువులు పూర్తి చేసిన తరువాత అదే న్యూస్‌పేపర్‌లో జర్నలిస్టుగా చేరాను. బూటకపు ఎన్‌కౌంటర్ల మీద పరిశోధనా వ్యాసాలు ఎన్నో రాశాను. ఆదివాసీల మీద పోలీసుల వేధింపులపైనా ఎన్నో కథనాలు రాశాను. ఈ క్రమంలో పోలీసుల నుంచి ఎన్నో వేధింపులు. నేను ఇలా పనిచేస్తున్నందుకుగాను ఓసారి నా భర్తపై దాడి చేశారు. 'ఇంకోసారి ఇలాంటి కథనాలు రాయొద్దని నీ భార్యకు చెప్పు' అని బెదిరించారు. ఆయనను హాస్పిటల్‌లో చేర్చాను. కొద్దికాలం తరువాత కోలుకున్నాడు. బస్తర్‌లో స్థానికంగా ఒకే ఒక మహిళా జర్నలిస్టును నేను. ఒక్కోసారి అంతమంది మగాళ్ల మధ్య రిపోర్టింగ్ చేయడం ఇబ్బందిగా అనిపిస్తుంది. కానీ... నా భర్త నన్నెంతో ప్రోత్సహిస్తాడు. ఎందుకంటే ఆయనా ఒక జర్నలిస్టు. అంతకుముందు సీఆర్‌పీఎఫ్‌లో పనిచేసినా.. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు భరించలేక ఉద్యోగం వదిలేశాడు. సొంత ప్రజల కోసం పనిచేయాలనుకున్నాడు. ఇప్పుడు ఇద్దరం కలిసి మా ప్రజలకోసం పని చేస్తున్నాం. ఆదివాసీలు అన్నిచోట్లా బాధితులే. ప్రభుత్వ పథకాలేవీ వారికి అందవు. ఇది పోవాలంటే విద్య అవసరం. వైద్య సదుపాయాలు అస్సలే లేవు. అందుకే ఈ రెండింటి మీద ఎక్కువ ఫోకస్ చేస్తూ కథనాలు రాస్తున్నాను. 2015లో ఆదివాసీలపై భద్రతాదళాల అత్యాచారాలు మొదలు ఎన్నో కథనాలను బయటికి తెచ్చాను. నేను చేసిన కొన్ని డజన్ల కథనాలు ఆ తరువాత మెయిన్‌స్ట్రీమ్ మీడియాకు హెడ్‌లైన్స్, బ్రేకింగ్ న్యూస్‌లు, ఎక్స్‌క్లూజివ్స్ అయ్యాయి.

**- పుష్పా ఉసెండి, బీజాపూర్**

## ఎంతో వ్యత్యాసం...



20 ఏండ్లుగా ఉమెన్స్ ఫీచర్ సర్వీస్, ఇండియా టుగెదర్, ఇంటర్ ప్రెస్ సర్వీస్, ఈస్టర్న్ ఫ్రంటైర్‌లకు ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తున్నాను. మణిపూర్‌లో చాలా హింస ఉంది. కానీ ఏ పత్రికలు దాన్ని బహిర్గతం చేసే ప్రయత్నం చేయడం లేదు. వార్తలు అంటే.. ఎంత మంది చనిపోయారు, ఎంత మందిని అరెస్టు చేశారు, రాజకీయ వార్తలు మాత్రమే అనుకుంటున్నారు. కానీ జీవితం వీటికే పరిమితమై లేదు. వాళ్లకు జీవించే హక్కు ఉంది. మంచి జీవితాలు అందించడం కోసం మా ప్రాంతం అభివృద్ధి కావాల్సిన అవసరం ఉంది. కానీ వీటిని పట్టించుకునే వారే లేరు. అందుకే నేను వాటిని ఎంచుకుని పనిచేస్తున్నా. మణిపూర్‌లో జరుగుతున్న నిత్య సంఘర్షణ వాతావరణం పిల్లలు, మహిళల మీద ఏ విధంగా ప్రభావం చూపిస్తుందో రాస్తున్నాను. అంతకుముందు స్థానిక జర్నలిస్టుల పనంతా... నేషనల్ మీడియా నుంచి వచ్చిన వాళ్లకు స్థానికంగా ఉన్న సమస్యలను చూపడం, వ్యక్తులను పరిచయం చేయడం వరకే పరిమితమయ్యేది. కొందరైతే ఫీల్డ్‌కి రాకుండా ఏం జరిగిందో చెప్పమని ఫోన్‌లోనే వార్త తీసుకునేవారు. మా శ్రమకు గుర్తింపు లేకపోయేది. కనీసం ఆ సమస్య పట్ల సహానుభూతి కూడా ఉండేది కాదు రాసేవాళ్లకు. స్థానికంగా విషయం పట్ల ఎంతో అవగాహన ఉన్నవాళ్లను నియమించుకోకుండా... ఢిల్లీనుంచి వచ్చి ఉపరితలంపై కనిపించే సమస్యలకే పరిమితమయ్యేవారికే ఎక్కువ అవకాశాలు ఉంటున్నాయి. ఇక వేతనాల విషయంలోనూ స్థానికులకు, ఇతరులకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది.

**- తింగ్నమ్ అంజులికా సమోమ్, మణిపూర్**

## నాగాలాండ్ ఎన్నో నేర్పించింది...



ఢిల్లీలో చదువుకుని నాగాలాండ్‌లో అడుగు పెట్టిన నాకు.. అక్కడి చదువుకు ఇక్కడి ఆచరణకు ఎంతో తేడా ఉందనిపించింది. స్థానిక మీడియా నన్ను సాదరంగా ఆహ్వానించింది. అయితే ఎక్కడైనా రిపోర్టింగ్ చేయాలంటే ఉండాల్సింది అక్కడి ప్రజలపై సానుభూతి కాదు. సహానుభూతి. నెమ్మదిగా నెమ్మదిగా నేను అది పెంచుకోగలిగాను. నేను రాసింది అక్కడి ప్రజలకు అర్థం కావాలంటే... ఎంతో సరళంగా రాయాలి. నా ఇంగ్లీష్‌ను సరళం చేసుకుంటూ వెళ్లాను. ఇక బయటినుంచి వెళ్లిన వ్యక్తిగా ఎలాంటి తెగలకు సంబంధించిన పోలికలు లేకపోవడం నాకు ఒక్కోసారి ప్లస్ అయ్యేది. అలాగే ఎన్ఐఏ అధికారులతో మాట్లాడటానికి హిందీ ఎంతో ఉపయోగపడింది. అయితే ఎన్ఐఏ అధికారులు నేరుగా పత్రికా ఆఫీసుల్లోకి వస్తారు. మిలిటెంట్ ఆర్గనైజేషన్స్ గురించి సమాచారం చెప్పాలంటూ ఇబ్బంది పెడతారు. ఎన్ఐఏ దగ్గర దీమాపూర్‌లో ఉన్న ప్రతి జర్నలిస్టుకు సంబంధించిన ఫైల్ ఉంటుంది. వార్త రాసినప్పుడల్లా బెదిరిస్తూ ఉంటారు. అందుకే ఎంత గొప్ప వార్త రాసినా... కింద పేరు ఇచ్చుకోవడానికి ఇబ్బంది పడతాం. తక్కువ బడ్జెట్, పాత టెక్నాలజీతో కూడా జర్నలిస్టుగా ఎంత బాగా పనిచేయొచ్చో నాగాలాండ్ నాకు నేర్పించింది. ప్రస్తుతం నేను మొరంగ్ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్నా.

**- అహేలి మోయిత్రా, నాగాలాండ్**

## రకరకాల ఒత్తిళ్ల మధ్య...



2012 నుంచి స్థానిక దినపత్రికల్లో పనిచేస్తున్నాను. 2015 నుంచి గ్లోబల్ ప్రెస్ జర్నల్‌లో రిపోర్టర్ కమ్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాను. కేవలం కశ్మీర్‌లో జరుగుతున్న సంఘర్షణలే కాకుండా... మహిళలు, వాళ్ల విద్య, వైద్యం, పిల్లలు, మానసిక ఆరోగ్యం వంటి అనేక అంశాల మీద కథనాలు రాస్తున్నాను. జాతీయ మీడియాలో కశ్మీర్‌ను చిత్రీకరించే పద్ధతే సమస్యాత్మకంగా ఉంది. టెర్రరిస్టుల కేంద్రంగా చూపిస్తున్నారు. టీవీఛానళ్లలో పనిచేసే చాలామంది జర్నలిస్టులు ఎన్‌కౌంటర్ల గురించి రాసేటప్పుడు కేవలం అధికారుల వర్షన్ మాత్రమే తీసుకుంటారు. ఎలాంటి పరిశోధనలు చేయరు. పూర్తిగా అసత్య ప్రచారాలు చేస్తారు. కశ్మీర్ అనగానే ఫెరాన్ (కశ్మీరీ సంప్రదాయ మహిళల వస్త్రధారణ) ధరించి గ్లోరిఫై చేయడానికి ప్రయత్నిస్తారు. స్థానికంగా జరుగుతున్నది మాత్రం దీనికి విరుద్ధంగా ఉంటుంది. అందుకే ప్రధాన స్రవంతిలో ఉన్న టీవీ ఛానళ్లు, పత్రికలు రాసే కథనాలు కాకుండా భిన్నమైన అంశాలపై దృష్టి సారిస్తున్నాను. ఇక్కడ విద్యావ్యవస్థ బాగానే ఉంది. చదువుల్లో అమ్మాయిలు చాలా ముందుంటున్నారు. వైద్య సదుపాయాలే సరిగ్గా లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు ప్రయివేటు ఆస్పత్రులకే వెళ్లాల్సిన పరిస్థితి. అక్కడ వాళ్ల ఆగడాలకు అడ్డు అదుపూ ఉండదు. కొన్నేండ్ల కిందట కశ్మీర్‌లో అతిపెద్ద పిల్లల ఆస్పత్రి జీబీ పంత్ హాస్పిటల్లో రెండునెలల్లోనే 100 మందికి పైగా శిశువులు మరణించారు. ఇంకా దానిపైన విచారణ కొనసాగుతుంది. బాధితులకు ఎలాంటి అన్యాయం జరగలేదు. ఇలాంటివన్నీ ఫోకస్ చేస్తూ రాస్తున్నాను. అయితే స్థానిక మీడియా ప్రవేశించడానికి వీలులేని నిషేధిత ప్రాంతాల్లో కూడా నేషనల్ మీడియాకు మాత్రం అవకాశం ఇస్తారు. ఇదే పద్ధతో అర్థం కాదు. కర్ఫ్యూ ప్రాంతాల్లోకి మమ్మల్ని పంపడానికి ఒప్పుకోరు. మేం ఏవన్నా ఫొటోలు తీస్తే వాటిని డెలిట్ చేసేదాక ఊరుకోరు. అవసరమైతే కెమెరా ధ్వంసం చేస్తారు. అడ్డు అదుపు ఉండదు. ఓవైపు ప్రభుత్వాలు, ఆర్మీనుంచి ఈరకమైన వాతావరణం ఉంటే... స్థానికంగా ఉండే కట్టుబాట్లు మరో అడ్డంకి. మహిళలు జర్నలిజం చేయడమేంటని హెచ్చరికలు. ఇట్లయితే ఎవరూ పెండ్లి చేసుకోరని బెదిరిస్తారు. పిల్లలపై లైంగిక హింస, ట్రాన్స్ పర్సన్స్ కథనాలు రాస్తే... ఇలాంటి రాయొద్దని మత పెద్దల నుంచి ఒత్తిళ్లు వస్తాయి.

**- రహెనా మక్బూల్, కశ్మీర్**

# జాగ్రత్తగా ఉంటే మేలే

**ఈ మధ్య కాలంలో షాపింగ్ కోసం క్రెడిట్ కార్డు వాడకం ఎక్కువయింది. క్రెడిట్ కార్డుతో షాపింగ్ అనగానే వెంటనే గుర్తొచ్చే విషయం రివార్డు పాయింట్లు. కంపెనీని బట్టి రివార్డు పాయింట్స్ సౌలభ్యాలు మారుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో రివార్డు పాయింట్ల వల్ల కలిగే ప్రయోజనం, సకాలంలో వీటిని ఎలా ఉపయోగించాలి, అలా వాడుకోకపోతే ఏమవుతోందో తెలుసుకుందాం.**



- రివార్డు పాయింట్స్ కోసమే చూడకూడదు. ఎందుకంటే రివార్డు కార్డులకు సాధారణ కార్డుల కన్నా అధిక వడ్డీ వసూలు చేస్తారు. అన్ని కార్డులు, లావాదేవీలకు రివార్డు పాయింట్లు ఒకేలా ఉండవు. సాధారణంగా వినియోగించే ప్రతి 100 నుంచి 150 రూపాయలకు ఒకటి లేదా రెండు పాయింట్లు వస్తాయి. ఇలా ఆర్జించిన రివార్డు పాయింట్లన్నంటినీ ఉపయోగించుకుని కంపెనీ అందించే వివిధ వస్తువులు లేదా సేవలను పొందవచ్చు.
- కొన్ని కంపెనీలు రిడీమ్ చేసేందుకు సైతం రుసుములను విధిస్తున్నాయి. ఇందుకోసం క్రెడిట్ కార్డు నియమనిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఏదైనా సందేహం వస్తే కస్టమర్ కేర్‌ను సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలి.
- చాలా మంది ఎక్కువ పాయింట్ల కోసం ఎక్కువ కొనాలనుకుంటారు. అలా కాకుండా తెలివిగా కార్డును వాడుకోవడం ద్వారా ఎక్కువ పాయింట్లను సంపాదించవచ్చు.
- పండుగల సమయాల్లో బ్యాంకులు, క్రెడిట్ కార్డు కంపెనీలు వివిధ ఆఫర్ల మెయిల్స్ పంపుతుంటాయి. వాటన్నింటినీ అలా వదిలేయకూడదు. అప్పుడప్పుడు అవసరాలకు తగిన వాటిపై ఆఫర్లు ఏమైనా ఉంటే గమనిస్తూ ఉండాలి.
- క్రెడిట్ కార్డు కంపెనీలు ట్రావెల్ కంపెనీలతోను, రెస్టారెంట్లతోనూ, వస్త్ర దుకాణాలతో కలిపి క్యాష్‌బ్యాక్ ఆఫర్లను ప్రకటిస్తాయి. కొన్ని కంపెనీలు గిఫ్ట్‌వోచర్లను ప్రకటిస్తాయి. వాటితో ట్రావెల్ కంపెనీల టికెట్లను, రెస్టారెంట్లలో డిస్కౌంట్లకు వాడుకోవచ్చు.
- కొన్ని కార్డులు పెట్రోల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని, పెట్రోలు, డీజిల్ కొన్న ప్రతిసారీ కొంత శాతం ధర తగ్గించి ఇస్తున్నాయి. తరుచూ విమాన ప్రయాణాలు చేసేవారికి, విమాన టికెట్లలో రాయితీలను పొందేందుకు కొన్ని కార్డులు అవకాశం కల్పిస్తున్నాయి.
- గోల్డ్ క్రెడిట్ కార్డులు కలిగిన వారికి క్యాష్‌బ్యాక్ ఆఫర్లతో పాటు రివార్డు పాయింట్లు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. కొన్ని కంపెనీలు రివార్డు పాయింట్లను నగదుగా మార్చుకునేందుకు సైతం వీలు కల్పిస్తున్నాయి.

## పాయింట్ల ద్వారా ప్రయోజనం

పాయింట్లను ఎలా రిడీమ్ చేసుకోవాలో బ్యాంక్ వెబ్‌సైట్లలో పొందుపరుస్తారు. రిడీమ్ చేసుకున్న పాయింట్లతో వచ్చే సదుపాయాలు బ్యాంకును బట్టి మారుతూ ఉంటాయి.

1. రివార్డు పాయింట్లతో ఎంపిక చేసిన బట్టల, గోల్డ్, చెప్పుల, ఎలక్ట్రానిక్ కంపెనీల వంటి వాటిలో ఏవైనా వస్తువులు కొనేందుకు ఉపయోగించవచ్చు.
2. ఎక్కువ కంపెనీలు కస్టమర్ కేర్ ప్రతినిధులకు ఫోన్‌చేసి మీకు వర్తించే ఆఫర్లను తెలుసుకుని వెంటనే ఆర్డర్ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. తర్వాత మీకు దగ్గరగా ఉండే చోట ఆ వస్తువులను పొందవచ్చు.
3. కంపెనీ వెబ్‌సైట్లలో రిడెంప్షన్ ఫామ్ లభిస్తుంది. దాన్ని పూర్తిచేసి అక్కడ తెలియపరిచిన చిరునామాకు దాన్ని పోస్ట్ చేయాలి.
4. కంపెనీ వెబ్‌సైట్లలో నెట్ బ్యాంకింగ్‌లో లాగిన్ అవ్వాలి. క్రెడిట్ కార్డు నెంబరును పొందుపరచాలి. పాయింట్స్ రిడీమ్ ఆప్షన్ ఎంచుకోవాలి. రిడెంప్షన్‌ను ఎంచుకున్న తర్వాత సబ్‌మిట్ నొక్కాలి. రిడీమ్ చేసిన తర్వాత రిడెంప్షన్ ఆర్డర్ నంబరు వస్తుంది. ఏదైనా సమస్య వస్తే చెక్ చేసుకోడానికి వీలుగా దాన్ని రాసి ఉంచుకోవాలి.
5. కొంత శాతం నగదు చెల్లించడం, మిగిలిన ధరకు రిడీమ్ చేసిన పాయింట్లను వాడుకునే సౌలభ్యాన్ని కల్పిస్తూ కొన్ని కంపెనీలు వస్తుసేవలను అందిస్తున్నాయి.
6. సాధారణంగా కంపెనీ వెబ్‌సైట్లో లాగిన్ అవ్వగానే రిడీమ్ చేసే వస్తువులు, సేవలకు సంబంధించిన కేటలాగ్ ఉంటుంది. దాని ఆధారంగా మనకు ఉత్తమమైన దానిని ఎంచుకోవచ్చు. కొన్ని వెబ్‌సైట్లలో రివార్డు పాయింట్ల సంఖ్య, వస్తువుల కేటగిరీలను బట్టి ఆ పరిధిలోకి వచ్చే వస్తువులను అందుబాటులో ఉంచుతాయి. మనకు నచ్చిన దానిని ఎంపిక చేసుకుని ఆర్డర్ చేయవచ్చు.

ఇలా క్రెడిట్ కార్డును జాగ్రత్తగా వాడుతూ రివార్డు పాయింట్లను సకాలంలో వినియోగించుకుంటే కార్డు వల్ల మేలు కలుగుతుంది.

## ఇట్లచేద్దాం

ఒక నిమ్మకాయ రసాన్ని పిండి అందులో బేకింగ్ పౌడర్ వేసి పేస్ట్‌లా చేయాలి. దీన్ని మరకలున్న గోడమీద రుద్ది గంట తర్వాత స్పాంజ్‌తో తుడిస్తే మరకలు పోతాయి.

## ముత్యాల ముగ్గులు




7 చుక్కలు
మధ్యచుక్క
4 వచ్చేవరకు

నీలారపు ధీరజ
5వ తరగతి
హన్మకొండ




21 చుక్కలు
1 వచ్చేదాక
సరిచుక్క

ఇ. శారాద
గోవిందరావు పేట,
భూపాలపల్లి జిల్లా.



డిజైన ముగ్గు

సి.లక్ష్మి
లంబాడి తండ



15 చుక్కలు
మధ్య చుక్క
8 వచ్చేవరకు

అజూయ్ బేగం
కాచిగూడ, కృష్ణనగర్

## మెరుగైన వైద్యం కోసం విదేశాలకు అవసరం లేదు

- సిటిజెన్స్ స్పెషాల్టీ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలు
- ఆపరేషన్ లేకుండా 82 ఏండ్ల వ్యక్తికి గుండె వాల్వ్ మార్పిడి
- హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్‌ను ప్రారంభం


**నవతెలంగాణ-హైదరాబాద్ సిటీబ్యూరో**

గుండెజబ్బులంటే చాలా మంది ఆందోళనకు గురవుతారు.. స్థోమతను బట్టి రోగులు చికిత్స పొందుతున్నారు.. కానీ సంపన్నులు విదేశాలకూ పోతున్నారు.. కానీ, ఇకపై అంత శ్రమ అవసరం లేదని, అత్యాధునిక టెక్నాలజీ వైద్యం ఇక్కడే అందిస్తామంటున్నారు హైదరాబాద్‌లోని సిటిజెన్స్ స్పెషాల్టీ ఆస్పత్రి వైద్యులు. విదేశాల్లో పొందే అన్ని వైద్యసదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ఆపరేషన్ లేకుండానే గుండె వాల్వ్ మార్పిడి చికిత్స చేస్తున్నారు. సిటిజెన్స్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కీలకమైన కాల్షియఫ్ అర్టిక్ స్టెనోసిస్, ట్రాన్స్‌హెటర్ అరోటిక్ వాల్వ్ రిప్లేస్‌మెంట్ (టీఏవీఆర్)ను 82 ఏండ్ల వ్యక్తికి అమర్చారు. ఆపరేషన్ అనంతరం మూడు రోజుల్లోనే పేషెంట్‌ను డిశ్చార్జ్ చేశారు. ఆపరేషన్ విజయవంతమైన సందర్భంగా గురువారం పంజాగుట్టలో మెర్క్యూర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 'హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్' బ్రోచర్‌ను ఆస్పత్రి వైద్యులు ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్లు గోకుల్‌రెడ్డి, హరిరామ్, సుధీర్‌తోపాటు జోనల్ డైరెక్టర్ నీలేస్ గుప్తాతో కలిసి కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.శ్రీనివాస్‌కుమార్ వివరాలు తెలిపారు. అరోటిక్ వాల్వ్ అనేది గుండెలోని నాలుగు కవాటాల్లో ఒకటన్నారు. ఇది కుచించుకుపోవడాన్ని అరోటిక్ స్టెనోసిస్ అంటారని తెలిపారు. ఈ సమస్యకు లోనైన వారిలో శ్వాస పీల్చడం, ఛాతి నొప్పి, మైకం రావడం, చివరకు హార్ట్ ఫెయిల్యూర్ వంటి ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. గతంలో ఓపెన్ హార్ట్ ఆపరేషన్లు చేసేవారని, ఆ తర్వాత బైపాస్ సర్జరీ అందుబాటులోకి వచ్చిందని అన్నారు. ఈ రెండు ఆపరేషన్లు చేయడంలో చాలా రిస్క్‌వుంటుందన్నారు.

# నేడు పీఎస్ఎల్‌వీ-సీ 40 ప్రయోగం


- మూడు స్వదేశీ, 28 విదేశీ ఉపగ్రహాలు
- కొనసాగుతోన్న కౌంట్‌డౌన్
- ఉదయం 9.29 గంటలకు నింగిలోకి

**నెల్లూరు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమైంది. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్‌వీ) సీ-40 ప్రయోగాన్ని నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ప్రయోగించనుంది. అందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. నేటి ఉదయం 9.29 గంటలకు మొదటి ప్రయోగవేదిక నుంచి పంపనున్న ఈ రాకెట్ కౌంట్‌డౌన్ గురువారం తెల్లవారుజామున 5.29 గంటలకు ప్రారంభమైంది. 28 గంటల అనంతరం నింగిలోకి వెళ్లనుంది. ఇందులో మూడు స్వదేశీ, 28 విదేశీ ఉపగ్రహాలను తీసుకెళ్లనుంది. తదుపరి ఇస్రో చైర్మన్ ఎన్. శివన్ బుధవారమే షార్‌కు చేరుకున్నారు. రాకెట్ నమూనాతో స్థానిక చెంగాళమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇస్రో శాస్త్రసాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా ఇలాంటి ఆచారాలు మాత్రం కొనసాగుతుండటం గమనార్హం. ఏదైనా ప్రయోగం విఫలం తర్వాత విజయం కోసం ఇస్రో ఎప్పుడూ తహతహలాడుతూ దీక్ష, పట్టుదలతో ముందుకుపోతుంది. గతేడాది అగస్టులో



నిర్వహించిన పీఎస్ఎల్‌వీ -సీ39 ఘోరంగా విఫలమైంది. పీఎస్ఎల్‌వీ ఇప్పటివరకూ 41 ప్రయోగాలు నిర్వహించింది. అందులో కేవలం రెండు మాత్రమే విఫలమయ్యాయి. ఇప్పుడు నిర్వహిస్తున్నది 42వ ప్రయోగం. ఆ ఘోర తప్పిదం నుంచి గుణపాఠం నేర్చుకొని ఇస్రో మొత్తం ఈ ప్రయోగంపై దృష్టి పెట్టింది. పీఎస్ఎల్‌వీ సి-40 ప్రయోగం ఈనెల 10వ తేదీన నిర్వహించాల్సి ఉంది. సాంకేతిక కారణాల రీత్యా శుక్రవారం నిర్వహిస్తున్నారు.

## నాణేలకు గూడు కరువు



**ముంబయి :** నిత్యం వినియోగించే కరెన్సీ నాణేలకు ఇప్పుడు గూడు కరువైంది. బ్యాంకుల్లో వాటిని నిల్వ చేసేందుకు తగినంత స్థలం లేదట. దీంతో ముంబయి, కోల్‌కతా, నోయిడా, హైదరాబాద్ లోని ప్రభుత్వ కరెన్సీ ముద్రణాలయాలు నాణేల ముద్రణను నిలిపివేసినట్టు గురువారం నాడు సంబంధిత వర్గాలు తెలిపాయి. 'చలామణిలోని ఉన్న అన్ని డినామినేషన్లలోని నాణేల ముద్రణను తక్షణమే నిలిపేయండి' అంటూ ఈ నాలుగు ముద్రణ కేంద్రాల నిర్వహణ సంస్థ అయిన సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్) బుధవారం నాడు ఒక సర్క్యులర్ జారీ చేసినట్టు సమాచారం. కాలానుగునంగా నాణేల చలామణి, నిల్వకు అవసరమైన స్థలం వంటి అంశాల ఆధారంగా ముద్రణ చేపడతారని రిజర్వుబ్యాంకు వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం బ్యాంకుల్లో కానీ, రిజర్వుబ్యాంకులో కానీ నాణేల నిల్వకు తగిన స్థలం లేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కరెన్సీ ముద్రణా లయాల నుంచి నాణేలను సేకరించి రిజర్వుబ్యాంకు వాటిని చలామణిలోకి తీసుకొస్తుంది. 2016 నవంబరులో నోట్ల రద్దు ప్రకటన తర్వాత పాత నోట్లు కుప్పలుతెప్పలుగా వచ్చిపడటంతో వాటిని నిల్వ చేయడానికి బ్యాంకుల్లోని స్థలమంతా సరిపోయిందని, దీంతో నాణేల నిల్వకు చోటు లేకుండా పోయిందని తెలుస్తుంది.

## సర్పంచులకు అప్పీల్ చేసుకునే అవకాశం

**కొత్త పీఆర్ చట్టంపై సబ్‌కమిటీలో ప్రతిపాదన**

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

సర్పంచ్‌లపై కలెక్టర్ తీసుకునే క్రమశిక్షణా చర్యలపై అప్పిలేట్ అథారిటీగా ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేసే విషయాన్ని నూతన పంచాయతీరాజ్ చట్టంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ చర్చించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి క ష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో గురువారం వరుసగా నాలుగో రోజూ సమావేశమైంది. ఈ సందర్భంగా చట్టంలో పొందుపర్చాలనుకుంటున్న పలు కీలక అంశాలను పరిశీలించారు. ఇప్పటివరకు సర్పంచ్‌లపై తీసుకునే క్రమశిక్షణా చర్యలపై అప్పిలేట్ అథారిటీగా ప్రభుత్వం తరపున పంచాయతీరాజ్ శాఖ మంత్రే వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రిబ్యునల్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మరింత పారదర్శకంగా వ్యవహరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సబ్ కమిటీ చైర్మెన్ జూపల్లి కష్ణారావు అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు సీఎం కార్యాలయ ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, అదనపు కార్యదర్శి స్మితా సభర్వాల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు. కొత్త చట్టానికి తుదిరూపం ఇచ్చేందుకు మంత్రుల సబ్‌కమిటీ సమావేశం మరోసారి జరగనుంది.

**'ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేయాలి'**

ముగ్గురు పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా పేర్కొంటూ 1995లో విధించిన నిబంధనను ఎత్తివేయాలని సబ్ కమిటీ చైర్మన్, మంత్రి జూపల్లి కత ష్ణారావుకు తెలంగాణ గిరిజనాభివ ద్ధి సంస్థ చైర్మన్ గాంధీనాయక్ వినతి పత్రం అందజేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేని నిబంధన స్థానిక సంస్థల్లో పోటీచేసే వారికి మాత్రమే వర్తింపజేయడం సరికాదని, దీనిని కొత్త చట్టంలో ఎత్తేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో షెల్టర్లు!

- సర్వే చేస్తున్న మెప్మా, టీవీవీపీ,

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల అటెండర్లకు, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) సర్వేలు నిర్వహిస్తున్నాయి. సర్వే చేసిన తర్వాత సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని నిర్ణయించాయి. ఇప్పటికే దాదాపు 40 ప్రభుత్వ ఆస్పత్రుల్లో షెల్టర్లపై సర్వే పూర్తి చేసినట్టు తెలిసింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా సర్వే పూర్తి చేసి పది రోజుల్లోనే నివేదిక రూపొందించాలని సర్కారు ఆదేశించింది.దీనికి సంబంధించి 'అర్బన్ దోస్త్' పేరుతో యాప్ తెచ్చేందుకు ప్రత్యేక స్టాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దీర్ఘ కాలిక రోగులు, దూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చిన పోయే వారికి షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో రోగుల సహాయకులు, వారి బంధులు సౌకర్యార్థం ఆస్పత్రి ప్రాంగణాలు, ఆ సమీప ప్రాంతంలో షెల్టర్లు ఏర్పాటు చేయాలని మెప్మా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రాష్ట్ర వ్యాప్తంగా 88 ప్రభుత్వ ఆస్పత్రుల్లో షెల్టర్లను ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఉపాధి, ఉద్యోగాలు, కోచింగ్‌ల కోసం వచ్చే వారికి కూడా ఉపయోగపడేలా ఈ షెల్టర్లను రూపకల్పన చేయనున్నారు. ఆస్పత్రుల్లో ఉన్న ఖాళీ స్థలాలు, ఉన్న భవనాలలో ఉన్న రూమ్‌లను ఆధునీకరించే ప్రత్యేక నమూనాను రూపొందించారు. ఇక్కడ షెల్టర్లలో ఆశ్రయం పొందేవారికి సంబంధించిన పూర్తి వివరాలు, రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా ఎన్ని రోజులు ఉంటారనే విషయాన్ని తీసుకుంటారు. షెల్టర్లను ఏర్పాటు చేయడమే కాకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. దీని నిర్వహణ బాధ్యతను మాత్రం ప్రయివేట్ సంస్థలకు అప్పగించే అవకాశం ఉందని మెప్మావర్గాలు తెలిపాయి.

## డబుల్‌బెడ్‌రూం లబ్దిదారుల ఎంపికలో రభస

- పంచాయతీ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం
- మంత్రి ఎదుట కంటతడి పెట్టిన మహిళలు
- న్యాయం చేస్తామని మంత్రి హామీ


**నవతెలంగాణ - వేంసూరు**

డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులకు ఇవ్వకుండా అనర్హులకు మంజూరు చేశారని ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ఎంపిక చేసిన పేర్లు గురువారం ఉదయానికి తారుమారవ్వటంతో లబ్దిదారులు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎంపికైనవారు, పేర్లు రానివారి మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో పంచాయతీ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసమైంది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే...

వెంకటాపురం గ్రామంలో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపట్టింది. ఈ ఇండ్లకు గ్రామం నుంచి 600 దరఖాస్తులు వచ్చాయి. ఇండ్లకు బుధవారం రాత్రి లబ్దిదారుల ఎంపిక చేశారు. అయితే, గురువారం ఉదయానికి 60 మందిలో 12మంది పేర్లను మార్చారని లబ్దిదారులు ఆందోళనకు దిగారు. ప్రారంభోత్సవానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వస్తున్నారన్న సమాచారం అందుకున్న లబ్దిదారులు కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. సభాకార్యక్రమం జరుగుతున్నంత సేపూ మహిళలు కన్నీరుమున్నీరయ్యారు. మంత్రిని కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అది గమనించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారిని పంపమని చెప్పడంతో స్టేజి వద్దకు చేరుకున్న మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ పేర్లను జాబితాలో చేర్చి రాత్రికిరాత్రే తొలగించారని, తమకు కనీసం ఇండ్లు, స్థలాలు కూడా లేవని న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. అభివృద్ధిని ఓర్వలేక లబ్దిదారులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, వారు జన్మలో ఇటువంటి ఇండ్లను కట్టలేరని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## అధికారికంగా జరిపితే బాగుంటుంది..లేదంటే మేమే చేస్తాం

- మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలపై రోశయ్య



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుంటుందని, లేకపోతే తామే నిర్వహిస్తామని తమిళనాడు మాజీ గవర్నర్ కె రోశయ్య చెప్పారు. అధికారికంగా నిర్వహించాలని అడగడం బాగుండదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గురువారం ఫతే మైదాన్‌లో మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాల కమిటి సభ్యులు మర్రి శశిధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్యామ్‌మెహన్, కుమారరావు, జి నిరంజన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 13న మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలను 13న పుదుచ్చేరి సీఎం నారాయణ స్వామి ప్రారంభిస్తారన్నారు. ఈ సంవత్సరమంతా శతజయంతి ఉత్సవాలు జరుగుతాయన్నారు. చెన్నారెడ్డి భారతదేశం గర్వించతగ్గ నేత అని, అనేక పదవులను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఆయన గౌరవాన్ని పెంచేలా ఉత్సావాలు జరుగుతాయన్నారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ ఈ కార్యక్రమంలోపాలు పంచుకుంటారన్నారు.హైదరాబాద్, విజయవాడ తోపాటు మరికొన్ని ప్రాంతాలల్లో కూడా నిర్వహిస్తామన్నారు.

## గెజిటెడ్ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ

**హైదరాబాద్ :** తెలంగాణ సహకార శాఖ గెజిటడ్ అధికారుల సంఘం డైరీని టీఆర్ఎస్ ఎమ్మెల్యే .శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు,. గురువారం సహకార శాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, ఓంప్రకాశ్, రాజేష్,విత్తల్, రాజేశ్వరి, బాలరాజు, సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

# రూల్స్‌గీల్స్ జాన్తానై..!



(ఫైల్)

**ప్రయివేటు బడుల్లో భారీగా ఫీజులు పెంపు**

- లక్షల్లో డొనేషన్లు, వేలల్లో అడ్మిషన్ ఫీజులు
- సర్కారు స్టేటస్‌కో ఉత్తర్వులు బుట్టదాఖలు
- పెంచుకుంటామంటున్న యాజమాన్యాలు
- పర్యవేక్షణ మరిచిన విద్యాశాఖాధికారులు

**"2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు పెంచవద్దు. 2017-18లోని ఫీజులనే కొనసాగించాలి. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదికను పరిశీలించిన తర్వాత ఫీజులపై నిర్ణయం ప్రకటిస్తాం. డీఈఓలు ఈ ఉత్తర్వులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి..." ఇదీ ఈనెల 4న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య ఇచ్చిన ఉత్తర్వుల సారాంశం. కానీ ఈ ఆదేశాలను యాజమాన్యాలు బుట్టదాఖలు చేశాయి. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి పది నుంచి 15శాతం ఫీజులు పెంచినట్టు ప్రకటించాయి. వీటిని ఆయా పాఠశాలల్లోని నోటీస్ బోర్డులోనూ ప్రదర్శిస్తుండటం గమనార్హం.**

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

రాష్ట్రంలోని సీబీఎస్ఈ, సీబీఎస్ఈ, కెంబ్రిడ్జి, ఐసీఎస్ఈ, ఐబీ తదితర సెంట్రల్ సిలబస్ పాఠశాలలకు సంబంధించిన అడ్మిషన్ల షెడ్యూల్‌ను తెలంగాణ ప్రభుత్వం వారం రోజుల క్రితం ప్రకటించింది. ఈనెల 2నుంచి ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించి, ఈనెల 12న ఫైనల్ లిస్టు ప్రకటించాలనీ ఆదేశించింది. అయితే రాష్ట్ర సెలబస్ ఉన్న పాఠశాలలకు ఈ ఉత్తర్వులతో సంబంధం లేదు. వాటికి ప్రత్యేకంగా మరో అడ్మిషన్ నోటిఫికేషన్ ఇవ్వనుంది.


రాష్ట్రంలో 12వేల ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలుండగా, వీటిలో సుమారు రెండు వందల వరకు సెంట్రల్ సెలబస్ బడులున్నాయి. రాష్ట్రంలోని ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీ గతేడాది డిసెంబర్ 31న ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఈ క్రమంలోనే సెంట్రల్ సెలబస్ పాఠశాలల్లో అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అడ్మిషన్ షెడ్యూల్‌తో పాటు ఫీజులపై నిర్ణయం ప్రకటించకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సర్కారు దృష్టికి తీసుకుపోయారు. దీంతో ప్రభుత్వం ఫీజులపై స్టేటస్‌కో ప్రకటించింది. రాష్ట్ర, సెంట్రల్ సెలబస్ పాఠశాలల్లో 2018-19 విద్యాసంవత్సరానికి 2017-18 ఫీజులనే కొనసాగించాలనీ ప్రభుత్వం ఆదేశించింది.

**ఆదేశాలు బుట్టదాఖలు...**

ఫీజులు పెంచవద్దని ప్రభుత్వమిచ్చిన ఆదేశాలను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. 2018-19 విద్యాసంవత్సరానికి గానూ అడ్మిషన్లు ప్రారంభమైన దాదాపు అన్ని బడులూ 10 నుంచి 15 శాతం ఫీజులు పెంచేశాయి. ఈ వివరాలను వెబ్‌సైట్‌లో, పాఠశాలల నోటీస్‌బోర్డుల్లో పెట్టేశాయి. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేట్ పాఠశాలలు ముందస్తుగానే ఫీజులు వివరాలను తల్లిదండ్రులకు చెప్పేశాయి. సెయింట్ అండ్రూవ్స్ స్కూల్, పల్లవి స్కూల్, నాసర్ స్కూల్, ఐబీ స్కూల్, శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్, సంక్టా మారియా, మీరు ఇంటర్నేషనల్ స్కూల్, గీతాంజలి, చెరిక్.. ఇలా దాదాపు అన్ని బడుల్లోనూ ఫీజులు పెంచినట్టు తల్లిదండ్రులు చెబుతున్నారు.

బడుల్లో డొనేషన్లు, అడ్మిషన్ ఫీజులతో పాటు ఇతర ఏ పేర్లతోనూ ఫీజులు వసూలు చేయవద్దని విద్యాహక్కు చట్టం, జీవోనెంబర్ 1 చెబుతున్నాయి. కానీ యాజమాన్యాలు మాత్రం వీటినీ పట్టించుకోవడం లేదు. లక్షల్లో డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. డొనేషన్స్ ఇస్తేనే సీట్లు కేటాయిస్తున్నారు.

వీటికితోడు అడ్మిషన్ ఫీజులు కూడా భారీగానే వసూలు చేస్తున్నాయి. నర్సరీ విద్యార్థులకూ 1.70లక్షలు, పీపీ1, పీపీ2కు 2.50లక్షల ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలూ నగరంలో ఉన్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఫీజులను పెంచొద్దనే విషయాన్ని యాజమాన్యాలకు తెలపాలని ప్రభుత్వం సూచించినా, డీఈఓలు పెద్దగా పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



**ఫీజులు పెంచొద్దు: కమిషనర్**

**ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రయివేటు, కార్పొరేట్ బడుల్లో ఫీజులు పెంచవద్దని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ యాజమాన్యాలకు సూచించారు. గురువారం విద్యాశాఖ డైరెక్టరేట్‌లో సెంట్రల్ సెలబస్ పాఠశాలల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన మెమోను అందజేశారు. యాజమాన్యాలు మాత్రం ఫీజులు పెంచుతామని స్పష్టం చేసినట్టు తెలిసింది.**

## గవర్నర్‌తో ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి భేటీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల గవర్నర్, విశ్వవిద్యాలయాల చాన్సలర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి భేటీ అయ్యారు. గవర్నర్‌కు నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఉన్నత విద్యా వ్యాప్తికి తీసుకుంటున్న చర్యలను గవర్నర్‌కు ఆయన వివరించారు. రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలు (సెట్స్)-2018ని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండడం పట్ల గవర్నర్ అభినందించారు. విద్యార్థుల హాజరుశాతంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులకు అధ్యాపకులు నాణ్యమైన విద్య బోధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో పరిశోధనలు పెరగాలని తెలిపారు. పర్యాటకానికి తెలంగాణ కేంద్రమని పేర్కొన్నారు. టూరిజం మార్కెట్‌కు దోహదపడేలా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. టూరిజం అండ్ హాస్పిటాలిటీ గురించి ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ రాసిన పుస్తకాన్ని గవర్నర్ నరసింహన్‌కు పాపిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఆర్ లింబాద్రి, వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, గవర్నర్ కార్యదర్శి హరిప్రీత్‌సింగ్ తదితరులున్నారు.

## ఒడిలో కూతురితో వార్తలు చదివిన యాంకర్

**ఇస్లామాబాద్:** రోజువారీ వార్తలు చదివేందుకు వచ్చిన ఓ యాంకర్ తన వెంట కూతుర్ని కూడా తెచ్చుకుంది. ఆమెను తన ఒడిలో కూర్చోబెట్టుకుని వార్తలు చదివింది. అలా ఆమె చేయడానికి వెనుక ఓ హృదయ విదారకరమైన ఘటనే కారణం. అభం శుభం తెలియని ఏడేండ్ల చిన్నారి జైనాబ్ అన్సారీని అపహరించి అత్యంత దారుణంగా లైంగికదాడికి పాల్పడి.. చంపేసిన ఘటన పాక్‌లోని కసూర్ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ ఘటనకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు పాకిస్థాన్‌కు చెందిన సమా టీవీ న్యూస్ ప్రజెంటర్ కిరణ్ నాజ్ ఇలా చేశారు.




## బీజేపీకి నాగం గుడ్‌బై?

**ఉగాది తర్వాత భవిష్యత్ కార్యాచరణ**

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

బీజేపీలో మరో వికెట్ పడేందుకు రంగం సిద్ధమైంది. మొదటినుంచీ పార్టీలో ఉండీ ఉండనట్టు వ్యవహరిస్తున్న మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి తాను పార్టీ మారడంపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. అయితే తాను ప్రస్తుతం బీజేపీలోనే ఉన్నానని, ఉగాది తర్వాత తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉగాది అనంతరం కార్యకర్తల అభిప్రాయం ప్రకారం నడుకుంటానని నాగం పేర్కొన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకత్వం తీరుపై తన అనుచరులు, కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల వాగ్దానాలను కేసీఆర్ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద అవినీతి కుటుంబం సీఎం కేసీఆర్‌దేనని విమర్శించారు. సకాలంలో పంచాయితీ ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. నాగం జనార్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరతారని తెలుస్తోంది. ఈసారి ఆయన అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

## తెలంగాణ ఇంటిపార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సేన

**నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్**

తెలంగాణ ఇంటిపార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సేనను ఏర్పాటు చేయబోతున్నట్టు ఆ పార్టీ అధ్యక్షుడు చెరకు సుధాకర్ తెలిపారు. దీనికి సంబంధించి సభను నిర్వహించబోతున్న తరుణంలో గురువారం సాంస్కృతిక సేన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యెన్న శ్రీనివాసరెడ్డి, జయధీర్‌తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌పై జానా లేదా ఉత్తమ్‌తో చర్చకు సిద్ధం : ఎంపీ బాల్క

**నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్**

విద్యుత్‌పై విశ్వసనీయత లేని రేవంత్‌రెడ్డి ఏమాత్రం చర్చించబోమని టీఆర్ఎస్ ఎంపీ బాల్కసుమన్ అన్నారు. ఆయనొక గజదొంగన్నారు. దిగజారుడు రాజకీయాలకు రేవంత్‌రెడ్డి నిలువెత్తు నిదర్శనమని చెప్పారు. కరెంట్‌పై చర్చకు జానారెడ్డి వస్తడా.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వస్తడా అని మేము సవాల్ చేస్తే దానిపై వాళ్లిద్దరు స్పందించకుండా, రేవంత్‌రెడ్డి దొంగలాగా ఒక ప్రకటన విడుదల చేసి చర్చకు వస్తానంటూ బాలకృష్ణ డైలాగులు రాసిండు అని అన్నారు. విశ్వసనీయత ఉన్న వ్యక్తులే చర్చకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఎన్ని రోజులుంటడో ఆయనకే తెలియదన్నారు. సంపత్‌కుమార్, దాసోజు శ్రవణ్‌కుమార్‌లతో వస్తానంటే కుదరదన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై తాము బుధవారమే వివరాలు వెల్లడించామన్నారు. ఎవరివి అవాస్తవాలో తేల్చుకోవడానికి జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ చర్చకు రావాలని కోరామన్నారు. వారు వస్తే సవివరంగా తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. రాజీనామా చేశానని చెప్పి.. ఆ లేఖను స్పీకర్‌కు పంపిన అబద్దాల కోరు రేవంత్‌రెడ్డి. అలాంటి వ్యక్తి ఏ హోదా ఉందని చర్చకు వస్తడని ప్రశ్నించారు. గురువారం టీఆర్ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌తో కలిసి సుమన్ మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సోలార్ విద్యుత్‌పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడన్నారు. సోలార్ విద్యుత్‌కు ఉమ్మడి రాష్ట్రంలో సర్కారు పక్క రాష్ట్రం కర్నాటక కంటే తక్కువ ధరే చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల్లో అనుమానాలు రేపాలన్న కాంగ్రెస్ కుట్రలు పారవన్నారు. భానుప్రసాద్ మాట్లాడుతూ ఆధారాలు లేకుండా గోబెల్స్ ప్రచారం చేయడం తగదన్నారు.

**వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఒక్కరు కూడా గెలవరు : మంత్రి జగదీశ్‌రెడ్డి**

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఒక్కరు కూడా గెలవబోరని, ఆ పార్టీ నుంచి అసెంబ్లీలో అడుగుపెట్టే వారు ఉండరని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలిలో విప్ బి.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, రాములు నాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు వస్తే దానిని కాంగ్రెస్ పార్టీ నేతలు సహించలేకపోవడం దారుణమన్నారు.

**విద్యుత్‌పై చర్చకు జగదీశ్‌రెడ్డి దూరం...**

24 గంటల విద్యుత్‌పై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నా, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని చెబుతున్నా, ప్రభుత్వ విద్యుత్ సంస్థలు దెబ్బతీసి, ప్రయివేటులు కొనుగోలు చేస్తున్నారని అంటున్నా సంబంధింత విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పందిస్తున్న దాఖలాలు లేవు. ఆయన విద్యుత్ శాఖ మంత్రి కాదా అన్న ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న విమర్శలకు, సవాళ్లకు ఎంపీ బాల్క సుమన్, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్ సమాధానం చెబుతుండడంతో, ఈ సమస్యపై మంత్రికి అవగాహన లేదా అన్న అభిప్రాయం చర్చ నడుస్తున్నది.

## సంగారెడ్డిలో కోట్ల రూపాయల డ్రగ్స్ స్వాధీనం

**నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లాలో గురువారం డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోట్ల రూపాయల విలువైన మత్తుబిళ్లలను స్వాధీనం చేసుకున్నారు. డీఆర్ఐ వర్గాలు తెలిపిన వివరాల ప్రాకరం కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు బెంజ్ కారులో వస్తున్న నలుగురి వద్ద డ్రగ్స్ ఉన్నట్టు డీఆర్ఐ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది.

# అత్తారింట్లోకి సంగీత..

- ప్రొటెక్షన్‌తోపాటు నెలకు రూ.20 వేలు చెల్లించాలి
- మియాపూర్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- పోరాటం ఫలించింది.. న్యాయం గెలిచింది : సంగీత
- అండగా నిలిచిన మీడియా, మహిళా, ప్రజాసంఘాలకు కృతజ్ఞతలు

**నవతెలంగాణ - బోడుప్పల్/మియాపూర్**

అత్తింటి వారినుంచి తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలని 54 రోజులుగా దీక్ష చేస్తున్న సంగీతకు మియాపూర్ కోర్టు ఊరటనిచ్చింది. గతేడాది నవంబర్ 19న భర్త చేతిలో తీవ్ర దాడికి గురైన సంగీత నాటినుంచి హైదరాబాద్ బోడుప్పల్ శ్రీనగర్‌కాలనీలోని అత్తింటి ఎదుట దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే విషయమై ఆమె కోర్టును ఆశ్రయించింది. కేసును విచారించిన మియాపూర్ కోర్టు గురువారం మధ్యంతర తీర్పు వెలువరించింది. తీర్పు ప్రకారం.. 'భర్త శ్రీనివాస్‌రెడ్డి భార్య, కుమార్తెను పోషించుకోవాలి. ఆమెను అత్తారింట్లోనే ఉండనివ్వాలి. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలి. భార్య, కుమార్తె పోషణకు నెలకు రూ.20 వేలు చెల్లించాలి' అని ఉత్తర్వులో పేర్కొంది. కోర్టు తీర్పు అనంతరం సంగీత అత్తింటి తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లింది.ఈ



సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓ మహిళగా, భార్యగా, తల్లిగా తన అత్తమామలు, భర్త నుంచి గౌరవప్రదమైన న్యాయం కావాలని కోరుకున్నానన్నారు. "కోర్టు తీర్పుతో నా పోరాటం ఫలించింది. నాకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నైతికంగా మద్దతిచ్చిన మీడియాకూ కృతజ్ఞతలు" చెప్పింది. తనలాగే భర్త చేతిలో ఇబ్బందులు పడుతున్న మహిళలు పోరాడాలని సూచించారు. సంగీతకు న్యాయం జరగడం పట్ల ఐద్వా నాయకులు సృజన హర్షం వ్యక్తం చేశారు. ఆమె పోరాటాన్ని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

# భారత ఐటీ నిపుణులకు ఊరట

## ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు వీలుగా అమెరికాలో చట్టం

## గ్రీన్‌కార్డుల సంఖ్యను పెంచనున్న అమెరికా




**వాషింగ్టన్:** నైపుణ్యమున్న భారతీయ ఐటీ నిపుణుల సేవలను పొందాలని అమెరికా యోచిస్తున్నది. ప్రతిభకు పట్టం కట్టేందుకు సిద్ధమైంది. ప్రతిభ ఆధారిత వలసవిధానాన్ని ప్రోత్సహించాలని, గ్రీన్‌కార్డుల వార్షిక కేటాయింపులను 45శాతానికి పెంచాలని భావిస్తోంది. అమెరికా చట్టసభ ప్రతినిధులు ఈ మేరకు ఓ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. దీంతో, భారత ఐటీ నిపుణులకు ఊరట లభించనుంది. 'అమెరికా భవిష్యత్ భద్రత చట్టం' పేరున ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన ఈ చట్టాన్ని అమెరికన్ కాంగ్రెస్ ఆమోదిస్తే గ్రీన్‌కార్డుల మంజూరీకి ఒక రూపం సంతరించుకునే అవకాశముంది. దీంతో ఏటా సంవత్సరానికి వచ్చే వలసదారుల సగటు తగ్గే అవకాశం ఉంది. గ్రీన్‌కార్డు కోసం ఏటా సుమారు 5లక్షల మంది భారతీయులు తాత్కాలిక హెచ్1బీ వీసాను పొడిగించుకుంటున్నారని సమాచారం. మరోవైపు ప్రతిభావంతులైన అమెరికన్ నిపుణులు కొరత కారణంగా కొన్ని కంపెనీలు తాత్కాలిక హెచ్1బీ వీసాల పేరుతో విదేశీ నిపుణుల మీద ఆధారపడాల్సి వస్తోంది. అమెరికన్ ప్రభుత్వం గ్రీన్‌కార్డుల సక్రమంగా ఇవ్వటాన్ని ఏటా కొనసాగిస్తే ప్రతిసారీ ఈ వీసా పొడిగింపుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు.

తాజా బిల్లు ప్రకారం.. ప్రస్తుతం కేటాయిస్తున్న గ్రీన్ కార్డుల సంఖ్య సంవత్సరానికి లక్ష 20వేలనుంచి ఒక లక్ష, 75వేలకు పెరగనుంది. ఈ ప్రతిపాదనతో గ్రీన్ కార్డుకోసం వేచిచూస్తున్న 5లక్షల మంది భారతీయులకు లబ్ది చేకూరతుందని అంచనా. ఈ బిల్లు ప్రకారం గ్రీన్ కార్డుల కేటాయింపు సంవత్సరానికి 1,20,000 నుండి 1,75,000 లకు పెంచాలని సభ్యులు ప్రతిపాదించారు. హెచ్1బీ వీసాతో అమెరికాలో అడుగుపెడుతున్న భారత ఐటీ ఇంజనీర్లు ఆ తర్వాత గ్రీన్ కార్డు (శాశ్వత నివాస)హోదా పొందుతున్నారు. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌కార్డు కొనసాగింపుపై చేసిన ప్రకటన అందోళన రేకెత్తించింది. అయితే ఈ కొత్త బిల్లు చట్టంగా మారితే భారత ఐటీ ఇంజనీర్లకు ప్రయోజనం చేకూరుతుందన్న విశ్లేషణ వినిపిస్తోంది.

కాగా, అమెరికాలో నివాస హోదా కల్పించే గ్రీన్ కార్డులను సొంతం చేసుకునే వారిలో మెజారిటీ పౌరలు భారతీయులేనన్న విషయం తెలిసిందే. ట్రంప్ సర్కారు మద్దతుతో ప్రతినిధుల సభ ముందుకు చేరిన ఈ బిల్లు ఆమోదం పొంది, అద్యక్షుడి సంతకం కూడా పూర్తయి చట్టంగా మారితే, ప్రస్తుతమున్న వైవిధ్య వీసా కార్యక్రమానికి చెక్ పడతుందని భావిస్తున్నారు.

### గ్రీన్‌కార్డు హోలర్డ్స్ బంధువులకు ఇబ్బందులు...

'ఒకవేళ ఈ బిల్లు చట్టంగా మారితే అన్ని రకాల సమస్యలూ పరిష్కారమవుతాయి. అంతర్గతంగానూ బలోపేతం అయ్యే అవకాశం ఉంది. వలస సంబంధిత చట్టాలను ఉల్లంఘించాలనుకునే వారికి ఇకపై కఠిన నియమాలు వర్తిస్తాయి' అని మిచెల్ మేకాల్(సెక్యూర్ అమెరికా ఫ్యూచర్ యాక్ట్ కమిటీకి ఛైర్మన్) అభిప్రాయపడ్డారు. అదే విధంగా ఒకరి ద్వారా మరొకరు వలస రావడం(చైన్ మైగ్రేషన్ విధానం)పై ప్రభావం పడుతుంది. అంటే భారత్ నుంచి వచ్చిన టెక్కీలు అమెరికాలో స్థిరపడి ఆ తర్వాత తమ కుటుంబసభ్యులను అమెరికాకు తీసుకువస్తుంటారు. కానీ ఈ చట్టంలో వారి బంధువులకు ఇకపై గ్రీన్‌కార్డ్ ఇవ్వకూడదని ప్రతిపాదించారు. కేవలం వారి పిల్లలకు, తోబుట్టులకు మాత్రమే ఈ సదుపాయం ఉంటుంది. ఇంకా వ్యవసాయ సంబంధిత పనులు చేసే శ్రామికుల కోసం మరో కార్యక్రమాన్ని అమెరికా ప్రతిపాదిస్తుంది. వ్యవసాయం ద్వారా కూడా తమ ఆర్థికవ్యవస్థను పెంచుకోవాలని వారు భావిస్తున్నారు. 'అన్ని రకాలుగా ఆలోచించి ప్రజా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సరిహద్దు భద్రతను పెంచేలా శాసన వ్యవస్థ ఈ చట్టాన్ని రూపొందించనున్నట్టు' కమిటీ సభ్యుడు తెలిపారు. 'అమెరికా ప్రజలకు ప్రధాన ప్రాధాన్యతనివ్వాలనుకుంటున్న ట్రంప్ విధానాలకు అనుగుణంగా ఈ చట్టం ఉంటుందని' వైట్‌హౌస్ ప్రకటించింది.

# ఇటలీలో తెలంగాణ టెకీ అనుమానాస్పద మృతి...


జయప్రకాశ్

**రోమ్:** ఇటలీలో తెలంగాణ ప్రాంతానికి చెందిన టెకీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వనపర్తి జిల్లాలోని ఘణపురం మండలం మానాజీపేట్ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ జయప్రకాశ్ ఇటలీలోని అప్రిలీయా పట్టణంలో గల ఐబీఎం సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అతడు ఆఫీసుకు వెళ్లలేదు.

దీంతో, అతని సహచర ఉద్యోగులు ఇంటికి వెళ్లి చూడగా జయప్రకాశ్ గదిలో విగతజీవిగా కనిపించాడు. కాగా, జయప్రకాశ్ మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృతిపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అసలు ఏం జరిగిందో తెలపాల్సిందిగా కోరుతూ సుష్మాస్వరాజ్‌కు ట్విట్టర్ ద్వారా విన్నవించారు. మృతదేహాన్ని స్వస్థలానికి త్వరగా పంపేలా ఏర్పాట్లు చేయాలని అభ్యర్థించారు.

### సిగరెట్ ఇవ్వలేదని.. బ్రిటన్‌లో ప్రవాస భారతీయుడి హత్య


విజయ్ పటేల్

బ్రిటన్‌లో ఓ ప్రవాస భారతీయుడు దారుణ హత్యకు గురయ్యాడు. సిగరెట్లు అమ్మేందుకు నిరాకరించినందుకు అతన్ని కొంతమంది మైనర్లు హతమార్చారు. వివరాల్లోకి వెళ్లితే...విజయ్ పటేల్ (49) అనే ప్రవాస భారతీయుడు ఉత్తర లండన్‌లో కొంతకాలం నివాసముంటూ చిరు వ్యాపారం చేస్తున్నాడు. గతనెల 30న కొంత మంది మైనర్లు అతని షాపుకు వచ్చారు. సిగరెట్లు అమ్మమని బెదిరించారు.

అయితే, లండన్‌లో అమల్లో ఉన్న చట్టాల ప్రకారం మైనర్లకు సిగరెట్ల అమ్మకంపై నిషేధం ఉండటంతో పటేల్ నిరాకరించారు. దీంతో, ఆగ్రహానికి గురైన మైనర్లు పటేల్‌పై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తలకు బలమైన గాయం కారణంగా పటేల్ మృతి చెందినట్టు స్థానిక సెయింట్ మేరీ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన ముగ్గురు మైనర్ నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టినట్టు స్కాట్‌లాండ్ యార్డ్ పోలీసులు తెలిపారు.

# నేడు ఆర్టీసీ కార్మికుల సంఘీభావ సభలు

## టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ పిలుపు

**నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో**

తమిళనాడు ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఈనెల 12వ తేదీ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద సంఘీభావ సభలు, గేట్ మీటింగ్‌లు నిర్వహించాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. తమిళనాడు ఆర్టీసీ కార్మికులు ఈనెల 5వతేదీ నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రాష్ట్ర ప్రభుత్వోగులకు ఇచ్చినట్టు ప్రస్తుత బేసిక్ పే మరియు గ్రేడ్ పే పై 2.55 రెట్లు పెంచాలని తమిళనాడు ఆర్టీసీ కార్మికులు కోరుతు న్నారని పేర్కొన్నారు. ఆరు నెలలు అక్కడి ఆర్టీసీ యాజ మాన్యం తో చర్చలు జరిగాయని, పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యం ముందు కు రాకపోవడంతో రెండోసారి సమ్మెకు సిద్ధ పడ్డారని తెలిపారు. సమ్మె చేస్తున్న 96 శాతం మంది కార్మికు లకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాలను కాదని, 4 శాతం కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాలతో యాజ మాన్యం తప్పుడు ఒప్పందం చేసుకున్నదని చెప్పారు.

### న్యాయస్థానంలో సమర్థ వాదనలు
### తీర్పును సవరించుకున్న కోర్టు

తమిళనాడు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె చట్టవ్యతిరేకమని, దాన్ని నిషేధించాలని కోరుతూ కొందరు వ్యక్తులు మద్రాస్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారని వీఎస్ రావు తెలిపారు. ఈ పిటీ షన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తే స్వయంగా పరిశీలించారని చెప్పారు. సమ్మె చట్టవ్యతిరేకమని, సమ్మెచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఈనెల 5వ తేదీనే కోర్టు తీర్పునిచ్చిందని వివరించారు. అయినా ఒక్క కార్మికుడు కూడా విధులకు హాజరు కాలేదని, ఆ తీర్పును సవాలు చేస్తూ కార్మిక సంఘాలు తమ వాదనను వినిపించాయని తెలిపారు. ఈనెల 8వ తేదీ హైకోర్టు న్యాయమూర్తి తాను అంతకు ముందు ఇచ్చిన తీర్పును సవరిస్తూ...సమ్మె చట్ట వ్యతిరేకమైనదేనని, అయినా తమ అనుమతి లేకుండా కార్మికులపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేశాం`న్నారు. ఈ ఘటన చారిత్రాత్మకమై నదని, దీనికి తమిళనాడు ఆర్టీసీ కార్మికులకు అభినం దనలు తెలుపుతు న్నామన్నారు. రాష్ట్రాలు వేరైనా ప్రభుత్వాల తీరు ఒక్కటేనని, తెలం గాణలో కూడా ఆర్టీసీ కార్మికుల వేతన ఒప్పంద కాలం ముగిసి పది నెలలు అవుతు న్నా ఇప్పటికీ అతీగతీలేదన్నారు. ఇక్కడి కార్మి కులపై పనిభారాలు తగ్గించాలని, యాజ మాన్యం వాడుకున్న కార్మికుల సొమ్ము రూ.1,636 కోట్లను తక్షణం ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న జరిగే సంఘీభావ సభల్లో యూనియన్లకు అతీతంగా కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఏప్రిల్ 15న ఆదర్శ పాఠశాలల ప్రవేశాల రాతపరీక్ష

- 23 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- షెడ్యూల్ విడుదల

**నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్**

రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 15న రాత పరీక్ష జరగనుంది. ఆరో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు ఏప్రిల్ 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏడు నుంచి పదో తరగతి వరకు చేరాలనుకునే విద్యార్థులు అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాతపరీక్ష నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ షెడ్యూల్ విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఈనెల 23 నుంచి వచ్చేనెల 16వ తేదీ వరకు ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 11 నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మే 16 నుంచి 19వ తేదీ వరకు ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాపై జిల్లాల జాయింట్ కలెక్టర్లు తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. మే 20 నుంచి 25వ తేదీ వరకు ఎంపికైన విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని పేర్కొన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం జనరల్ విద్యార్థులు రూ.100, ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థులు రూ.50 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఈనెల 23వ తేదీ నుంచి విద్యార్థులు దరఖాస్తు ఫారం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

# నవచిత్రం

## 50 వసంతాల అసాధ్యుడు


కృష్ణ

హీరో కృష్ణను సూపర్‌స్టార్ చేసిన చిత్రాల్లో 'అసాధ్యుడు' ఒకటి. కె.ఆర్.విజయ కథానాయికగా టైగర్ ప్రొడక్షన్స్ పతాకంపై వి.రామచంద్రరావు దర్శకత్వంలో నెల్లూరు కాంతారావు, ఎస్.హెచ్.హుస్సేన్ నిర్మించిన ఈ చిత్రం నేటితో (జనవరి 12, 1968) 50 వసంతాలు పూర్తి చేసుకుంది. హీరోగా మంచి ఇమేజ్ తీసుకొచ్చిన 'గూఢచారి 116' చిత్రం తర్వాత కృష్ణ చేసిన చిత్రమిది. క్రైమ్ నేపథ్యంలో రూపొందిన చిత్రమైనప్పటికీ కథలోని కొత్తదనం, పాత్రలో కృష్ణ పరకాయ ప్రవేశం చేసి నటించిన అద్భుత నటన సినిమాకు ఘనవిజయాన్ని అందించాయి. అడ్వంచర్ సినిమాల్లో ఓ కొత్త ఒరవడిని తీసుకొచ్చిన చిత్రమిదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ఒక బ్యాలేని రూపొందించారు దర్శకుడు రామచంద్రరావు. ఇందులో కృష్ణ తొలిసారి అల్లూరి సీతారామరాజుగా నటించి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఈ పాత్ర పోషించాలన్న కోరిక కృష్ణకు అంతకుముందే ఉందట. ఈ చిత్రంలోని బ్యాలేతో అది మరింత బలపడింది. చరిత్ర సృష్టించిన 'అల్లూరి సీతారామరాజు' చిత్ర రూపకల్పనకు 'అసాధ్యుడు' చిత్రంలోని బ్యాలే నాంది పలికిందట. సంక్రాంతి సందర్భంగా విడుదలైన కృష్ణ నటించిన తొలి చిత్రమిది. సినిమా ఘనవిజయం సాధించడంతో కృష్ణకు సంక్రాంతి సెంటిమెంట్ మొదలైంది. ప్రముఖ ఛాయాగ్రాహకుడు వి.ఎస్.ఆర్.స్వామి ఈ చిత్రం ద్వారానే చిత్ర పరిశ్రమకు పరిచయం కావడం విశేషం.

### అల్లూరి సీతారామరాజు చిత్రానికి నాంది: కృష్ణ

'అసాధ్యుడు' చిత్రం విడుదలై 50 సంవత్సరాలు పూర్తయినందుకు చాలా హ్యాపీగా ఉంది. మొట్టమొదట సంక్రాంతికి విడుదలైన నా చిత్రమిదే. ఇందులో 15 నిమిషాలు ఉండే బ్యాలేలో అల్లూరి సీతారామరాజుగా యాక్ట్ చేశాను. అప్పట్నుంచి అల్లూరి సీతారామరాజుపై పూర్తి స్థాయి సినిమా తీయాలని మనసులో ఓ కోరిక బలపడింది. ఈ బ్యాలేని దర్శకుడు రామచంద్రరావు చాలా బాగా పిక్చరైజ్ చేశారు. ఆ తర్వాత 'అల్లూరి సీతారామరాజు' చిత్రానికి కూడా ఆయన దర్శకత్వంలోనే ప్రారంభించాం. అది ఎంతటి సంచనాలు సృష్టించిందో అందరికీ తెలిసిందే' అని కృష్ణ తెలిపారు.


వరప్రసాద్, పూజ రామచంద్రన్, వి.వి.వినాయక్ తదితరులు

## ఆద్యంతం ఉత్కంఠభరితం..

నందు, సౌమ్య వేణుగోపాల్ జంటగా పూజ రామచంద్రన్ కీలక పాత్రధారిణిగా వరప్రసాద్ వరికూటి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. హరిహర చలన చిత్ర పతాకంపై ఎస్.శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ దర్శకుడు వి.వి.వినాయక్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నేను సాయిధరమ్‌తేజ్ 'ఇంటలిజెంట్' క్లైమాక్స్ షూట్‌లో బిజీగా ఉన్నప్పటికీ ట్రైలర్‌ను లాంచ్ చేయటానికి కారణం చిత్ర దర్శకుడు వరప్రసాద్ నా శిష్యుడు కావడం. ఈ సినిమా టాక్ కూడా బాగుందని విన్నా. ఇప్పుడు థియేట్రికల్ ట్రైలర్ చూశా. చాలా బాగుంది. వర ప్రసాద్‌కి మంచి హిట్ వచ్చి పెద్ద హీరోలతో తీసేంత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని అన్నారు. 'మా చిత్ర ట్రైలర్‌ను వినాయక్‌గారు విడుదల చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఉత్కంఠభరితమైన కథనంతో విభిన్నంగా సినిమా ఉంటుంది. ఫిబ్రవరిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.

## అనుమానస్పద మరణం నేపథ్యంలో..


లాల్ బహదూర్ శాస్త్రి

బాలీవుడ్‌లో బయోపిక్‌ల జోరు కొనసాగుతూనే ఉంది. స్ఫూర్తివంతమైన రాజకీయ మహామహులు, క్రీడాకారులు, ప్రముఖుల జీవితాలపై సినిమాలను తెరకెక్కిస్తున్నారు. తాజాగా భారత రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జీవితాన్ని తెరపై ఆవిష్కరించేందుకు బాలీవుడ్‌లో ప్లాన్ జరుగుతోంది. శాస్త్రి జీవితాన్ని తెరరూపం ఇచ్చేందుకు దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి సన్నాహాలు చేస్తున్నారు. శాస్త్రి మరణం వెనకాల ఉన్న మిస్టరీ ప్రధానంగా ఆయనకు సంబంధించిన రెండు కోణాల్లో సినిమాను రూపొందించబోతున్నారు. ఇందులో ప్రధాన పాత్రలకుగానూ నసీరుద్దీన్ షా, మిధున్ చక్రవర్తిలను ఎంపిక చేశారట. లాల్ బహదూర్ శాస్త్రి పాత్రలో నజీరుద్దీన్ షా నటించే అవకాశం ఉంది. లాల్ బహదూర్ శాస్త్రి 1964 నుంచి 66 వరకు ప్రధానిగా సేవలందించారు. పదవిలో ఉన్నప్పుడే ఉజ్బెకిస్థాన్‌లో అనుమానస్పద స్థితిలో కన్నుమూశారు. దీంతో ఆయన మరణం మిస్టరీగా మారింది.

## టాలీవుడ్ ఎంట్రీకి సరైన


నటాషా దోషి

'బాలకృష్ణ చాలా ఎనర్జిటిక్. ఆయనతో కలిసి నటించే అవకాశం రావడం గర్వంగా ఫీలవుతున్నా' అని అంటోంది హీరోయిన్ నటాషా దోషి. బాలకృష్ణ, నయనతార, హరిప్రియ, నటాషా దోషి హీరోహీరోయిన్లుగా కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'జై సింహా'. నేడు(శుక్రవారం) ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం నటాషా దోషి మీడియాతో మాట్లాడుతూ, 'ముంబయిలో పుట్టి పెరిగాను. చిన్నప్పట్నుంచి సినిమాలంటే ప్యాషన్. బాలనటిగా పలు సీరియల్స్‌లో నటించాను. 2010 మిస్ కేరళగా ఎంపికయ్యాను. 2012లో మలయాళ చిత్రం 'మంత్రికన్' చిత్రం ద్వారా కథానాయికగా పరిచయమయ్యాను. ఆ తర్వాత 'హైడ్ ఎన్ సీక్' చేశా. తెలుగులో 'జై సింహా' తొలి చిత్రం. హీరోయిన్‌గా తెలుగులో ఎంట్రీకిది సరైన సినిమాగా భావించాను. బాలకృష్ణ వంటి గొప్ప హీరోతో, కె.ఎస్.రవికుమార్ వంటి పెద్ద డైరెక్టర్ రూపొందిస్తున్న ఇంత పెద్ద సినిమాలో నటించే ఛాన్స్ రావడం హ్యాపీగా ఉంది. నిజం చెప్పాలంటే గర్వంగానూ భావిస్తున్నా. ఇందులో నేను ధనియా అనే సంపన్న కుటుంబానికి చెందిన అమ్మాయిగా కనిపిస్తాను. యువరాణిలా పెరుగుతాను. అమెరికా నుంచి ఇండియాకు వస్తా. ఇక్కడ హీరోకు, నాకున్న సంబంధమేంటి? ఆ తర్వాత ఏం జరిగిందనేది సినిమా. 'అమ్మ కుట్టి.. ' అనే పాటకు బాలకృష్ణతో కలిసి స్టెప్పులేశాను. ఆయనతో నటించడం గొప్ప అనుభూతినిచ్చింది. బేసిక్‌గా నేను భారతనాట్యం, డాన్స్ నేర్చుకున్నా. దీంతో స్టెప్పులేయడం ఈజీ అయ్యింది. లేడీ సూపర్ స్టార్ నయనతార నాకు స్ఫూర్తి. ఈ చిత్రంలో ఆమెతో కలిసి నటించడం ఆనందంగా ఉంది' అని చెప్పింది.


విద్యాబాలన్

## గోపీచంద్ పంతం..!

కథానాయకుడు గోపీచంద్ మరోమారు 'సున్నా' సెంటిమెంట్‌నే నమ్ముకున్నారట. గతంలో ఆయన ఇదే సెంటిమెంట్‌తో చేసిన 'యజ్ఞం', 'శౌర్యం', 'శంఖం', 'సౌఖ్యం', 'లక్ష్యం' చాలా వరకు విజయం సాధించాయి. గోపీచంద్ ప్రస్తుతం నూతన దర్శకుడు చక్రి డైరెక్షన్‌లో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'పంతం' అనే టైటిల్‌ను చిత్ర బృందం పరిశీలిస్తోందట. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో గోపీచంద్ పాత్ర చిత్రణ చాలా శక్తివంతంగా ఉంటుందట. ఇందులో గోపీచంద్ సరసన మెహరీన్ కథానాయిక.

## ఈ స్థాయికి నాన్నే కారణం..


నిఖిలా విమల్

'నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం మా నాన్న' అని అంటోంది నిఖిలా విమల్. ఆమె కూతురుగా నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. ఆమెకు తండ్రిగా మోహన్‌బాబు నటిస్తుండగా, మదన్ రామిగాని దర్శకత్వం వహిస్తున్నారు. మంచు విష్ణు, శ్రియా జంటగా నటిస్తున్నారు. లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి నిఖిలా విమల్ పాత్ర ఫస్ట్‌లుక్ గురువారం విడుదలయ్యింది. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'ఇప్పటికే విడుదలైన మంచు విష్ణు, శ్రియా జోడీ పోస్టర్, శ్రియా ఫస్ట్ లుక్, మోహన్‌బాబు ఫస్ట్‌లుక్ సినిమాపై అంచనాలను పెంచాయి. ఆయా పోస్టర్లు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. తాజాగా విడుదల చేసిన నిఖిలా విమల్ ఫస్ట్ లుక్‌లో ఆమె చెప్పే డైలాగ్ సైతం ఆకట్టుకుంటోంది. ఇందులో విష్ణు, శ్రియా ఆదర్శ దంపతులుగా నటిస్తున్నారు. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు' అని తెలిపింది. అనసూయ, బ్రహ్మానందం ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సంగీతం: ఎస్.ఎస్.థమన్, కెమెరా: సర్వేష్ మరారి, ఆర్ట్: చిన్న, ఎడిటర్: ఎంఆర్ వర్మ.

## శీనుగాడి ప్రేమ సిన్సియర్..


కావేరి, శ్రీనివాసరావు

శ్రీనువాసరావు, ప్రణవి, కావేరి, చాందిని హీరోహీరోయిన్లుగా ఆర్.కె.డి దర్శకత్వంలో సుష్మా ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై ధరిమిశెట్టి సత్యేశ్వరి నిర్మిస్తున్న చిత్రం 'శీనుగాడి ప్రేమ'. 'సిన్సియర్ రా మామా' అనేది ట్యాగ్‌లైన్. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత ధరిమిశెట్టి సత్యేశ్వరి మాట్లాడుతూ, 'సంగీత దర్శకులు రమణ కథకు అనుగుణంగా చక్కగా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. ఈ చిత్రం అనుకున్న దాని కంటే బాగా వచ్చింది. లవ్, సెంటిమెంట్, యాక్షన్ కామెడీ మేళవింపుతో తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. పోస్ట్ ప్రొడక్షన్‌లో భాగంగా రీ-రికార్డింగ్‌ను పూర్తి చేసుకుంది. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని అన్నారు. రాంపల్లి వెంకట రమణ, బీబీ బేగమ్, సునీత, రంజిత్, బుల్లెట్ సుధాకర్, గోల్డ్‌రెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీష్, సంగీతం: రమణ.

## ఇందిరాగాంధీ..

'ఇందిరా గాంధీ పాత్రలో నటించాలనే నా కల నెరవేరబోతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది' అని అంటోంది విద్యా బాలన్. వైవిధ్యమైన పాత్రలు, భిన్న ప్రయోగాల సినిమాలు, మహిళా ఇతివృత్త చిత్రాలకు విద్యా కేరాఫ్‌గా నిలిచిన విషయం విదితమే. తాజాగా ఆమె ఇందిరాగాంధీగా ప్రేక్షకులకు కనిపించబోతోంది. భారతీయ మొదటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఓ సినిమాను బాలీవుడ్‌లో తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రైటర్ సాగరిక ఘోష్ రాసిన 'ఇందిరా: ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ప్రైమ్ మినిస్టర్' అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. 'ఇందిరా గాంధీ పాత్రలో నటించేందుకే ఇందిరాపై సాగరిక ఘోష్ రాసిన పుస్తక హక్కులను దక్కించుకున్నాం. అయితే దీన్ని వెబ్ సిరీస్‌గా తీయాలా లేదా సినిమాగా తీయాలన్నది ఇంకా నిర్ణయించలేదు' అని విద్యాబాలన్ తెలిపింది. 'నా పుస్తక హక్కులను విద్యాబాలన్, రాయ్ కపూర్ ప్రొడక్షన్స్ వాళ్ళు దక్కించుకున్నారు. ఇందిరాగా విద్యాను తెరపై చూసేందుకు ఎగ్జైటింగ్‌గా ఎదురు చూస్తున్నాను' సాగరిక ఘోష్ చెప్పారు.


శ్రద్ధా కపూర్

## నేనూ భయపెడతా..

గతేడాది 'ఓకే జాను', 'హసీనా పార్కర్', 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్' వంటి మూడు చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన శ్రద్ధాకపూర్ తాజాగా ఓ హర్రర్ కామెడీ చిత్రంలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జాతీయ అవార్డు నటుడు రాజ్ కుమార్‌రావ్‌తో కలిసి శ్రద్ధా నటిస్తున్న నూతన చిత్రం 'స్త్రీ'. హిలేరియస్ హర్రర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ గురువారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని క్లాప్‌బోర్డ్‌తోపాటు రాజ్‌కుమార్ రావ్‌తో దిగిన ఓ ఫొటోను ట్విట్టర్ ద్వారా శ్రద్ధా అభిమానులతో పంచుకుంది. ఈ చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తుండగా, మడాక్స్ ఫిల్మ్స్ పతాకంపై డినేష్ విజన్ నిర్మిస్తున్నారు. మిస్టరీ నేపథ్యంలో శ్రద్ధా పాత్ర చుట్టూ ఈ సినిమా తిరుగుతుందని సమాచారం. ఫస్ట్‌టైమ్ శ్రద్ధా, రాజ్ కుమార్ రావ్‌ల జోడీ తెరపై మెరవనుంది. శ్రద్ధా ప్రస్తుతం తెలుగులో ప్రభాస్ సరసన 'సాహో' చిత్రంలో నటిస్తోంది. సుజిత్ దర్శకుడు. అలాగే హిందీలో షాహిద్ కపూర్‌తో కలిసి ఓ సినిమా చేయనుంది.

## ప్రయోగాత్మకంగా భరత్..!


సల్మాన్‌ఖాన్

సల్మాన్ ఖాన్ ఇటీవల 'టైగర్ జిందా హై'తో అదిరిపోయే విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా ఇప్పటికే 500 కోట్ల క్లబ్‌లోకి చేరింది. గతేడాది చివరలో విడుదలై అఖండ విజయం సాధించి బాలీవుడ్‌కి ఊరటనివ్వడంతోపాటు 2017లో అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కత్రినా కైఫ్ కథానాయిక నటించింది. సల్మాన్, అలీ అబ్బాస్ జాఫర్ కాంబినేషన్‌లో వచ్చిన 'సుల్తాన్' సైతం భారీ విజయాన్ని సాధించింది. తాజాగా ఈ కాంబినేషన్ మూడోసారి కలిసి సినిమా చేయబోతున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు దీనికి 'భరత్' అనే టైటిల్ కూడా నిర్ణయించారట. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఈ సినిమాను ప్రారంభించడానికి ప్లాన్ చేస్తున్నారని టాక్. 2014లో విడుదలైన కొరియన్ సినిమా 'ఓడే టు మై ఫాదర్' ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారట. సల్మాన్ తన ఇమేజ్‌ను పూర్తిగా పక్కన పెట్టి ఈ ప్రయోగాత్మక చిత్రంలో నటించేందుకు సిద్ధమయ్యారట. సల్మాన్ మార్క్ యాక్షన్, కామెడీతో రూపొందనున్న ఈ సినిమాలో ఆయన ఓ విభిన్న తరహా పాత్రలో కనిపించబోతున్నారని చిత్ర బృందం చెబుతోంది. ప్రస్తుతం సల్మాన్ 'రేస్ 3'లో నటిస్తున్నారు. రెమో డి సౌజా దర్శకత్వం వహిస్తుండగా, సల్మాన్ సరసన జాక్వెలిన్ ఫెర్నాండేజ్ కథానాయికగా నటిస్తోంది. ఈచిత్ర షూటింగ్ గుడ్‌గావ్ ఫిల్మ్ సిటీలో జరుగుతుంది. ఈ సందర్భంగా కొందరు దుండగులు సెట్స్‌లోకి చొరబడి సల్మాన్‌పై దాడి చేసేందుకు యత్నించారట. ఇది గమనించిన చిత్ర బృందం పోలీసులకు సమాచారం అందించగా సెట్ నుంచి సల్మాన్‌ను సురక్షితంగా ఇంటికి తరలించారు. కృష్ణజింక కేసులో గత వారం సల్మాన్ జోధ్‌పూర్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా లారెన్స్ బిష్ణోయ్ అనే గ్యాంగ్‌స్టర్ సల్మాన్‌ను బెదిరించారు. ఈ నేపథ్యంలో జరిగిన తాజా ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది.

## తోకముడిచిన టీఆర్‌ఎస్ నేతలు : రేవంత్‌రెడ్డి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

విద్యుత్‌పై చర్చ జరిగితే తమ ప్రభుత్వ బండారం బయటపడుతుందనే ఉద్దేశంతో టీఆర్‌ఎస్ నాయకులు మాట మార్చారని కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి విమర్శించారు. విద్యుత్ సరఫరా, ప్రాజెక్టులపై తాను అవాస్తవాలు మాట్లాడుతున్నానని ఆరోపిస్తూ ...బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరిన టీఆర్‌ఎస్ నాయకులు...అందుకు మేము కూడా చర్చకు సిద్ధమని చెప్పడంతో వారు తోకముడిచి పారిపోయారని చెప్పారు. గురువారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి, కొత్త ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ కొనుగోళ్లలో జరుగుతున్న అవినీతిని ఎత్తిచూపడంతో టీఆర్‌ఎస్ నేతలు బాల్క సుమన్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, భాను ప్రకాష్ తనపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తూ తాముచెబుతున్నది తప్పని తేలితే మేము ముక్కును నేలకు రాస్తామని..రేవంత్ రెడ్డి చెబుతున్నది తప్పని తేలితే ఆయన అబిడ్స్ సెంటర్‌లో ముక్కు నేలకు రాయాలని కోరినట్టు చెప్పారు. రేవంత్ రెడ్డితో చర్చించేది లేదని ఇవాళ మాట మార్చేశారని రేవంత్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి ప్రపంచంలోనే ఎక్కడా లేదని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు.

## ఇద్దరు రైతుల ఆత్మహత్య

**నవతెలంగాణ-జగదేవపూర్/మద్దూరు**

అప్పుల బాధతో ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం పీటీ వెంకటాపూర్‌లో ఒకరు, మద్దూరు మండలం సలాక్‌పూర్‌లో మరొకరు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... జగదేవపూర్ మండలం రాయవరం మదిర గ్రామమైన పీటీ వెంకటాపూర్‌కు చెందిన దాకూరి బాలయ్య(45)కు మూడెకరాల భూమి ఉంది. మూడేండ్లుగా పత్తి, మొక్కజొన్న, వరి సాగు చేస్తున్నాడు. మూడేండ్లు సరైన దిగుబడి రాలేదు. పంటసాగు, కుటుంబ పోషణకు రూ.5 లక్షలకు పైగా అప్పు చేశాడు. రోజూ అప్పు గురించి ఇంట్లో వారితో చర్చించి బాధపడేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గురువారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్న బాలయ్యను కుటుంబ సభ్యులు గమనించి గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో, గాంధీకి తరలించాల్సిందిగా వైద్యులు సూచించారు. హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మద్దూరు మండలంలోని సలాక్‌పూర్ గ్రామానికి చెందిన ఏడాకుల రాంచంద్రం(58)కు మూడెకరాల భూమి ఉంది. మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేయగా నష్టాలొచ్చాయి. గతేడాది కుమార్తె వివాహం చేసేందుకు కూడా కొంత అప్పు చేశాడు. మొత్తం రూ.10 లక్షలకుపైగా అప్పు ఉంది. అప్పులవారి ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో గురువారం ఇంటి వద్దే పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చేర్యాలలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చనిపోయాడు. అతనికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

## మొసలికి 'టైరు' కష్టం

**జకార్త** : ఇండోనేషియాలోని సులావెసి దీవికల్లంలో ఓ మొసలి రెండేండ్లుగా నరకయాతన అనుభవిస్తోంది. మొసలిని అపహరించాలని కొందరు గుర్తు తెలియని వేటగాళ్లు కుట్రపన్నినట్టు తెలుస్తోంది. అపహరించాలనే దురుద్దేశంతో మొసలి మెడకు ఓ టైరును బిగించారు. మొసలి మెడకున్న టైర్‌ను తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే, మొసలి మెడకు టైర్ బలంగా బిగిసుకుపోవడంతో ఈ సరీసృపం ఇబ్బందిపడుతున్నది. ఇండోనేషియా వన్యప్రాణుల సంరక్షణ విభాగం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సులావెసి ఐలాండ్‌లో 13అడుగుల పొడవున్న మొసలి మెడను గుర్తుతెలియని వేటగాళ్లు టైర్ బిగించడంతో ఇబ్బందిపడుతున్నది. పాలూ బ్రిడ్జి కింద ఉన్న బ్యాక్ వాటర్‌లో ఇబ్బందికరంగా ఈదుతూ కనిపిస్తున్న ఈ మొసలిని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వస్తున్నారు. అయితే, దయనీయస్థితిలో ఉన్న ఈ మొసలిని రక్షించేందుకు హరూనా అనే ఓ సంస్థ కూడా ముందుకొచ్చింది. నీటి మట్టం తగ్గాగానే మొసలిని రక్షించనున్నట్టు ప్రకటించింది.

# విషాహారం

**మొదటిపేజీ తరువాయి**

ఉంటాయి. ప్రొప్రయిటరీ ఫుడ్స్, యాడింగ్స్ మాత్రం ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారం ఉండాలి. ఈ రెండింటి విషయంలోనే కేంద్రం నిబంధనలు మార్చివేసింది. 2016, జనవరిలో కార్పొరేట్ వర్గాల ఒత్తిడికి తలొగ్గి... మోడీ సర్కార్ కొత్త నిబంధనల్ని, ప్రమాణాల్ని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, శాస్త్రీయ పద్ధతిలో 'ప్రొప్రైటరీ ఫుడ్'కు నాణ్యతా పరీక్షలు జరపకుండానే అనుమతులు దక్కుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిబంధనల్ని రూపొందించటం వల్ల సురక్షితం కాని ఆహార ఉత్పత్తులు (నావల్ ఫుడ్స్, యాడింగ్స్) మార్కెట్లను ముంచెత్తుతున్నాయని 'కాగ్' 2017 నివేదిక పూర్తిగా నిర్ధారణకు వచ్చింది.

**సరైన పరీక్షలు జరపకుండానే 'ఎన్‌ఓసీ'**

ప్యాకింగ్ చేసి అమ్మే అన్ని రకాల ఆహార ఉత్పత్తులకు అనుమతి తప్పక ఉండాల్సిందే. అయితే...చట్టానికి దొరకకుండా కొన్ని కొత్త నిబంధనల్ని రూపొందించి, డైట్ సప్లిమెంట్స్, ఎనర్జీ డ్రింక్స్, ఉప్పు బిస్కెట్లు, నూడుల్స్, సూపులు, పాస్తా...మొదలైన ఆహార పదార్థాల అమ్మకానికి అనుమతి ఇస్తున్నారు. 'ఎఫ్ఎస్-ఎస్ఏఐ' శాస్త్రవేత్తలు క్లినికల్ పరీక్షలు జరపకుండానే ఆహార పదార్థాలకు నో ఆబ్జెక్షన్



సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)దక్కుతోంది.

2015, మేలో వెయ్యి ఆహార ఉత్పత్తులకుగానూ కేవలం 200 ఉత్పత్తులకు మాత్రమే నాణ్యతా పరీక్షలు జరిగాయని 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' చీఫ్ స్వయంగా తెలియజేశాడు. ఇవి ఎంతమాత్రమూ సురక్షితం కాదని 'ఎఫ్ఎస్-ఎస్ఏఐ' శాస్త్రవేత్తలు తేల్చినాక కూడా...నాలుగు ఆహార ఉత్పత్తులు 47 నెలలపాటు మార్కెట్లో అమ్ముడయ్యాయి. మరికొన్ని కేసుల్లో సర్టిఫికెట్‌ను వెంటనే రద్దు చేయకపోవటమూ కారణమని తేలింది. శాస్త్రవేత్తలు పరీక్షలు జరపకుండానే 'ఒక ఏడాది కాల వ్యవధి'తో కూడిన 'నో ఆబ్జెక్షన్' సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయి. ప్రాసెసింగ్ ఫుడ్ భద్రత, నాణ్యతకు సంబంధించి పరీక్షలు పక్కకు పోయాయి. 'ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006' ఏ మాత్రమూ అమలు కావటం లేదు.

- 'పుష్పం ఫుడ్స్, బేవరేజెస్' అనే కంపెనీ తయారుచేసిన ఎనర్జీ డ్రింక్ పేరు 'రెస్ట్‌లెస్ జిన్సెంగ్'. దీనిని తాగితే గుండె వేగంగా కొట్టుకోవటం, బీపీ పెరగటం లాంటి దుష్ఫలితాలు ఉన్నాయని ప్రపంచంలోని అనేక దేశాలు ఈ ఎనర్జీ డ్రింక్‌ను నిషేధించాయి. ఈ విషయం 'ఎఫ్ఎస్-ఎస్ఏఐ'కు తెలిసాక కూడా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రధాని కార్యాలయం ఒత్తిడి వల్లే ఇలాంటివాటికి అనుమతి దక్కింది. ఆ కంపెనీ ఎనర్జీ డ్రింక్‌ను 2017 వరకూ ఆన్‌లైన్‌లో అమ్ముకున్నది. కేవలం సర్టిఫికెట్ రద్దు చేయటంతో 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' చేతులు దులుపుకుందని, మార్కెట్లో దీనిని అమ్ముతున్నారా ? లేదా ?అనే పరిశీలన చేయలేదని 'కాగ్' తాజా నివేదిక తప్పుబట్టింది.
- 'సూర్యా హెర్బల్' అనే కంపెనీ 'సునోవా స్పిరులీనా' అనే బలాన్నిచ్చే ట్యాబ్లెట్ల పేరుతో అమ్ముతోంది. క్లినికల్ పరీక్షల్లో దీనిని శాస్త్రవేత్తలు తిరస్కరించారు. ఆగస్టు, 2014లో నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ రద్దయింది. అయినా కూడా ఆ కంపెనీ ఇంకా ఆ ట్యాబ్లెట్లను అమ్ముతోంది.
- చట్టాన్ని పక్కకు పెట్టి, కొత్త 'గైడ్‌లైన్స్' ప్రకారం ఆహార ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం వల్లే, రెస్ట్‌లెస్ జిన్సెంగ్'లాంటి ఆహార ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తున్నాయని తెలిపింది. నాణ్యతా పరీక్షలు కూడా పూర్తిస్థాయిలో జరగటం లేదన్న విషయం బయటపడింది. అది సురక్షితమైన ఆహారమేనా ? అన్నది పరీక్షల ద్వారా నిర్ధారించుకోకుండానే 800 రకాల ఆహార ఉత్పత్తులకు అనుమతి దక్కింది. ఇందులోనివి అనేకం ఇప్పటికీ ఇంకా మార్కెట్లో అమ్ముడవుతున్నాయి.

## తరలిస్తున్న 210 సబ్సిడీ గొర్రెల పట్టివేత

- **16మందిపై కేసు... రెండు లారీలు సీజ్**

**నవతెలంగాణ-నెల్లికుదురు**

రెండు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 210 సబ్సిడీ గొర్రెలను పట్టుకొని 16మందిపై కేసు నమోదు చేసినట్టు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కొటిరెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నేరడ గ్రామానికి చెందిన ముక్కెర లింగయ్య సబ్సిడీ గొర్రెలు పొందిన లబ్దిదారులు గంట కొమురయ్య(19గొర్లు), కోడి నర్సయ్య(19గొర్లు), సుంకర బోయిన యాకయ్య(19గొర్లు), గండ్ర కోట యాకయ్య (22గొర్లు), నారబోయిన రామచంద్రు (17గొర్లు), కోడి వేంకటేశ్ (17గొర్లు), కోడి వీరయ్య (20గొర్లు), పోతురాజు వెంకన్న(30గొర్లు), గుండు గుట్టయ్య (30గొర్లు), చెవుల కుమార్(18గొర్లు), ఉగ్గం ఐలయ్య(18గొర్లు) వద్ద కొనుగోలు చేశాడు.

ఆ గొర్రెలను కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు తరలిస్తుండగా నెల్లికుదురు మండలం బంజర వద్ద పోలీసులు పట్టుకున్నారు. రెండు లారీల్లో మొత్తం 210 గొర్లను తరలిస్తున్నారు. ఈ గొర్రెలను కృష్ణాజిల్లాకు చెందిన గుండెబోయిన రామదాసు, ముప్పుస్వామికు విక్రయించారు. ఈ గొర్రెల విలువ రూ.11లక్షల పదివేలు ఉంటుందని తెలిపారు. రాయితీ గొర్రెల యజమానులు 11మంది, ఇద్దరు డ్రైవర్లు, ముగ్గురు ఏజెంట్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రాజరత్నం, సీఐ చేరాలు, ఎస్ఐ గోదరిరాజుకుమార్, నెల్లికుదురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నాణేల ముద్రణ నిలిపివేతపై ఉద్యోగుల ఆందోళన

**మొదటిపేజీ తరువాయి**

ముద్రణ నిలిచిపోయిందని, దీని వల్ల దేశ ప్రజానీకంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ఓ వైపు నాణేలు దొరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నోట్ల రద్దు వల్ల పాతనోట్లన్నీ రిజర్వ్ బ్యాంకుకు చేరాయని, అందుకే ప్రస్తుతం ముద్రించే నాణేలను తీసుకోలేమని చెబుతున్నారని అన్నారు. మిగతా మింట్ కేంద్రాలతో పోల్చితే హైదరాబాద్‌లో ముద్రించిన నాణేలన్నింటినీ ఆర్‌బీఐ తీసుకుంటుందని, ఇంకా నాణేలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా నాణేలను సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం ముద్రణ నిలిపేసిందని, మింట్‌లో పని చేస్తున్న వేలాది మంది ఉద్యోగాలను తొలగించే విధంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని, నాణేల ముద్రణకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు హరిశంకర్, సత్తిబాబు, నూక పరమేష్, నరేందర్, వెంకటేశ్, పెంటయ్య, సదానంద్, ఎన్.సుదర్శన్, రంగనాథ్, రమేష్‌తో పాటు వందలాది మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

**మింట్ ఆందోళనకు సీఐటీయు మద్దతు**

నాణేల ముద్రణను పూర్తిగా నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని, పునరాలోచన చేసి ముద్రణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయు సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్, ఈశ్వర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నాణేలపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. నాణేల ముద్రణ కొనసాగించాలని మింట్ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

# సాగర్ ఎడమ కాల్వకు గండి

- మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్వుతుండగా...
- పరిశీలించిన కలెక్టర్
- గంటకు వెయ్యి క్యూసెక్కుల నీటి ప్రవాహం
- పూర్తిస్థాయిలో నీటి ప్రవాహం తగ్గితేనే మరమ్మతుకు అవకాశం



**నవతెలంగాణ-మునగాల**

సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాల్వకు 145వ కిలోమీటరు వద్ద గురువారం గండిపడింది. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పైప్‌లైన్‌ల కోసం ప్రొక్లెయిన్‌లతో కాల్వ తీస్తుండగా కాల్వకు బుంగపడినట్టు కాల్వపరిధిలోని రైతులు తెలిపారు. వరద నీళ్లు నాట్లు వేసిన పొలాల మీదుగా ప్రవహిస్తోంది. సాగర్ ఎడమ కాల్వలో 6వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. కాల్వ నిండుగా ప్రవహిస్తుండడంతో వెంటనే బుంగను పూడ్చాలని కలెక్టర్ సురేంద్రమోహన్ ఎన్నెస్పీ అధికా రులను ఆదేశించారు. కాల్వ పూర్తిస్థాయిలో నీటి మట్టం తగ్గిన అనంతరమే బుంగను పూడ్చడం సాధ్యపడు తుందని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు. గంటకు వెయ్యి వెయ్యి క్యూసెక్కుల వంతున కాల్వ నీటిని తగ్గించాలని ఎన్నెస్పీ అధికారులు సాగర్ డ్యామ్ అధికారులను ఆదేశించారు. కాల్వ నీళ్లు పూర్తిస్థాయిలో తగ్గిన తర్వాత శుక్రవారం మరమ్మతులు చేపట్టే అవకాశం ఉంది. ఎన్నెస్పీ అధికారులు బుంగను పూడ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మరమ్మతులు పూర్తి అయిన అనంతరం ఒకటి రెండ్రోజుల్లో తిరిగి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

**కలెక్టర్ పరిశీలన**

సాగర్ ఎడమ కాల్వకు బుంగ పడిన విషయం తెలియగానే కలెక్టర్ సురేంద్రమోహన్ అక్కడికెళ్లి పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే మరమ్మతులు చేసి, కాల్వకు నీటిని విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద తాకిడికి నాటువేసిన పంట పొలాలకు ఏ మాత్రం నష్టం జరిగిందని రైతులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ భిక్షునాయక్, నాగేశ్వరరావు, ఎన్నెస్పీ డీఈ, ఏఈలు ఉన్నారు.

# డంపింగ్‌యార్డ్‌తో గర్భస్రావాలు

**మొదటిపేజీ తరువాయి**

పరిధిలోని శాంతినగర్‌లో నివసిస్తున్న అనిత-రాజు దంపతుల (పేర్లు మార్చాం) ఒక్కరికే ఎదురైన సమస్య కాదు.. జవహర్‌నగర్‌తో పాటు సమీప గ్రామాల్లోని ప్రజలందరి సమస్య. మహిళలకు గర్భస్రావ, సంతానలేమి సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ క్రమంలో జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు వల్ల స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'నవతెలంగాణ' సామాజిక సర్వే నిర్వహించింది. ఇందులో ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ నగరానికి 30కిలోమీటర్ల దూరంలో మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహర్‌నగర్ గ్రామ పంచాయతీ ఉంది. మహానగరంలో ఉత్పత్తవుతున్న చెత్తను వేయడానికి జవహర్‌నగర్‌లో 339ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. 17ఏండ్ల నుంచి ఇప్పటి వరకు 15మిలియన్ టన్నులకుపైగా చెత్త పేరుకుంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 4500 మెట్రిక్ టన్నుల చెత్తను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) తరలిస్తోంది. డంపింగ్‌యార్డును అక్కడున్న గుట్టలపైనే ఏర్పాటు చేయడంతో చెత్త మొత్తం కొండలను తలపిస్తోంది. కాలుష్యం వల్ల పరిసర ప్రాంతాల్లోని నేల, నీరు, గాలి మొత్తం విషపూరితంగా మారాయి. పేరుకపోయిన చెత్త నుంచి ఇప్పటికే 68కోట్ల లీటర్ల కలుషిత నీరు (లీచెట్) ఉత్పత్తయింది. ప్రతిరోజూ 50వేల లీటర్ల వరకు కలుషిత నీరు వస్తోంది. ఇందులో భయంకరమైన విషవాయువులు, రసాయనాలైన అమోనియం సల్ఫైడ్, అమోనియా ఫాలీ సల్ఫైడ్, అమోనియా, కార్బన్ డై ఆక్సైడ్, హైడ్రోజన్ సల్ఫైడ్, మెర్ కాప్టిన్స్‌లున్నాయి. వీటి ప్రభావంతో స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ కాలుష్య జలాలు వర్షపునీటిలో కలిసి సమీపంలోని హరిదాసుపల్లి, చీర్యాల తదితర గ్రామాల్లోని 14 గొలుసుకట్టు చెరువులు, కుంటలు విషతుల్యంతో నిండిపోయాయి. భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. 17కు పైగా గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సమస్యలు, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా జీహెచ్ఎంసీ పట్టించుకోవడంలేదు. లీచెట్‌ను ట్రీట్‌మెంట్ చేయడానికి ప్లాంట్ ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నారు. నిధుల దుర్వినియోగం తప్ప ఎలాంటి ట్రీట్‌మెంట్ కావడం లేదని, ఫలితం లేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**మహిళలకు గర్భస్రావ సమస్యలు**

జవహర్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో సుమారు 400లకు పైగా కుటుంబాలుండగా, గబ్బిలాల్‌పేట, గిరిప్రసాద్‌నగర్, బాలాజీనగర్‌లలో 800 కుటుంబాల వరకున్నాయి. డంపింగ్‌యార్డ్ ప్రభావంతో పీల్చే గాలి, తాగే నీరు కలుషితమవ్వడంతో మహిళలకు గర్భస్రావ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో గర్భిణీలు ఆ ప్రాంతంలో ఉండటానికి భయపడుతున్నారు.

జవహర్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోనే గతేడాది 8 మందికిపైగా గర్భస్రావాలయ్యాయి. చేర్యాల, హరిదాసుపల్లిలోనూ ఈ ఘటనలున్నాయి. శాంతినగర్‌లో ప్రస్తుతం 18 మంది గర్భవతులుండగా, కాలుష్యం భయంతో పుట్టింటికి వెళ్లిపోయారు. శాంతినగర్, గబ్బిలాల్‌పేట, గిరిప్రసాద్‌నగర్, బాలాజీనగర్‌లో సుమారు 180 కుటుంబాలు సంతానలేమి సమస్యలతో బాధపడుతున్నాయి. మిగతా డంపింగ్‌యార్డు ప్రభావిత గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.

**కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి**
**ఐద్వా జిల్లా కార్యదర్శి : ఎం.వినోద**

డంపింగ్‌యార్డు వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు గర్భస్రావ సమస్యలను ఎదుర్కొంటున్నారు. కాలుష్య సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. కాలుష్య తీవ్రతతో గర్భస్రావం, సంతానలేమి సమస్యలను ఎదుర్కొంటున్న మహిళలకు వైద్య సహాయం అందించాలి. డంపింగ్‌యార్డు ఎత్తేయాలి.

## మంత్రాల నెపంతో దాడి

- **16మందిపై కేసు**

**నవతెలంగాణ-మంగపేట**

మంత్రాలు చేశారనే నెపంతో నలుగురిపై దాడి చేసిన 16 మందిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన ప్రొఫెసర్ జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెంలో జరిగింది. ఎస్ఐ ఎ.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలన్నగూడెంకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు యాలం పోతురాజు కుమార్తె వినీత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఓ భూత వైద్యున్ని తీసుకొచ్చి ఇంట్లో బాగుచేసుకుంటున్న క్రమంలో వినీతకు పూనకం వచ్చి గ్రామంలోని కోరం పాపయ్య, తెలగాని గణేష్, యాలం లలమ్మ, తాటి భిక్షం మంత్రాలు చేశారని చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన యాలం పోతురాజు, ఆయన బంధువులు ఆ నలుగురిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు 16మందిపై కేసు నమోదు చేశారు. ఆధునిక సమాజంలోనూ మంత్రాల నెపంతో దాడులు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం సరైంది కాదని గ్రామస్తులతో మాట్లాడారు. మూఢనమ్మకాలతో భూతవైద్యులను సంప్రదించి ఆర్థికంగా నష్టపోవొద్దని చైతన్యపరిచారు.

## గుట్కాపై నిషేధం

- **మరో ఏడాది పొడిగింపు**

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

గుట్కా, పాన్‌మసాలలపై గతంలో విధించిన నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈమేరకు ఈనెల ఆరున నోటిఫికేషన్ జారీచేసింది. ఆహారభద్రతా చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్టు ఐపీఎం డైరెక్టర్ గురువారం జారీ చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుట్కా, పాన్‌మసాలాలు తయారుచేయడం, నిల్వచేయడం, రవాణా చేయడంపై నిషేధం విధించారు.

టొబాకో, నికోటిన్ ఉపయోగించి తయారుచేసే వస్తువులకు ఈ నిషేధం వర్తిస్తుందని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాలో ఆరుగురు దుర్మరణం

- పానగల్‌లో ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు
- జడ్చర్లలో ఆటోను ఢీకొని ఇద్దరు
- కల్వకుర్తిలో బైక్ అదుపు తప్పి లైన్‌మెన్ మృతి
- మరో ఐదుగురికి గాయాలు
- మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో ఘటనలు

**నవతెలంగాణ - పాన్‌గల్/జడ్చర్ల/కల్వకుర్తి**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. వనపర్తి జిల్లా పానగల్‌లో ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురు, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆటోను బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందారు. కల్వకుర్తి మండలం సంజాపూర్‌లో బైక్ అదుపు తప్పి లైన్‌మెన్ మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలం బందలపల్లి గ్రామానికి చెందిన బాలస్వామి కుటుంబ సభ్యులు వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో బాలపీర్లను దర్శనం చేసుకునేందుకు గురువారం ట్రాక్టర్‌లో వచ్చారు. తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ మాధవరావుపల్లి శివారులోకి రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తిరుపతయ్య (45), అందులో ప్రయాణిస్తున్న మౌనిక(16) అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు.

తిరుపతమ్మ, శివ, బాలస్వామి, భాగ్యమ్మతో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యా యి. వారిని వనపర్తి ఏరియాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ డ్రైవర్ భార్య తిరుపతమ్మ మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పాన్‌గల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. బాదేపల్లి పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన ప్రశాంత్(20), మాధవరావు కాంపౌండ్‌కు చెందిన నవీన్(19) ద్విచక్ర వాహనంపై సిగ్నల్‌గడ్డ వైపు నుంచి బాదేపల్లి నేతాజీ చౌరస్తాకు బైక్‌పై వెళ్తున్నారు. కరూర్ వైశ్యాబ్యాంకు సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను వేగంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ ఏరియాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జడ్చర్ల పోలీసులు తెలిపారు. కల్వకుర్తి మండలం సంజాపూర్ గ్రామానికి చెందిన శ్రీశైలం(33) వంగూరు మండలంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నా డు. బుధవారం సాయంత్రం మద్యం తాగి వాహనం నడుపుతున్న ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఆయన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత శ్రీశైలం స్నేహితుని వాహనాన్ని తీసుకుని స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

## తెలంగాణకు కొత్తబాట

**మొదటిపేజీ తరువాయి**

మొత్తం 53 అంశాలతో కూడిన ముసాయిదాను విడుదల చేశారు. వీటిపై మరింత లోతుగా, విస్తృతంగా చర్చించనున్నారు. వచ్చే ఎన్నికల్లో 119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈనెల 25న హైదరాబాద్ వనస్థలిపురంలోని ఎమ్‌వీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఫ్రంట్ ఆవిర్భావ సభను నిర్వహించనున్నారు. సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆర్‌పీఐ జాతీయ నాయకులు ప్రకాశ్ అంబేద్కర్, ఎంసీపీఐ (యు) ప్రధాన కార్యదర్శి ఎమ్‌డీ గౌస్‌తోపాటు వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు ఈ సభకు హాజరుకానున్నారు. బీఎల్ఎఫ్‌లో చేరేందుకు మరికొన్ని పార్టీలు యోచిస్తున్నట్టు సమాచారం. వారితో ఫ్రంట్ నేతలు సమాలోచనలు జరుపుతున్నారు. సన్నాహక సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రొఫెసర్ కంచ ఐలయ్య, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాజ్యాధికార పార్టీ నేత నల్లా సూర్యప్రకాశరావు, ఎంబీటీ నేత అమ్జదుల్లాఖాన్‌తోపాటు పటేల్ వనజ పాల్గొన్నారు.

**మార్పుకు పునాది : కంచ ఐలయ్య**

"సీపీఐ (ఎం) చొరవతో ఏర్పాటైన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్రంలో ఒక మార్పుకు పునాది కాబోతున్నది. జాతీయ స్థాయిలో ప్రముఖమైన కమ్యూనిస్టు పార్టీగా ఉండి.. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసి, మరో రాష్ట్రంలో మొన్నటిదాకా అధికారంలో ఉన్న పార్టీ అది. అలాంటి పార్టీ సామాజిక న్యాయం కోసం, లాల్, నీల్ జెండాల ఐక్యత కోసం, అంబేద్కర్, పూలే, మార్క్స్ ఆలోచనలతో వారి ఆశయాల సాధన కోసం నిలబడింది. అందువల్ల ఇది కచ్చితంగా మార్పుకు పునాదే..."




**సామాజిక న్యాయమే ఇరుసు : తమ్మినేని**

"బీఎల్ఎఫ్ అనేది తెలంగాణ రాజకీయాల్లో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తుంది. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి దిశగా అది కొంగొత్త బాటను వేస్తుంది. ఒక రాజకీయ పార్టీని దించి.. మరో పార్టీని గద్దెనెక్కించినంత మాత్రాన, ఒక వ్యక్తిని దించి మరొకరని కుర్చీలో కూర్చోబెట్టినంత మాత్రాన రాజకీయ మార్పేమీ జరగబోదు. కాంగ్రెస్, టీఆర్ఎస్, ఇతర బూర్జువా పార్టీల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పేదలను దోచుకోవటం.. ధనికులకు కట్టబెట్టటమనే విధానమే కొనసాగుతున్నది. ఈ విధానాన్ని మార్చటమే మా ఫ్రంట్ లక్ష్యం. రాజకీయాల్లో అన్ని కులాలకు ప్రాతినిధ్యం, అన్ని రంగాల్లో సమానావకాశాలు కల్పించటమే మా ధ్యేయం. ప్రస్తుతం ఫ్రంట్‌లో 28 పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. వీటితోపాటు అనేక ప్రజా ఉద్యమాల్లో మాతో కలిసి పనిచేసిన సీపీఐ, సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీలు కూడా ఫ్రంట్‌లోకి రావాలని ఆహ్వానిస్తున్నాం. ఆయా పార్టీలు ఫ్రంటలోకి వస్తే అది మరింత బలోపేతం అవుతుంది. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోతే తమ బతుకులు బాగుపడతాయంటూ ఇక్కడి ప్రజలు ఆశించారు.. అయితే టీఆర్ఎస్ హయాంలో ఆ ఆశలు అడియాశలయ్యాయి. రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, నిరుద్యోగుల సమస్యలు తదితరాంశాల్లో ఉమ్మడి రాష్ట్రానికి, ఇప్పటికీ తేడా లేకుండా పోయింది. మరోవైపు అనేకాంశాల్లో అగ్రకుల ఆధిపత్యం, కుల వివక్ష, దురహంకార హత్యలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయటమే బీఎల్ఎఫ్ లక్ష్యం. సామాజిక న్యాయమే ఇరుసుగా మా ఫ్రంట్ పనిచేస్తుంది. తెలంగాణ అభివృద్ధికి ఇది తప్ప వేరే మార్గం లేదు. అందువల్ల మా ఫ్రంట్‌ను ప్రజలు ఆశీర్వదించి, అండదండలనివ్వాలి..."

**జెండాలే మారుతున్నయి.. అజెండా మారట్లే...**

"ఒక పార్టీ పోయి మరో పార్టీ వస్తే ఆయా పార్టీల జెండాలే మారుతున్నయి తప్ప వాటి అజెండా మాత్రం మారట్లే. అందువల్ల ఇలాంటి విధానాలకు చరమగీతం పాడే విధంగా కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వం, నూతన కార్యాచరణ, నూతన పని విధానం ముందుకు రావాలె. పూలె, అంబేద్కర్, మార్క్స్ ఆలోచనా విధానాలను కలగలిపి గత పాలకుల విధానాలకు భిన్నమైన విధానాలతో మా ఫ్రంట్ ముందుకు వచ్చింది. తద్వారా ప్రజలకు మెరుగైన ప్రత్యామ్నాయాన్ని చూపించబోతున్నాం..."

**కొత్త వెలుగు : అమ్జదుల్లాఖాన్**



"ఫ్రంట్ రాష్ట్రంలో ఒక కొత్త వెలుగును తీసుకురాబోతున్నది. అందరికీ సమానావకాశాలు, సమాన ప్రాతినిధ్యం అన్నదే మా నినాదం. రాబోయే ఎన్నికల్లో ఇదే ప్రధాన అజెండాగా మారబోతున్నది..."

**మహిళల్ని సమీకరించాలి : వనజ**

"ఫ్రంట్‌లోని భాగస్వామ్యపక్షాలు మహిళలపై ప్రత్యేక దృష్టి సారించాలి. వారిని రాజకీయాల్లో భాగస్వాములను చేయాలి. ఇందుకోసం పెద్ద ఎత్తున మహిళల్ని సమీకరించాలి..."

# హెచ్‌సీయూ ఘటనపై కేంద్రం ఆరా!

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటికే ప్రొఫెసర్‌పై బూతువ్యాఖ్యలు చేయడం వాస్తవమేనని గుర్తించిన అధికారులు, ఆ విద్యార్థి నాయకుడిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. ఏబీవీపీ..బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం కావడంతో ఆ పార్టీ జాతీ య నేతల నుంచి చర్యలు తీసుకోవద్దంటూ వర్సిటీ అధికారులకు ఒత్తిడి వస్తున్నట్టు సమాచారం. అయితే వారం, పదిరోజుల పాటు సస్పెండ్ చేయడం లేదా ప్రొఫెసర్‌కు క్షమాపణ చెప్పించడం... లాంటి చిన్నపాటి శిక్ష వేసి వదిలేయాలనే ఆలోచనలో వర్సిటీ అధికారులు ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవలే ఏ ఆధారం లేకపోయినా, ప్రొఫెసర్లను తిట్టారు..దాడి చేసేందుకు ప్రయత్నిం చారనే కారణంతో పదిమంది విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఆ ఘటన జరిగిన మూడు రోజుల్లోనే ప్రత్యేక కమిటీ వేసి, చర్యలు తీసుకున్నారు. కానీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణను సోషల్‌మీడియాలో బహిరంగంగా దూషించినట్టు సాక్ష్యాధారా లు ఉన్నా, వర్సిటీ అధికారులు చర్యలకు వెనుకడుగు వేస్తుండటం అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్రాంతి తర్వాత వర్సిటీ తన వైఖరి వెల్లడించే అవకాశముంది.

## టీఆర్టీ సవరణ గడువు 15కు పెంపు

**మొదటిపేజీ తరువాయి**

వెబ్‌సైట్‌లో సవరణ చేయడానికి అభ్యర్థులు ప్రయత్నిస్తే కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడం, ఎంత ప్రయత్నించినా సవరణను అంగీకరించకపోవడం వంటి సమస్యలు రావడంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కొందరు అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ దృష్టికి తీసుకెళ్లారు. దీన్ని పరిశీలిం చిన అనంతరం వివరాల సవరణ గడువును పొడిగించింది. 8,792 ఉపాధ్యాయ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 2,77,574 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసిన విషయం తెలిసిందే. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. టీఆర్టీ రాతపరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి.

## సత్యం స్కాంలో.. ఆడిటింగ్ సంస్థపై నిషేధం

**మొదటిపేజీ తరువాయి**

సత్యం కంప్యూటర్స్ స్కాం వెలుగు చూసింది. సత్యం సంస్థకు తప్పుడు లెక్కలు తయారు చేసి అక్రమ సంపాదనకు పాల్పడినందున బెంగళూరులోని ప్రైస్ వాటర్‌హౌజ్‌తోపాటు దానిలో భాగస్వాములైన ఎస్.గోపాల్‌కృష్ణన్, శ్రీనివాస్ తల్లూరికి 13 కోట్ల 9 లక్షల 1,664 రూపాయల జరిమానా విధించినట్టు సెబీ తెలిపింది. ఈ మొత్తానికి 2009,జనవరి 7నుంచి ఏడాదికి 12 శాతం వడ్డీతో కలిపి 45రోజుల్లోగా జరిమానా చెల్లించాలని సెబీ ఆదేశించింది. నిషేధం వల్ల ప్రైస్ వాటర్‌హౌజ్ ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్న ఆడిటింగ్ విషయంలో 2017-18 ఏడాదికి ఇబ్బందేమీ ఉండదని సెబీ తెలిపింది.

గోపాలకృష్ణన్, శ్రీనివాస్ తల్లూరికి ఆడిటింగ్ పత్రాలు జారీ చేయకుండా మూడేండ్ల నిషేధాన్ని సెబీ విధించింది. సెబీ ప్రకారం సత్యం కంప్యూటర్స్‌కు ఆడిటింగ్ నిర్వహించినందుకు 2000-2008 సంవత్సరాల్లో ప్రైస్ వాటర్‌హౌజ్ రూ.23 కోట్లు పొందింది. సెబీ విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్టు ప్రైస్ వాటర్‌హౌజ్ తెలిపింది.

సెన్సెక్స్ ▲70 34,503 | నిఫ్టీ ▲19 10,651 | డాలరుకు రూపాయి విలువ 63.66 | బంగారం(10.గ్రా) రూ. 30,299 | వెండి (కేజీ) రూ. 41,900





| కోడిగుడ్లు | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 368 | విజయవాడ | 374 |
| ఒక్కగుడ్డుకు | 4.30 | చెన్నై | 397 |
| వరంగల్ | 370 | ముంబయి | 410 |



## టీసీఎస్ లాభాలు రూ.6,531 కోట్లు

**న్యూఢిల్లీ:** దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) డిసెంబర్ 2017తో ముగిసిన త్రైమాసికంలో రూ.6,531 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.6,887 కోట్ల నికర లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గత త్రైమాసికంలో లాభాల్లో 3,6 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. గత సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.6,446 కోట్ల లాభాలు ఆర్జించింది. దీంతో పోల్చితే గత మూడో త్రైమాసికం లాభాల్లో 1.3 శాతం పెరుగుదల ఉంది. మూడో మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.7 డివిడెండ్ అందించడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ఈ మొత్తాన్ని జనవరి 31న వాటాదార్లకు చెల్లించనున్నారు. కాగా గురువారం బీఎస్ఈలో టీసీఎస్ షేర్ విలువ 0.67 శాతం తగ్గి రూ.2,788.40 వద్ద ముగిసింది.గత త్రైమాసికంలో తాము మెరుగైన ప్రగతిని కనబర్చామని టీసీఎస్ సీఈవో, ఎండీ గోపినాథ్ పేర్కొన్నారు. పరిశ్రమ పుంజుకుంటుందని దీంతో కొత్త ఒప్పందాలతో పాటు క్లయింట్లు పెరుగుతున్నారన్నారు. మరింత బలమైన వృద్ధిరేటును సాధిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. క్రితం మూడో త్రైమాసికంలో 50 మిలియన్ డాలర్ల పైగా విలువ చేసే మూడు కొత్త క్లయింట్లను టీసీఎస్ పొందింది. 20 మిలియన్లు పైగా విలువ చేసే 7 మంది ఖాతాదారులను, 10 మిలియన్ డాలర్ల పైగా విలువ చేసే 9 మంది క్లయింట్లు, 5 మిలియన్ డాలర్ల పైగా విలువ చేసే 15 మంది క్లయింట్లను సాధించింది.

## ఇండస్‌ఇండ్ బ్యాంకు ఫలితాలు భేష్

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ఇండస్‌ఇండ్ బ్యాంకు 25 శాతం వృద్ధితో రూ.936 కోట్ల నికర లాభాలు సాధించింది. 2016-17 ఇదే కాలంలో రూ.750 కోట్ల లాభాలు నమోదు చేసింది. గత త్రైమాసికంలో ఈ బ్యాంకు ఆదాయం16.05 శాతం పెరిగి రూ.5,473 కోట్లకు చేరింది. బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు 0.94శాతం నుంచి 1.16శాతానికి పెరిగాయి. నికర మొండి బాకీలు 0.39శాతం నుంచి 0.46 శాతానికి చేరాయి.

## కయాక్ నుంచి ట్రావెల్ హ్యాకర్ గైడ్

**నవతెలంగాణ -బిజినెస్ డెస్క్:** పర్యాటకులు తక్కువ ధరలో ప్రయాణించేందుకు వీలైన ప్రత్యేకతలతో కయాక్ సంస్థ ట్రావెల్ హ్యాకర్ గైడ్‌ను ఆవిష్కరించింది. గురువారం హైద రాబాద్‌లో కయాక్ ఇండియా ప్రాంతీయ మేనేజర్ అభిజిత్ మిశ్రా మీడియాతో మాట్లాడుతూ తాము ఆయా నగరాలకు ప్రయాణం, అక్కడి హోటళ్ల వాటి చార్జిల వివరాలను అందిస్తామన్నారు. తమ హ్యాకర్ గైడ్ ద్వారా ఏ ప్రాంతానికి ఏ విమానయాన కంపెనీ ఎంత ప్రయాణ రుసుం వసూలు చేస్తుందో పోల్చుకోవచ్చన్నారు. దీంతో పర్యాటకులు చాలా సొమ్మును ఆదా చేసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా ఏ కాలంలో ప్రయాణం, హోటళ్లకు ఎంత డిమాండ్ ఉంటుందో కూడా సమాచారం అందిస్తుందన్నారు.

# విక్రయానికి మొండి బాకీలు..

### టాప్ 12 నిరర్ధక ఆస్తులు

- బీవోబీ, యూబీఐ నుంచి రూ.17,550 కోట్లు
- ఎస్‌బీఐకి చెందిన మరికొన్ని కూడా..
- ఏఆర్‌సీలతో చర్చలు..



**న్యూఢిల్లీ:** బ్యాంకులకు తీవ్ర భారంగా మారిన మొండి బాకీలను వదిలించుకోవడానికి విత్త సంస్థలు ఉపక్రమిస్తున్నాయి. ఇందుకోసం అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏఆర్‌సీ)లతో బ్యాంకులు చర్చలు జరుపుతున్నాయి. కాగా ఇప్పటికే పలు బ్యాంకులు నిర్ణయాలు కూడా తీసుకున్నాయి. దేశంలోనే అత్యధిక విలువ చేసే 12 నిరర్ధక ఆస్తుల విక్రయానికి కసరత్తు జరుగుతోంది. ఇందులో అత్యధికం ఎస్‌బీఐకి చెందినవే ఉన్నాయి. మరోవైపు బ్యాంకు ఆఫ్ బరోడా (బీవోబీ), యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంస్థలు రూ.17,550 కోట్ల పారు బకాయిలను విక్రయానికి పెడుతున్నాయి.. ఇందులో భూషన్ స్టీల్, ఎస్సార్ స్టీల్‌కు చెందిన నిరర్ధక ఆస్తులు కూడా ఉన్నాయి. మార్చి 31 కల్లా ఈ సంస్థలు తమ బాకీలను పరిష్కరించుకోలేకపోతే ఆ కంపెనీల ఆస్తులను అమ్మకానికి పెట్టాలని సంబంధిత బ్యాంకులు నిర్ణయించినట్టు తెలుస్తోంది.

బ్యాంకులకు రూ.1.75 లక్షల కోట్ల మేర రుణాలను ఎగవేసిన 12 మొండి బాకీల ఖాతాలకు సంబంధించి ఆస్తుల బిడ్డింగ్ ప్రక్రియ ఈ నెలాఖరుకు ముగుస్తుందని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది. 12 కేసుల్లో ఆరింటికి ఎస్‌బీఐ లీడ్ బ్యాంకర్‌గా ఉంది. కాగా ఎలక్ట్రోస్టీల్, మోనెత్ ఇస్పాత్‌కు సంబంధించిన ఫైనాన్షియల్ బిడ్లను ఇప్పటికే పొందింది. మిగిలిన కేసుల్లోనూ బిడ్లు వస్తాయని ఆ బ్యాంకు విశ్వాసం వ్యక్తం చేస్తుంది. ఒక్కోటీ రూ.5,000 కోట్లకుపైగా రుణాలను ఎగవేసిన 12 భారీ ఎన్‌పీఏ కేసులను ఆర్‌బీఐ సలహా కమిటీ గతేడాది జూన్‌లో గుర్తించిన విషయం తెలిసిందే. దేశ బ్యాంకింగ్ రంగ మొండి బాకీల్లో వీటి విలువ 20-25 శాతం ఉంటుందని అంచనా. ఇందులో కొన్ని కోర్టు గొడువల్లో ఉన్నాయి.

**బిడ్లకు అహ్వానం..**

ఎస్సార్ స్టీల్, భూషన్ స్టీల్ కంపెనీలు ఇప్పటికే కోర్టులో బ్యాంకు దివాలా చట్టాన్ని ఎదుర్కొంటున్నాయి. బ్యాంకు ఆఫ్ బరోడా నుంచి ఫారిన్ కరెన్సీ రుణాలు పొందిన 17 కంపెనీలకు చెందిన రూ.3,335 కోట్ల ఆస్తులను ఆ బ్యాంకు విక్రయానికి పెట్టే పనిలో ఉందని సమాచారం. 42 ఖాతాలకు చెందిన మొత్తంగా రూ.13,566 కోట్ల విలువ చేసే పారు బకాయిల విక్రయానికి బీవోబీ బిడ్లను అహ్వానించింది. కాగా యూనియన్ బ్యాంకు 18 శాతాలకు చెందిన రూ.3,985 కోట్ల ఆస్తుల అమ్మకాలకు బిడ్లను పిలిచింది. బ్యాంకు ఆఫ్ బరోడా ఈ ఆస్తులను మొత్తం నగదుకే ఆఫర్ చేస్తున్నట్టు ప్రకటించింది. కాగా యూనియన్ బ్యాంకు నగదు లేదా నగదుతో కూడిన సెక్యూరిటీ రిసిప్ట్‌లను కూడా ఆమోదించనున్నట్టు తెలిపింది. కాగా యూనియన్ బ్యాంకు జనవరి 22 వరకు బిడ్ల సమర్పణకు తుది గడువు విధించింది. కాగా తమ మొండి బాకీల ఆస్తుల కొనుగోలుకు ఆసక్తి కలిగిన వారు జనవరి 22 లోగా బిడ్లను సమర్పించవచ్చని బ్యాంకు ఆఫ్ బరోడా స్పష్టం చేసింది. యూనియన్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా సంస్థలు వరుసగా ఎస్సార్ స్టీల్‌కు సంబంధించిన రూ.1,500 కోట్లు, రూ.1,005 కోట్ల ఆస్తులను విక్రయించనున్నట్టు ప్రకటించాయి. భూషన్ స్టీల్‌కు సంబంధించిన రూ.1,200 కోట్ల ఆస్తులను యూనియన్ బ్యాంకు, మరో రూ.1,288 కోట్ల ఆస్తులను బ్యాంకు ఆఫ్ బరోడా విక్రయానికి పెట్టాయి.

**విదేశీ మారక రుణాలపై దృష్టి**

బీవోబీ జాబితాలో భూషణ్ పవర్ అండ్ స్టీల్‌కు చెందిన రూ.1550 కోట్ల ఆస్తులు, ఏబీజీ షిప్‌యార్డ్‌కు సంబంధించి రూ.891 కోట్లు, అలోక్ ఇండస్ట్రీస్‌కు చెందిన రూ.680 కోట్లు, అమ్టెక్ ఆటోకు సంబంధించిన రూ.200 కోట్లు, ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్‌కు చెందిన రూ.179.7 కోట్ల చొప్పున విలువ చేసే మొండి బాకీలు అమ్మకానికి ఉన్నాయి. కాగా విదేశీ మారకం రుణాలకు సంబంధించి జీవీకే కోల్ డెవలపర్స్‌కు సంబంధించిన రూ.607 కోట్ల విలువ చేసే ఆస్తులను బీవోబీ అమ్మకానికి ఉంచింది. అదే విధంగా జీటీఎల్‌కు చెందిన రూ.206 కోట్లు, అబన్ హోల్డింగ్స్‌కు చెందిన రూ.283 కోట్లు, అమ్టెక్ ఆటోకు చెందిన రూ.195 కోట్లు, మన్నెట్ ఇస్పాట్‌కు సంబంధించిన రూ.280 కోట్లు, భూషణ్ పవర్‌కు చెందిన రూ.370 కోట్ల ఆస్తులను అమ్మకాలను పెట్టింది. గత పక్షం రోజుల కిందటే ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు భూషన్ స్టీల్‌కు సంబంధించిన రూ.620 కోట్ల రుణాలను ఎస్ఎస్‌జీ క్యాపిటల్‌కు రూ.376 కోట్లకు విక్రయించింది. అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలు 15:18 నిష్పత్తి పద్దతులో చెల్లింపులు చెస్తాయి. ఇందులో ఏఆర్‌సీలు 15 శాతం నగదును తక్షణమే సమకూర్చుతాయి. మిగితా మొత్తం 5-7 ఏండ్ల లోపు చెల్లిస్తాయి.

## రూ.3500 కోట్ల బినామీ ఆస్తుల జప్తు: ఐటీ శాఖ

**న్యూఢిల్లీ:** బినామీ లావాదేవీల విషయంలో ఆదాయపు పన్ను విభాగం (ఐటీ శాఖ) తమ చర్యలను వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రూ.3500 కోట్ల విలువ చేసే 900 బినామీ ఆస్తులను జప్తు చేసినట్టు ఐటీ శాఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిలో ఫ్లాట్లు, దుకాణాలు, జ్యువెలరీ, వాహనాలు ఉన్నట్టు తెలిపింది. 2016 నవంబర్ 1 నుంచి అమలులోకి వచ్చిన ప్రొహిబిషన్ ఆఫ్ బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద ఈ చర్యలను తీసుకున్నట్టు ఐటీ శాఖ వివరించింది. ఈ యాక్ట్ ప్రకారం (స్థిర, చర) బినామీ ఆస్తుల జప్తుకు అవకాశం కల్పిస్తుందని తెలిపింది. ఈ కొత్త చట్టం కింద బినామీగా వ్యవహరించిన వ్యక్తి, ప్రయోజనం పొందే వ్యక్తితో పాటు ఈ లావాదేవీలలో సంబంధం ఉన్న వారికి ఏడేండ్ల వరకు కఠిన కారాగార శిక్ష పడుతుంది. అదే సమయంలో బినామీ ఆస్తి మార్కెట్ విలువపై 25శాతం వరకు జరిమానా విధించనున్నట్టు ఐటీ శాఖ పేర్కొంది. కాగా ఈ బినామీ ఆస్తుల విషయంలో త్వరితగతిన చర్యలు చేపట్టడానికి 2017 మే నెలలో దేశవ్యాప్తంగా ఇన్వెస్టిగేషన్ డైరెక్టరేట్స్ కింద 24 ప్రత్యేక బినామీ ప్రొహిబిషన్ యూనిట్ల(బీపీయూల)ను కూడా ఐటీ శాఖ ఏర్పాటు చేసింది.

## వచ్చే నెల 19 నుంచి ప్రపంచ ఐటీ సదస్సు..

**హైదరాబాద్:** ప్రపంచ ఐటీ సదస్సు ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరగనున్నట్టు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. నాస్కామ్ జాతీయ సదస్సు కూడా అవే రోజుల్లో ఉంటుందన్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని నాస్కామ్ ఆహ్వానించిందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ ఐటీ కాంగ్రెస్ మన దేశంలో జరగడం ఇదే మొదటిసారని కేటీఆర్ తెలిపారు. సుమారు 30 దేశాల నుంచి 2వేల మంది ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ ఐటీ కాంగ్రెస్‌కు సుమారు ఏడాదిన్నరగా సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఐటీ కాంగ్రెస్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటించనున్నట్టు తెలిపారు.

## సిద్దిపేట వైద్య కళాశాలలో అడ్మిషన్లు

### వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి..?

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**


వచ్చే విద్యా సంవత్సరం నుంచి సిద్దిపేట వైద్య కళాశాలలో అడ్మిషన్లు జరిగేలా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. దీంతోపాటు నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లోనూ ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఇప్పటికే ఆ శాఖ సమకూరుస్తున్నది. సాధారణంగా ఒక కళాశాలకు అనుమతి రావాలంటే ఆస్పత్రిలో 400 పడకలు ఉండాలి. నల్లగొండ జిల్లా ఆస్పత్రిలో 250 పడకలు మాత్రమే ఉన్నాయి. ఇటీవల 150 పడకలు సమకూర్చారు. దీంతో ఇక్కడ కళాశాల భవనాలు నిర్మాణం, పరికరాలు, ఇతర వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించారు. ఇక సూర్యాపేట జిల్లా కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి ఉంది. ఇందులోనే అదనంగా 300 పడకలు ఏర్పాటు చేయనున్నారు. ఐతే ఇక్కడ కళాశాల ఏర్పాటుకు స్థలం లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితుల్లో కళాశాల నిర్మాణ స్థలంపై సందిగ్ధత వీడటంలేదు. రెండేండ్ల క్రితం ప్రారంభమైన మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో 150 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా ఈ మూడు వైద్య కళాశాలలు కూడా అందుబాటులోకి వస్తే అదనంగా 450 సీట్లు రాష్ట్రానికి దక్కనున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 22 వైద్య కళాశాల్లో మొత్తం 3,200 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 6 ప్రభుత్వ వైద్యకళాశాలలు, ఒక ఈఎస్ఐ, 3 ప్రయివేటు మైనారిటీ, 12 ప్రయివేటు కళాశాలలు ఉన్నాయి.

## ప్రయివేటు ట్రావెల్స్‌పై అధికారులకు ఎమ్మెల్యే ఫిర్యాదు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయివేటు ట్రావెల్స్ అధిక చార్జీలు వసూలు చేయడంపై మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ రమణారావు, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ప్రైయివేటు ట్రావెల్స్ ఆర్టీసీ బస్సు చార్జీల కన్న రెట్టింపు.. అంతకన్నా ఎక్కువగా వసూలు చేస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ నుండి ఏపీ, ఇతర దూరప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను అదనంగా నడపాలని తాను ఎండీని కోరినట్టు తెలిపారు. అర్టీసీ బస్సుల కున్న అధికమొత్తంలో ప్రయివేటు ట్రావెల్స్ ఛార్జీలు వసూలు చేయడాన్ని సునీల్‌శర్మ దృష్టికి తీసుకువచ్చానన్నారు.

## శ్రీచైతన్య విద్యార్థికి కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ నగదు పురస్కారం



**హైదరాబాద్:** కేఎల్ డీమ్డ్ వర్సిటీ నిర్వహించిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కూకట్‌పల్లి బ్రాంచ్‌కు చెందిన విద్యార్థి 16వ ర్యాంకు సాధించింది. ఈ ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన కోడాలి కృష్ణజను యూనివర్సిటీ తరుపున తెలంగాణ ప్రాంతీయ మేనేజర్ మదన్ అభినందించారు. కృష్ణజకు రూ.50వేల నగదు పురస్కారం అందజేశారు. భవిష్యత్‌లోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మదన్ మాట్లాడుతూ...మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేఎల్ వర్సిటీ జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబర్చి టాప్ 20లో నిలిచిన విద్యార్థులకు రూ.25లక్షల నగదు బహుమతి అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ హైదరాబాద్ మేనేజర్లు రాజు, అశోక్, శ్రీచైతన్య డీన్ గిరిబాబు, ప్రిన్సిపాల్స్ నరేష్, సురేష్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# 'లాటరీ'తో బడుల్లో సీట్లు

- పరిశీలిస్తున్న పాఠశాల విద్యాశాఖ
- వచ్చే ఏడాది నుంచి అమలుకు కసరత్తు!

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

ప్రయివేటు, కార్పొరేట్ బడుల్లో 'అడ్మిషన్లు లేవు' అనే బోర్డులకు ఇక బ్రేక్ పడనుందా..? అంటే అవుననే అంటున్నారు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి నూతన అడ్మిషన్ల విధానానికి విద్యాశాఖ శాఖాధికారులు తెరతీస్తున్నారు. లాటరీ విధానంలో విద్యార్థులకు సీట్లు కేటాయించాలని భావిస్తున్నారు. ఈ విధానం సాధ్యాసాధ్యాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో 11,737 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలుండగా, వాటిలో సుమారు 31లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో సుమారు సగం పాఠశాలల్లో ప్రభుత్వం నుంచి అనుమతి మేరకు సీట్లు భర్తీ అవుతుండగా, మిగిలిన బడుల్లో వాటిల్లో సీట్లు మిగులుతున్నాయి. కొన్ని బడుల్లో ప్రభుత్వ అనుమతి లేకున్నా, అదనపు సెక్షన్లను పెట్టి యాజమాన్యాలు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. పదోతరగతి వచ్చే వరకూ ఇదే తంతు కొనసాగుతుంది. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వం విడుదల చేసిన అడ్మిషన్ షెడ్యూల్ ప్రకారం అడ్మిషన్లను నిర్వహించడం లేదు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ఆరునెలల ముందు నుంచే బడుల్లో ప్రవేశాలు ప్రారంభిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం తల్లిదండ్రులు అడ్మిషన్ తీసుకునేందుకు పాఠశాలలకు వెళ్తే అప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యాయనే బోర్డు అక్కడ దర్శనమిస్తుంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకుపోయారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహించవద్దని అధికారులు పలుమార్లు ఆదేశించినా యాజమాన్యాల్లో పెద్దగా మార్పు రాలేదు. దీంతో అడ్మిషన్ల విధానంలో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలనే యోచనలో అధికారులు వచ్చారు.



(ఫైల్)

ఈవిధానంపై ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతోనూ చర్చించినట్టు తెలిసింది. అయితే యాజమాన్యాలు అభ్యంతరం చెప్పినట్టు సమాచారం. అన్నదమ్ములు, అక్కాచెల్లెలు ఒకే పాఠశాలలో చదివించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడతారనీ, ఇలాంటి వారు ఇబ్బందులు పడే అవకాశముందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

ఇలాంటి కొన్ని విషయాలకు మినహాయింపు ఇచ్చి, ఈ లాటరీ విధానాన్ని కొనసాగించాలని విద్యాశాఖ సమాలోచనలు చేస్తున్నది. ఈ విధానం అమలు చేస్తే ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీ కూడా కొంత అదుపులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆమోదిస్తుందా? లేదా అనేది త్వరలో తేలనుంది.

# ప్రభుత్వాస్పత్రుల్లో చెత్తాచెదారం కనిపించొద్దు

### పోస్టులు భర్తీ చేయకుండా ఉత్తర్వులు

- నిర్దేశించిన వేళల్లోనే సందర్శకులకు అనుమతులు
- రోగుల పరామర్శకు రెండుగంటలే కేటాయింపు

**ప్రభుత్వాస్పత్రుల్లో ఎప్పుడుపడితే అప్పుడు రోగులను చూడటానికి వీల్లేదు.. ఇక నుంచి చెత్తా, చెదారం కనిపించడానికి వీల్లేదు.. గంటల తరబడి క్యూలైన్లో నిలబడాల్సిన అవసరం లేదు' ఇవి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు. వీటిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏండ్లుగా ఖాళీగా ఉన్న వేలాది పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వాస్పత్రుల్లో సంస్కరణలు చేపడతామని చెప్పడం విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. వైద్యఆరోగ్యశాఖలో అన్ని కేటగిరీల్లో మొత్తం 41,059 పోస్టులకుగాను 13,521 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీటిలో సింహభాగం ఆస్పత్రుల్లో ఖాళీలే ఉండటం విశేషం.**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కొన్నాళ్లుగా ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులు సంఖ్య గణనీయంగా పెరిగింది. వారి వెంట వచ్చే సహాయకులు పెరిగారు. దీంతో వైద్యం చేసే సమయంలో వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పారిశుధ్య సమస్య కూడా ఎక్కువవుతున్నది. ఈ నేపథ్యంలో ఉన్న సిబ్బందితో సంస్కరణలు ఎలా చేపడతారో అధికారులకే తెలియాలని వైద్యులు చెబుతున్నారు. ఇక, నిర్దేశించిన సమయంలోనే సందర్శకులను అనుమతించాలని, పారిశుద్ధ్యం, వార్డుల్లో పరిశుభ్రత ఎప్పటికప్పుడు పరిశీలన జరిపే బాధ్యత స్థానిక ఆర్ఎంఒలదేనని, భద్రతా సిబ్బందిని నియమించుకోవడంలోనూ వారే కీలకపాత్ర పోషించాలని



(ఫైల్)

ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరిశుభ్రత నిర్వహణ వార్డుస్థాయి నుంచి మొదలవ్వాలని, రోజువారీ సేవలపై నర్సుల నివేదికలను నెలవారీగా విభాగాధిపతులకు పంపించాలని, కేటాయించిన సిబ్బంది సరిగ్గా విధులకు హాజరవుతున్నారా లేదా అని ప్రధాన నర్సే పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నది ఆ ఆదేశాల్లోని ముఖ్యసారాంశం. సిబ్బంది బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని, ఈ వివరాల ఆధారంగానే బిల్లులను చెల్లించాలని, ఆస్పత్రిలో రోగి సహాయకులకు రెండు అనుమతి కార్డులను ఇవ్వాలని సూచించారు. రోజు ఉదయం ఒక గంట, సాయంత్రం గంట మాత్రమే సందర్శకులను అనుమతించాలని, సిబ్బంది రోగుల నుంచి డబ్బులు తీసుకున్నట్టు తేలితే తక్షణమే విధుల నుంచి తొలగించాలని హెచ్చరించింది. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రోగుల రాకపోకలు, సిబ్బంది పనితీరుని నిరంతరం పర్యవేక్షించాలని, రోగి సహాయకులు నాలుగు చక్రాల బల్లనూ మూడు చక్రాల కుర్చీని తోసుకుంటూ తీసుకెళ్ళొద్దని, ఆ విధులను రోగి సహాయకులే నిర్వర్తించాలని, దీని వల్ల బోధనాస్పత్రుల పనితీరు మెరుగవుతుందని అధికారులు ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇవన్నీ జరగాలంటే ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నారు.

**ఏజల్ సంస్థపై చర్యలేవి ?**

ఇలా ఉండగా, హైదరాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రుల్లో పారిశుధ్యం, పెస్టిసైడ్స్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సర్వీసులను ఏడాది క్రితం వరకు వేర్వేరు ఏజన్సీలు నిర్వహించేవి. ఆ ఏజెన్సీలు అవకతవకలకు పాల్పడున్నాయనే ఆరోపణల నేపథ్యంలో వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు ప్రభుత్వం 'ఏజెల్' అనే సంస్థకు బాధ్యతలు అప్పగించింది. ఆ సంస్థకు కట్టబెట్టిన ఆస్పత్రుల్లో 6,317 పడకలు ఉండగా, ఒక్కో పడకకు ఏడాదికి రూ.5,016 చొప్పున నిర్వహణ ఖర్చుగా చెల్లించాలని నిర్ణయించింది. కానీ, నిబంధనల ప్రకారం ఆ సంస్థ ఏ ఒక్క ఆస్పత్రిలోనూ తగిన సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. నిర్దేశించిన సంఖ్య కంటే తక్కువ మందితోనే పనులు చేయిస్తున్నది. నెలకు రూ.4.50 కోట్లు ఖర్చు వెచ్చిస్తున్నా ఆయా ఆస్పత్రుల్లో సిబ్బంది పెంపు, పారిశుధ్య నిర్వహణ మాత్రం మెరుగుపడలేదు. కాంట్రాక్టు దక్కించుకున్న సదరు ఏజన్సీ యాజమాన్యం ఎక్కడికక్కడ సబ్ కాంట్రాక్టులు ఇచ్చుకొని చేతులు దులుపుకుంది. సదరు సబ్ కాంట్రాక్టర్లు నిర్దేశిత సంఖ్య కంటే తక్కువ మందితో పనులు చేయిస్తున్నారు. రోగుల నిష్పత్తికి తగినంత మంది పారిశుధ్య కార్మికులు, పేషంట్ కేర్ ప్రొవైడర్స్, సెక్యూరిటీ స్టాఫ్ లేకపోవడంతో మెరుగైన వైద్యసేవలు అందడంలేదు. ప్రఖ్యాతి గాంచిన ఉస్మానియా ఆస్పత్రిలో 546 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 350 మందితోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇతర విభాగాల్లోనూ ఇదే కొనసాగుతున్నది. ఆస్పత్రుల్లో పరిస్థితి ఈ విధంగా ఉంటే సిబ్బందిలేమితో రోగులకు మెరుగైన సేవలు ఎలా సాధ్యమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏజల్ సంస్థపైనా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

### ఎప్పటికప్పుడు పర్యవేక్షణ : ఉస్మానియా, సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్

ఉస్మానియాలో కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే పారిశుద్ధ్యం, బయోమెడికల్ వేస్ట్, సిబ్బంది భద్రతపై ప్రధానంగా దృష్టిసారించాం. ఆర్ఎంఒలతో రోజూ సమావేశమవుతున్నాం. రోగులు, సిబ్బంది భద్రత కోసం 17 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాం. మౌలిక సదుపాయాలు, సిబ్బంది రాకపోకలు, రోగుల పట్ల అనుసరిస్తున్న తీరు, వార్డుల్లోని సేవలు ఇతర సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మార్చురీని గోవాలోని మార్డన్ మార్చురీ తరహాలో ఆధునీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. ఆస్పత్రిలో రోగుల వెంట పది మందికిపైగా వస్తున్నారు. దీంతో పారిశుధ్య సమస్య ఎక్కువవుతున్నది. దీనివల్ల మిగతా రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కఠిన నిర్ణయాలను అమలు చేయక తప్పడంలేదు. ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా పాటిస్తున్నాం. ప్రజలు సహకరించాలి.

### వైద్యఆరోగ్యశాఖలో ఖాళీల వివరాలు ఇలా

| విభాగం | ఉండాల్సిన వారు | ఉన్నవారు | ఖాళీలు |
|---|---|---|---|
| వైద్యవిద్య | 9,205 | 5,726 | 3,479 |
| కుటుంబ సంక్షేమం | 17,148 | 10,882 | 6,266 |
| వైద్యవిధాన పరిషత్ | 7,303 | 7,295 | 8 |
| ఆయుష్ | 2,697 | 1,706 | 991 |
| సచివాలయం | 17 | 14 | 3 |
| డ్రగ్స్ కంట్రోల్ | 202 | 148 | 54 |
| ఐపీఎం | 569 | 245 | 324 |
| స్టాఫ్ నర్సులు | 1,572 | 1,010 | 562 |
| ఎల్టీలు | 960 | 512 | 448 |
| డీఈవోలు | 426 | 0 | 426 |
| ఇతర సిబ్బంది | 960 | 0 | 960 |
| మొత్తం | 41,059 | 27,538 | 13,521 |



# కదలిక కష్టమైతే...

**భుజం కీలు.. మన శరీరంలో అత్యంత కీలకం. కీళ్లన్నింటికన్నా ఇది ఎక్కువగా కదులుతుంది. మనం చేసే ప్రతి పనికీ ఇది ఉపయోగయోపడుతుంది. దీంతోో నిగ్గై ఒత్తిడి పడుతుంది. తీవ్రత ఎక్కువైనప్పుడు నొప్పి వస్తుంది. ఒక్కోసారి ఇది గెను సమస్యగా మారుతుంది. సకాలంలో వైద్యం చేయించుకుంటే ఈ బాధ నుంచి ఉపశమనం పొందొచ్చు.**

భుజం కీలు కూడా మోకాలి, తుంటి కీలు లాంటిదే. వెన్ను నొప్పి, మోకాలి నొప్పి తర్వాత భుజం నొప్పి అతి పెద్ద సమస్య. దీని కారణంగా చాలామంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యం కోసం ఎముకల, కీళ్ల వ్యాధి నిపుణులను సంప్రదిస్తున్నారు. పెద్దల్లో ప్రతి సంవత్సరం ఒక శాతం మంది భుజం నొప్పితో డాక్టర్ వద్దకు వెళ్తున్నారు.

భుజం అనేది నాడులు, కండరాలు, ఎముక లతో కూడుకున్న కీలు. దీన్ని నిర్ధారించి వైద్యం అందించడంలో మనదేశంలో పురోగతి కనిపిస్తోంది. మూడు దశాబ్దాలుగా ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో ఎంఆర్ఐ స్కాన్ లాంటి టెక్నాలజీ ముఖ్యమైనది. ఆర్థోస్కోపీ (రంధ్రం ద్వారా శస్త్రచికిత్స)తో భుజం సమస్యలను



పరిష్కరించుకోగలుగుతున్నాం. గతంలో పశ్చిమ దేశాల్లో అందుబాటులో ఉన్న భుజం శస్త్రచికిత్స క్రమంగా మనదేశంలో కూడా విస్తరించింది. కొంతమంది ఆర్థోపెడిక్ సర్జన్లు విదేశాల్లో కొన్నెండ్లపాటు శిక్షణ పొంది మనదేశంలో సేవలు అందిస్తున్నారు. విదేశాల్లోని సాంకేతికతను ఇక్కడా అందుబాటులోకి తెస్తున్నారు.

అయితే.. అన్ని విషయాల్లో సాంకేతికత అనేది అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కొద్దికాలం పాటు మాత్రమే విదేశాలకు వెళ్లే వారికి ఈ సాంకేతికతను సరిగ్గా నేర్చుకోక పోవచ్చు. ఈ నేపథ్యంలో ఆర్థోపెడిక్స్‌లో ప్రత్యేకతను కనబర్చే అవసరం ఏర్పడింది. అనేక కేంద్రాల్లో దీని మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. భుజం, చెయ్యి, తుంటి ఎముక శస్త్రచికిత్సలు, మోకాలు, పాదాల శాస్త్రచికిత్సలు ఇలా అనేక అంశాల్లో నిపుణులు తమ సమర్థతను కనబరుస్తున్నారు.

**భుజం నొప్పి సమస్య ఎవరికి ఎక్కువ?**

క్రీడాకారుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అయితే.. ఇది పూర్తిగా వాస్తవం అని అనలేం. రోగుల్లో ఎక్కువ శాతం మంది మధ్యవయస్కులు లేదా వయస్సు మళ్లిన వారు ఉంటున్నారు. భుజం కీలు అనేది అతి సున్నితమైనది. మన శరీరంలో ఎక్కువగా కదిలేది ఇదే. ఇది బంతి, సాకెట్ మాదిరిగా ఉంటుంది. చిన్న సాకెట్‌లో పెద్ద బంతి ఇమిడిపోయి ఉంటుంది. క్రీడల్లో పాల్గొనే వారు కింద పడిపోయినప్పుడు కీలు నుంచి బంతి జారిపోతుంది. దీంతో నొప్పి కలిగినప్పుడు ఆరంభంలోనే గుర్తించాలి. సకాలంలో చికిత్స తీసుకుంటే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు రాకుండా నివారించొచ్చు.

**ఎందుకు..ఎలా?**

కండరాలు కదిలినప్పుడు, కీలు దెబ్బతిన్నప్పుడు, భుజం చుట్టూ ఉండే కణజాలం వాచినప్పుడు, చుట్టూ పగుళ్లు ఏర్పడినప్పుడు భుజం నొప్పి వస్తుంది. నొప్పి వల్ల భుజం బిగుసుకుపోతుంది. కీలులో కదలిక తగ్గిపోతుంది. ఆర్థరైటిస్ వల్ల భుజం ఘనీభవించిన పరిస్థితి ఏర్పడుతుంది. మధుమేహం, థైరాయిడ్ రోగుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. 25 నుంచి 30 శాతం మంది మధుమేహ రోగుల్లో ఇది అధికం. ఘనీభవించిన భుజం సమస్య నుంచి విముక్తి చెందాలంటే మధుమేహం నియంత్రణలో ఉండాలి. భుజం బలహీనంగా మారినప్పుడు కూడా నొప్పి ఎక్కువవుతుంది. కండరాలు గాయపడినప్పుడు భుజం నొప్పి వస్తుంది. ఇది సంభవించినప్పుడు చేయి ఎత్తడం కష్టంగా ఉంటుంది. భుజం కంటే ఎత్తుగా చేతిని పైకి ఎత్తినప్పుడు నొప్పి క్రమేణా పెరగుతూ ఉంటుంది. నాడుల మీద ఒత్తిడి కలిగినప్పుడు కూడా కొన్నిసార్లు భుజం బలహీనమవుతుంది.

**నిర్ధారణ ఇలా..**

భుజం చుట్టూ ఎముకలను పరీక్షించేందుకు ఎక్స్‌రే లేదా అల్ట్రాసౌండ్ స్కాన్ తీస్తారు. సున్నితమైన కణజాలం దెబ్బతిన్నప్పుడు ఎంఆర్ఐ స్కాన్ అవసరమవుతుంది. సరైన స్కాన్ తీసే ముందు డాక్టర్‌ని సంప్రదించాలి.

**చికిత్స ఎలా ?**

భుజానికి సమస్యలకు మందుల ద్వారా చికిత్స చేయొచ్చు. సరైన ఫిజియోథెరపీ చేయించాల్సి ఉంటుంది. ఎవరికి వారే వ్యాయామం చేయాలి. ఐఎఫ్‌టీ, అల్ట్రాసౌండ్‌తో తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ దీర్ఘకాలంగా వ్యాయామం అవసరమవుతుంది. వివిధ కారణాల వల్ల భుజం దెబ్బతింటే శస్త్రచికిత్స ద్వారా సరిచేయొచ్చు.

**ఆపరేషన్ ఎప్పుడు అవసరం?**

భుజంలో ఉన్న నిర్మాణాలు దెబ్బతిన్నప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుంది. మళ్లీ మామూలు స్థితికి తీసుకురావచ్చు. భుజం కీలు ప్రభావితంతో ఆర్థరైటిస్ వచ్చినట్టయితే మరో ప్రత్యామ్నాయం ఉంది. అదే.. భుజం కీలు మార్పిడి. ఇది మంచి ఫలితాన్నిస్తుంది. ఇంపింగ్‌మెంట్ సింద్రోమ్, ఘనీభవించిన భుజం, అక్రోమియోక్లానియులర్ జాయింట్ ఆర్థరైటిస్ ఉన్నవారికి రంధ్రం ద్వారా శస్త్రచికిత్స లేదా ఆర్థోస్కోపీ సర్జరీ అవసరమవుతుంది.

**- డాక్టర్ దీప్తి నందన్‌రెడ్డి అడ్ల,**
**సీనియర్ కన్సల్టెంట్ ఆర్థరైటిస్ సర్జన్,**
**కాంటినెంటల్ హాస్పిటల్స్**



# పండంటి ఆరోగ్యానికి పది సూత్రాలు




- రోజుకు 20 నిమిషాలపాటైనా బ్రిస్క్ వాక్ లేదా రన్నింగ్ చేయాలి. దీంతో ఒత్తిడి అస్సలు దరిచేరదు.
- పని మనుషుల మీద ఎక్కువగా ఆధారరపడకుండా ఇంటి పని స్వయంగా చేసుకుంటే శారీరక వ్యాయామంతో పాటు క్యాలరీలు కూడా అధికంగా ఖర్చవుతాయి.
- ఆరోగ్యంగా ఉండాలంటే సరైన నిద్ర కూడా ఎంతో అవసరం. నిద్రలేమి అనేది జబ్బులకు నిలయంలాంటిది. అలాగని అతి నిద్ర కూడా మంచిది కాదు. శరీరానికి ఎంత అవసరమో అంతే నిద్రపోవాలి. రాత్రివేళ త్వరగా పడుకుని వేకువజామునే నిద్రలేవడం మంచిది.
- ఆహారంలో తరచూ పాలకూర తీసుకుంటే శరీరానికి కావాల్సిన ఐరన్ పుష్కలంగా లభించడంతో పాటు పలు ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు.
- కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోవడానికి చాలామంది రకరకాల పద్ధతుల పాటిస్తుంటారు. అలాంటి వారు క్రమం తప్పకుండా ఓ చిన్న గిన్నెడు ఓట్స్ తీసుకుంటే కొలెస్ట్రాల్‌ని తేలిగ్గా తగ్గించుకోవచ్చు.
- నీరు తాగడం అన్నది ఆరోగ్యానికే కాదు.. అందానికీ కూడా అవసరమే. వ్యాయామం చేయడానికి ముందు, ఆ తర్వాతా తప్పనిసరిగా నీరు తాగాలి.
- లోబీపీ, ఒత్తిడి, ఆందోళనతో బాధపడేవారు నిపుణుల సలహా మేరకు క్రమం తప్పకుండా రోజూ కొద్ది సేపైనా వ్యాయామం చేయడం మంచిది.
- వ్యాయామం చేస్తున్న సమయంలో ఆయాసం, శ్వాసపరమైన సమస్యలు ఎదురుకావచ్చు. అలాంటప్పుడు వ్యాయామం చేయడం వెంటనే ఆపేయాలి. దగ్గరలో ఉన్న డాక్టరును సంప్రదించాలి. ఉదయం వ్యాయామానికి సమయం కేటాయించాలి. నచ్చిన వ్యాయామం ఏదైనా చేయొచ్చు. ఉరుకుల పరుగుల జీవితంలో పడిపోయి వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయడం మంచిదికాదు.
- సిగరెట్లు, పొగాకు, మద్యపానం లాంటి దురలవాట్లు ఉంటే తప్పకుండా మానుకోవాలి. వ్యసనాల బారినపడితే ఆరోగ్యం చెడిపోవడం ఖాయం.
- మనం తినే భోజనమే మనకు అమృతం. అదే మన జీవితానికి శక్తిప్రదాయిని. నిర్ణీతవేళలో పుష్టికర భోజనం తీసుకోవాలి. అది శరీరానికి కావాల్సిన పోషకాలు అందించేదిగా ఉండాలి. అమితమైన భోజనం లేదా అతి తక్కువ భోజనం శరీరానికి అంత మంచిదికాదు. ఆహారం బాగా నమిలి, ఎక్కువ సేపు తినడం వల్ల జీర్ణం కావడంతోపాటు మరో ప్రయోజనం కూడా ఉంది. ఎక్కువ సేపు ఆహారం తీసుకోవడం వల్ల ఎక్కువగా తిన్నామన్న ఫీలింగ్ కలుగుతుంది. దాంతో ఎక్కువ సమయంలో తక్కువ ఆహారాన్ని తీసుకుంటారు.

## తీపి పానీయాలతో మహిళలకు క్యాన్సర్




తీపి పానీయాలు, కార్బొనేటెడ్ సోడాలు తీసుకునే నడి వయసు మహిళలకు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువట. అమెరికన్ అసోసియేషనప్ ఆఫ్ క్యాన్సర్ రీసెర్చ్ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. తీపి పానీయాలు తీసుకునే నడి వయసు మహిళల్లో క్యాన్సర్ ముప్పు 70 శాతం ఎక్కువ అని తేలింది. టైప్-1 ఎండోమెట్రియల్ కేన్సర్‌తోపాటు స్థూలకాయం సమస్య తలెత్తుతాయని పరిశోధకులు గుర్తించారు. పీరియడ్స్ ఆగిపోయే దశలో ఉన్న సుమారు 23 వేల మంది మహిళలను పరిశీలించగా ఈ మేరకు ఫలితాలు వచ్చాయని వెల్లడించారు.

## వృద్ధాప్యంలో వ్యాయామం మంచిదేనా?



వ్యాయామంతో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అందరికీ తెలిసిందే. ఇప్పటికే అనేక అధ్యయనాల్లో ఇది తేలింది. అయితే... వ్యాయామంతో ఆరోగ్యమే కాదు, ముప్పు కూడా ఉందంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సదరన్ మెడికల్ సెంటర్ పరిశోధకులు. గుండె జబ్బులను నివారించడానికి వ్యాయామం మంచి సాధనమైనప్పటికీ వృద్ధాప్యంలో ఇది హృద్రోగాలకు దారి తీయొచ్చని హెచ్చరిస్తున్నారు. 65 ఏండ్ల లోపు వయసు ఉన్నవారు వారానికి నాలుగైదు సార్లు వ్యాయామాలు పాటిస్తే గుండె సామర్థ్యం పెరుగుతుందని గత అధ్యయనాలు చెప్పాయని, తమ పరిశోధనలో మాత్రం ఫలితాలు మరోలా వచ్చాయని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో క్రమం తప్పకుండా కఠోర వ్యాయామాలు చేస్తే హానికరమని, వారానికి రెండు మూడుసార్లు మాత్రమే తేలికపాటి వ్యాయామాలు చేయాలని సూచిస్తున్నారు. కండరాలు గట్టిగా ఉండగా వ్యాయామాలు చేస్తే శరీరంపై అధిక ఒత్తిడి పడి గుండె గదులు రక్తంతో నిండవని అంటున్నారు. పర్యావసానంగా రక్తం తిరగి ఊపిరితిత్తులోకి వస్తుందని, ఇది గుండె వైఫల్యానికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు.

# సీఓపీడీ అంటే..?



## తెలుసుకుందాం..

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్ (సీఓపీడీ).. దీర్ఘకాలిక వ్యాధి. ఊపిరితిత్తులకు వచ్చే రుగ్మత ఇది. క్రమేణా ముదిరి తీవ్రంగా ఇబ్బంది పెట్టే మహమ్మారి ఇది. 'క్రానిక్ బ్రాకైటిస్' (దీర్ఘకాలిక శ్వాసకోశ వాపు), 'ఎంఫెసేమా' (సంధివాపు)కు దారి తీస్తుంది. దీంతో శ్వాస తీసుకోవడం ఇబ్బంది ఏర్పడుతుంది. దగ్గూ వస్తుంది. క్రానిక్ బ్రాంకైటిస్ బారిన పడ్డవారికి గాలి గొట్టాలు (ఎయిర్ వేస్) కుంచించిపోతాయి.

ఊపిరితిత్తుల్లోకి గాలిని తీసుకెళ్లే గొట్టాలు శాఖలుగా చీలిపోయి ఉంటాయి. ఇవి కుంచించి, దెబ్బ తినడం వల్ల అదనంగా శ్లేష్మం(మ్యూకస్)ను ఉత్పత్తి అవుతుంది. ఇది గాలి గొట్టాలకు అడ్డు తగలడం వల్ల తరచూ దగ్గు వస్తుంది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. ఎంఫెసేమా ఉన్న వారికి గాలి గొట్టాలు తక్కువ సామర్థ్యంతో పనిచేస్తాయి.

**కారణం?**

సీఓపీడీ రావడానికి ధూమపానం, వాయు కాలుష్యం ముఖ్య కారణాలు. రెండింటి లో ధూమపానం ప్రధానమైనది. దీని వల్ల గాలి గొట్టాలు దెబ్బతింటాయి. సెకండ్‌హ్యాండ్ స్మోక్ (ఎస్‌హెచ్ఎస్) లేదా పాసివ్ స్మోక్ కూడా సీఓపీడీకి కారణాలు. జన్యుపరంగా సీఓపీడీ వచ్చే అవకాశం తక్కువే. ఎంజైమ్ లోపం వల్ల సీఓపీడీ వచ్చే అవకాశం ఉంది. అంతేకాదు.. అల్ఫా-1 యాంటీ ట్రిప్సిన్ లోపం కూడా సీఓపీడీకి దారి తీస్తుంది.

**లక్షణాలు**

ప్రారంభ దశలో సీఓపీడీ లక్షణాలు ఏ మాత్రం కనిపించవు. రానురాను దగ్గు లేదా తెమడ తీవ్రమవుతుంది. కఫం ఎక్కువ తయారవుతుంది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. శ్వాస తీసుకునే సమయంలో పిల్లికూతలు వినిపిస్తాయి.

**నిర్ధారణ ఎలా?**

సీఓపీడీ నిర్ధారణకు 'స్పిరోమెట్రీ' పరీక్ష చేయాల్సి ఉంటుంది. అంటే.. ఉపరితిత్తులు ఏ విధంగా పనిచేస్తున్నాయో తెలుసుకోవడమన్నమాట. ఈ పరీక్షను అతి సులువుగా చేయించుకోవచ్చు. ఎలాంటి కోతలు ఉండవు. ఒక పరికరణాన్ని ఉపయోగించి చేస్తారు. ఆ సమయంలో గట్టిగా ఉపిరి తీసుకుని వదిలేయాల్సి ఉంటుంది. ఊపిరితిత్తుల నుంచి ఎంత గట్టిగా శ్వాస వదులుతున్నారో స్పిరోమెట్రీ యంత్రం తెలియజేస్తుంది. కొన్ని సందర్భాల్లో చెస్ట్ రేడియోగ్రాఫ్ లేదా సిటీ స్కాన్ ద్వారా ఊపిరితిత్తుల్లో వచ్చే మార్పులను తెలుసుకోవచ్చు.

**చికిత్స**

సీఓపీడీని అరికట్టేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాధి నిర్ధారణ అయ్యాక ధూమపానాన్ని పూర్తిగా మానేయాలి. ఈ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ జాప్యం గానీ, నిర్లక్ష్యంగా గానీ చేయొద్దు. నోటి మాత్రలు లేదా ఇన్‌హెల్లర్స్ వాడటం వల్ల వ్యాధి తీవ్రత తగ్గుతూ వస్తుంది. ఇన్‌హెల్లర్స్‌ని ఒకట్రేండు సార్లు ఉపయోగించడంతో గాలి గొట్టాలు తెరుచుకుంటాయి. తద్వారా ఉపశమనం కలుగుతుంది. రోజూ ఇన్‌హెల్లర్స్ వాడటం వల్ల రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గిపోతుంటే ఆక్సిజన్ ఇన్‌హేలేషన్ అవసరమవుతుంది.

'పల్మొనరీ రిహాబిలిటేషన్'తో తీవ్రతను తగ్గించొచ్చు. వ్యాయామం ద్వారా కూడా వ్యాధి తీవ్రత తగ్గుతుంది.

**ఎలాంటి జాగ్రత్తలు ఇలా..**

వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. దీంతో తెమడ పలుచగా మారుతుంది. తద్వారా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. స్మోకింగ్, దుమ్మూ దూళికి దూరంగా ఉండాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలి. పండ్లు, కాయగూరలు ఎక్కువ మోతాదులో తీసుకోవాలి. ఆహారాన్ని ఒకేసారి ఎక్కువ మోతాదులో కాకుండా కొద్దికొద్దిగా తీసుకుంటూ ఉండాలి.

# జన ఔషధికి జై కొడదాం...

మానవ జీవితానికి దోహదపడే వనరులు ఎన్ని ఉన్నా సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇంకా అందుబాటులోకి రానివి చాలానే ఉన్నాయి. ప్రాణ రక్షగా పనిచేసే మందులు కూడా ఈ కోవకే వస్తాయి.

ఔషధాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. మందు చీటిని చూసి రోగులు గుండెలు బాదుకునే పరిస్థితి. ఈ సమస్య ఇప్పటిది కాదు. దశాబ్దాలుగా తిష్టవేసి ఉన్నదే. జన జీవితాలతో ఇది చెలగాటమాడుతోంది. అప్పుల ఊబిలోకి నెట్టేస్తోంది.

అల్లోపతి మందు అనేది నిర్దిష్ట ఆరోగ్య సమస్యను పరిష్కరించేందుకు మాత్రమే ఉపయోపగడుతుందని అనుకోలేం. దాని దుష్ప్రభావం ఇతర అవయవాల మీద కూడా పడొచ్చు. అవసరమున్నా లేకున్నా కొందరు వైద్యులు సూచించే మందులు ఇతర రోగాలకు కారణం కావచ్చు. ఇందులో మందుల కంపెనీల పాత్ర తక్కువేమీ కాదు. కొన్ని కంపెనీలు డాక్టర్లను ప్రలోభాలకు గురిచేస్తూ తమ ఉత్పత్తులనే రాసేలా ప్రోత్సహిస్తున్నాయి. దీంతో డాక్టర్లు బ్రాండెడ్ మందులకే అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే జనరిక్ ఔషధాలను విస్మరిస్తున్నారు. ఒక మందు ఒకే కాంపోజిషన్‌తో వేలాది బ్రాండ్స్ రూపంలో ఉంటుందన్న వాస్తవం చాలామంది రోగులకు దీనిపై అవగాహన ఉండటం లేదు.

**అపోహ మాత్రమే...**

బ్రాండెడ్ మందులు మాత్రమే పనిచేస్తాయి.. జనరిక్ మందులు పనిచేయవనేది అపోహ మాత్రమే. బ్రాండెడ్ మందులు ఎలా పనిచేస్తాయో జనరిక్ మందులూ అలాగే పనిచేస్తాయి. ఉదాహరణకు జ్వరం తగ్గేందుకు వాడే 'పారాసెటమోల్'ని ఒక్కొక్క కంపెనీ ఒక్కొక్క బ్రాండ్ పేరుతో ధరను నిర్ణయించి మార్కెట్లో ప్రవేశ పెడుతుంది. షుగరు వ్యాధి నియంత్రణకు వాడే 'మెటఫార్మిన్', 'గ్లిమీప్రైడ్', బీపీ నియంత్రణకు వాడే 'రామిప్రిల్', 'టెల్మిసార్ట్రాన్', కొలెస్ట్రాల్ ని తగ్గించుకునేందుకు వాడే 'ఆటోర్వాస్టాటిన్', 'రోసువాస్టాటిన్' మందుల కంపెనీలు వివిధ బ్రాండ్స్ రూపంలో విక్రయిస్తున్నాయి. వీటి ధరలు జనరిక్ మందులతో పోలిస్తే నాలుగైదు రెట్లు అధికంగా ఉంటాయి. వీటిని తయారు చేసేవి కూడా పెద్ద కంపెనీలే. నాణ్యతలో ఇవి బ్రాండెడ్ మెడిసిన్‌కి తీసిపోవు. జనరిక్ మందులు వాడితే ఆరోగ్య సమస్యకు పరిష్కారంతోపాటు రోగికి ఆర్థిక ఉపశమనం కూడా. కొన్ని జనరిక్ మందులు 80 శాతం తక్కువ ధరకు కూడా లభిస్తాయి. ఇలా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి వేలాది రూపాయలు మిగులుతాయి. బ్రాండెడ్ రూపంలో మందుల కొనుగోళ్ల వల్ల పేషెంట్ ఆర్థికంగా చితికిపోవాల్సిందే.

**నియంత్రణ శూన్యం**

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మనదేశంలోని కంపెనీలు తమ బ్రాండెడ్ మందులకు మన దేశంలోనే అధిక ప్రాధాన్యతనిస్తూ విదేశాలకు మాత్రం జనరిక్ ఔషధాలను ఎగుమతి చేస్తున్నాయి. వాటికి విదేశీయులపై ఉన్న మక్కువ



స్వదేశీయులపై ఉండటం లేదు. గ్రామీణ ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొన్ని కనీవిని ఎరుగని కంపెనీలు నాసిరకం మందులు మార్కెట్లో ప్రవేశ పెడుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీలతో పోటీ పడుతూ బ్రాండెండ్ ధరలకే మందులు సరఫరా చేస్తున్నాయి. ఎర్ర గోలీలు, తెల్ల గోలీలు, పచ్చ గోలీల రూపంలో అమాయకుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇంత దారుణం చోటుచేసుకున్నా నియంత్రణ శూన్యమే. ఇలాంటి కంపెనీలపై చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. అనధికారికంగా ఇలాంటి మందులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నా పట్టించుకునే వారే లేరు.

**మనమేం చేయాలి?**

- జనరిక్ మందుల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం.
- బ్రాండెడ్‌లా జనరిక్ మందులు పనిచేయవనే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి.
- నాణ్యతా ప్రమాణాల్లో బ్రాండెడ్‌కు జనరిక్ మందులు ఏమాత్రం తీసిపోవనేది తెలుసుకోవాలి.
- జనరిక్ మందులు ఆరోగ్యపరంగానే కాకుండా ఆర్థికంగా కూడా ప్రయోజనకరమనే విషయంపై విస్తృత ప్రచారం జరగాలి.
- జనరిక్ మందులతోనే ప్రిస్క్రిప్షన్ ఉండాలని వైద్యులను కోరాలి.

**- అమరనాథ్ జగర్లపూడి,**
**సీనియర్ మార్కెటింగ్ మేనేజర్**
**(ఫార్మస్యూటికల్స్)-**
**9849545257**





విరాట్ కోహ్లి

తుది జట్టులో రహానెకు చోటు దక్కకపోవటం ఎంతో అరుదు. విదేశీ గడ్డపై జట్టులోని అందరికంటే మెరుగైన రికార్డు ఉన్న ఆటగాడు బెంచ్‌కు పరిమితవటం అత్యంత అరుదైన విషయం. కేప్‌టౌన్‌లో కోహ్లిసేన ఈ రెండు తప్పిదాలను చేసేసింది. ఒక్క మ్యాచ్ ఓటమితో నాయకుడి వ్యూహ చతురతపై సందేహం వ్యక్తం చేయాల్సిన అవసరమైతే లేదు. కానీ ఆ పొరపాట్లను ఎంత త్వరగానే దిద్దుకుంటాడనేది ఆసక్తికరంగా మారింది. మూడు టెస్టుల ఫ్రీడం సిరీస్‌లో తొలి టెస్టు చేజారింది. రెండో టెస్టులో నెగ్గితేనే భారత్‌కు అవకాశాలు ఉంటాయి. ఇప్పుడు కాకుండా మూడో టెస్టుకు మార్పులు చేస్తామంటే ప్రయోజనం ఉండదు. అందుకే కోహ్లిసేన ముందు ఉన్నది ఒక్కటే చాన్స్. మరి, దాన్ని ఎంతమేరకు సద్వినియోగం చేసుకుంటారో..!

# ఉన్నది ఒక్కటే చాన్స్!

- ఏం చేసినా రెండో టెస్టులోనే..
- అతి పెద్ద సవాల్‌గా తుది జట్టు కూర్పు

నవతెలంగాణ క్రీడావిభాగం

ఏ పర్యటనలోనైనా ఆరంభం ముఖ్యం. అలాంటిది ప్రతికూల పరిస్థితులు, చేదు రికార్డులు స్వాగతం పలికిన చోట మెరుగైన ఆరంభానికి విలువ ఎక్కువ. ఏది ఏమైనా, దక్షిణాఫ్రికా పర్యటనలో టీమ్ ఇండియాకు అది దక్కలేదు. అవకాశాలు ఉన్నా.. కేప్‌టౌన్‌లో వెనకడుగు వేయక తప్పలేదు. ఇందుకు బాధ్యత ఎవరిది అనే కోణంలో కాకుండా కారణాలు ఏమిటీ అనే దృక్కోణంలో కోహ్లిసేన ఆలోచించాలి. సిరీస్‌పై ఆశలు ఆవిరి కాకముందే, రేసులోకి ఏ విధంగా రావాలనే వ్యూహం సిద్ధం చేసుకోవాలి. ఇందుకు తొలి అడుగు, తుది జట్టు కూర్పు అని చెప్పకతప్పదు. ఫ్రీడం సిరీస్‌లో రెండో టెస్టు శనివారం నుంచి సెంచూరియన్‌లో ఆరంభం కానున్నది. దీంతో కేప్‌టౌన్‌లో చేసిన తప్పిదాలను సెంచూరియన్‌లో కోహ్లి దిద్దుకుంటాడా లేదా అనేది ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ఒక వేళ సెంచూరియన్‌లో మెరుగైన విధానంతో వెళ్లకుండా, ఆఖర్లో జోహ్నెస్‌బర్గ్‌లో ఎంత చేసినా ప్రయోజనం సిద్ధించదు.

**రహానె వస్తాడా? :** తొలి టెస్టులో కోహ్లి చేసిన అతిపెద్ద వ్యూహాత్మక తప్పిదం తుది జట్టు నుంచి అజింక్య రహానెను తప్పించటం. విదేశీ పిచ్‌లపై రహానె బ్యాటింగ్ సగటు 53.44. ప్రస్తుత జట్టులోని మరే ఆటగాడు రహానె దరిదాపుల్లో లేరు. వెల్లింగ్టన్, మెల్‌బోర్న్, జమైకా, లండన్, కొలంబో వంటి విదేశీ పిచ్‌లపై శతకాలు సాధించిన ఘనుడు రహానె.

టెక్నిక్, టెస్టు బ్యాటింగ్ నైపుణ్యం పరంగానూ రహానె బలమైన బ్యాట్స్‌మన్. కానీ ప్రస్తుత ఫామ్ ప్రకారం తుది జట్టు కూర్పు చేశామని, అందుకే రోహిత్ శర్మను ఎంపిక చేశామని కోహ్లి చెప్పుకొచ్చాడు. రహానె వంటి ఆటగాళ్లకు నిజానికి ఫామ్‌లో సంబంధం లేదు. ప్రతికూల పరిస్థితులు ఎదురుచూస్తే చాలు, వారి బ్యాట్ నుంచి ప్రత్యేక ఇన్నింగ్స్‌లో వాటంతట అవే



అజింక్య రహానె

వచ్చేస్తాయి. రహానె కెరీర్ గ్రాఫ్ చూస్తే ఈ విషయం తెలుస్తుంది. ఆఫ్ స్టంప్‌ను కాచుకుని ఆడే రహానె శైలి... ఇక్కడి పిచ్‌లకు అతికినట్టు సరిపోతాయి. రహానెను తప్పించటంపై విమర్శలు వస్తోన్న నేపథ్యంలో సెంచూరియన్‌లో అతడికి కచ్చితంగా చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది.

**ఇతర చిక్కులూ.. :** భారత బ్యాటింగ్ లోపాలు ఓపెనింగ్ జోడీ నుంచే మొదలయ్యాయి. శిఖర్ ధావన్ దూకుడుగా ఆడటంలో దిట్ట. కానీ బౌన్సీ పిచ్‌లపై షార్ట్ బంతుల్ని ఆడటంలో అతడి బలహీనత బహిరంగ విషయం. కానీ కుడి-ఎడమల కాంబినేషన్ కోసం మురళీ విజయ్‌కి తోడుగా ధావన్‌ను తీసుకున్నారు. కానీ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ షార్ట్ బంతులకే ధావన్ అవుటయ్యాడు. దీంతో కెఎల్ రాహుల్‌ను తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. దీంతో పాటు పార్థీవ్ పటేల్‌ను ఓపెనర్‌గా పంపితే బాగుంటుందనే వాదన వినిపిస్తోంది. ఇలా చేస్తే రెండు ప్రయోజనాలు ఉంటాయి. ఓపెనర్‌గా పార్థీవ్ ఆడతాడు, వికెట్ కీపింగ్ బాధ్యతలు తీసుకుంటాడు. సాహా స్థానంలో మిడిల్ ఆర్డర్‌లో రహానెను ఆడించొచ్చు. దీంతో అదనపు బ్యాట్స్‌మన్‌గా ప్రయోజనకారి అని కెప్టెన్ నమ్మకాన్ని పొందిన రోహిత్ శర్మ తుది జట్టులో కొనసాగతాడు.

ఇక రెండో టెస్టు వేదిక సెంచూరియన్‌లోనూ కేప్‌టౌన్ పిచ్ పరిస్థితులే ఉన్నాయని తెలుస్తోంది. తొలి టెస్టులో స్పిన్నర్ల పాత్ర నామమాత్రం. అశ్విన్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కూల్చినా, బ్యాట్స్‌మన్‌గానే జట్టుకు ఉపయోగపడ్డాడు. సెంచూరియన్‌లోనూ స్పిన్ సేవల అవసరం నామమాత్రమైతే అతడి స్థానంలో మరో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌ను తీసుకోవటమో, స్పెషలిస్ట్ పేసర్‌ను ఎంచుకోవటమో మేలని విశ్లేషకులు చెబుతున్నారు.



'ఒక్క ఓటమితో జట్టు ఆత్మవిశ్వాసంలో ఏమాత్రం మార్పు రాదు. ఓడినంత మాత్రాన ఆడే అర్హత కోల్పోతామా?. తప్పులు జరుగుతాయి, సరిదిద్దుకుంటాం. మళ్లీ ప్రయత్నిస్తాం. తొలి ఇన్నింగ్స్‌లో భారత పిచ్‌లపై మాదిరి బంతులేసి తప్పుచేశాం. కానీ రెండో ఇన్నింగ్స్‌లో ఆ తప్పు పునరావృతం చేయలేదు. సెంచూరియన్‌లో లెంగ్త్‌పై ముందే అవగాహన రావాల్సి ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో లెంగ్త్ సరిగా ఉంటే కేప్‌టౌన్ కథ మరోలా ఉండేది'

- జస్‌ప్రీత్ బుమ్రా

'దక్షిణాఫ్రికా పరిస్థితులు భిన్నం. ఇక్కడ అదనపు పేస్, అదనపు బౌన్స్ లభిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆఫ్ స్టంప్ ఎక్కడుందో చూసుకుని ఆడే బ్యాట్స్‌మన్ అవసరం. అజింక్య రహానె, కెఎల్ రాహుల్‌లు సఫారీ పరిస్థితులకు సరిగ్గా సరిపోయే బ్యాట్స్‌మెన్. భారత బ్యాటింగ్ లైనప్ వైఫల్యం ఓపెనింగ్‌లో ధావన్ నుంచే కన్పిస్తోంది'

- గ్రేమ్ స్మిత్, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్



# టాప్ లేపిన హైదరాబాద్

## బెంగళూర్‌పై ఏకపక్ష విజయం

- సెమీఫైనల్లోకి ప్రవేశం
- ముగిసిన లీగ్ దశ పోరు
- నేటి నుంచి సెమీఫైనల్స్
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్-3



కరోలినా మారిన్

నవతెలంగాణ క్రీడాప్రతినిధి-గచ్చిబౌలి

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్(పీబీఎల్)లో హైదరాబాద్ టాప్ లేపింది. పీబీఎల్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూర్ బ్లాస్టర్స్‌పై ఏకపక్ష విజయం సాధించిన హంటర్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం సాధించింది. కరోలినా మారిన్, చాంగ్ వీ ఫెంగ్, సాయి ప్రణీత్ వరుస విజయాలు హైదరాబాద్‌ను విజేతగా నిలిపాయి. ఈ మ్యాచ్‌కు ముందు 14 పాయింట్లతో నాల్గో స్థానంలో నిలిచిన హైదరాబాద్ ఇప్పుడు అగ్రస్థానానికి చేరుకున్నది. హైదరాబాద్ హంటర్స్‌తో పాటు అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్, బెంగళూర్ బ్లాస్టర్స్, ఢిల్లీ డాషర్స్‌లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. నేటి నుంచి పీబీఎల్ తుది అంకం షురూ కానున్నది. నేడు, రేపు సెమీఫైనల్స్ జరుగనుండగా, ఆదివారం ఫైనల్ పోరు ఉంటుంది.

**హంటర్స్ అదిరెన్ :** బెంగళూర్‌పై హైదరాబాద్ ఐదు మ్యాచుల్లో గెలుపుఢంకా మోగించింది. తొలుత మిక్స్‌డ్ డబుల్స్‌లో మను అత్రి, సిక్కి రెడ్డి (బెంగళూర్) జోడీని సాత్విక్ సాయిరాజ్, బెర్నాడెట్ జోడీ మూడు సెట్ల పోరులో ఓడించింది. 15-6, 14-15, 15-9తో హంటర్స్ విజయం సాధించింది. మెన్స్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లో సాయి ప్రణీత్ విజయాన్ని అందించాడు. చాంగ్ వీ ఫెంగ్‌పై 10-15, 15-7, 15-14తో సాయిప్రణీత్ పైచేయి సాధించాడు. మహిళల సింగిల్స్‌లో కరోలినా మారిన్ అదరగొట్టింది. 15-9, 15-7తో క్రిస్టీ గిల్మర్‌ను చిత్తుగా ఓడించింది. సూపర్ స్మాష్‌లు, నెట్ డ్రాప్స్‌తో మారిన్ చెలరేగింది. మెన్స్ సింగిల్స్ రెండో మ్యాచ్‌లో లీ హ్యూన్ 15-11, 11-15, 15-11తో సుభాంకర్ దే (బెంగళూర్)పై విజయం సాధించాడు. టాప్ షట్లర్ హ్యూన్‌తో నువ్వా నేనా అన్నట్టు తలపడిన సుభాంకర్ సూపర్ ఆటతో ఆకట్టుకున్నాడు. మెన్స్ డబుల్స్‌లో మార్కిస్ కిడో, సియోంగ్‌లు 15-10, 11-15, 15-7తో మాథియస్, కిమ్ సా రంగ్‌లపై గెలుపొందారు. హైదరాబాద్ రెండో మెన్స్ సింగిల్స్ మ్యాచ్‌ను ట్రంప్‌గా ఎంచుకుని నెగ్గగా, మెన్స్ డబుల్స్‌ను ట్రంప్‌గా ఎంచుకున్న బెంగళూర్ పరాజయం పాలైంది. దీంతో హైదరాబాద్ ఐదు మ్యాచుల్లోనూ గెలిచి ఆరు పాయింట్లు సాధించింది. ట్రంప్ మ్యాచ్‌లోనూ ఓడిన బెంగళూర్ రుణాత్మక పాయింట్‌తో ముగించింది.

**సెమీస్‌లో ఎవరు ఎవరితో..**

హైదరాబాద్ X ఢిల్లీ (శుక్రవారం)
బెంగళూరు X అహ్మదాబాద్ (శనివారం)

# సెమీస్‌లో సరితా, సోనియా

**జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్**

**రోహ్‌తక్ :** మాజీ ప్రపంచ చాంపియన్ ఎల్ సరితా దేవి, ఆసియా రజత పతక విజేత సోనియా లాథర్‌లు జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. క్వార్టర్స్ పోరుల్లో సునాయస విజయాలతో సెమీస్‌లో అడుగుపెట్టారు. కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. ఆల్ ఇండియా పోలీస్ తరఫున 60 కిలోల విభాగంలో బరిలోకి దిగిన సరితా దేవి.. క్వార్టర్స్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆక్విల్లా దుపక్‌ను తొలి రౌండ్‌లోనే మట్టికరిపించింది. రైల్వేస్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు చెందిన సోనయా 57 కిలోల విభాగంలో మెరిసింది. ఉత్తరాఖండ్ అమ్మాయి కమలా బిస్త్‌ను 5-0తో ఓడించింది. సరితా, సానియాలతో పాటు.. నిఖత్ జరీన్ (51 కిలోలు), పవిత్ర (60 కిలోలు), సర్జు బాలాదేవి (48 కిలోలు)లు సెమీస్‌లో కాలుమోపారు.

# అంపైరింగ్ వివాదం

- మైదానంలో హైదరాబాద్ ఆటగాళ్ల నిరసన
- కర్నాటకతో ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్



బంతిని అందుకునే ప్రయత్నంలో బౌండరీ లైన్‌ను హసన్ ఎడమ కాలు తాకిన దృశ్యం

**విశాఖపట్నం :** హైదరాబాద్, కర్నాటకల మధ్య జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లో అంపైర్ నిర్ణయం వివాదానికి దారి తీసింది. గురు వారం విశాఖపట్నంలో జరిగిన మ్యాచ్‌లో కర్నాటక జట్టుకు అంపైర్ రెండు అదనపు పరుగులు ఇవ్వడంతో రగడ మొదలైంది. అసలేం జరిగిందంటే.. హైదరాబాద్ బౌలర్ సిరాజ్ వేసిన ఓ బంతికి కరుణ్ నాయర్ క్రీజులో పరుగులు తీశాడు. బౌండరీ దిశగా తరలిన బంతిని మెహదీ హసన్ బౌండరీ లైన్‌కు ముందే ఒడిసిపట్టుకున్నాడు. అయితే హసన్ ఎడమకాలు బౌండరీ లైన్‌కు తాకినట్టు రీప్లేలో స్పష్టంగా కనిపించింది. ఈ విషయాన్ని అంపైర్ పెద్దగా పట్టించుకోలేదు. కర్నాటక ఐదు వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. హైదరాబాద్ బ్యాటింగ్ సమయంలో అంపైర్‌తో వినయ్‌కుమార్ చాలా సేపు చర్చించాడు. దీంతో అంపైర్ కర్నాటక స్కోరుకు రెండు పరుగులు జత చేశాడు. హైదరాబాద్‌కు లక్ష్యం 206 పరుగులుగా నిర్ణయమైంది. దురదృష్టవశాత్తు అదే రెండు పరుగుల తేడాతో హైదరాబాద్ ఓటమి పాలైంది. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న హైదరాబాద్ కెప్టెన్ అంబటి రాయుడు మ్యాచ్ ముగిసిన అనంతరం మైదానాన్ని వీడలేదు. జట్టు అంతా కలసి అంపైర్ నిర్ణయంపై మైదానంలో నిరసన తెలియజేయటమే కాక సూపర్ ఓవర్ ఆడించాలని డిమాండ్ చేశారు. ఈ తతంగం వల్ల మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలవ్వాల్సిన ఆంధ్ర, కేరళ మ్యాచ్ ఆలస్యంగా ఆరంభమైంది. ఆ మ్యాచ్‌ను 13 ఓవర్లకు కుదించి నిర్వహించారు. రాయుడు మాట్లాడుతూ..' మా ఇన్నింగ్స్‌కు మధ్యలో గందరగోళం నెలకొన్నది. అంపైర్‌తో ఒకటే మాట చెప్పాను. మేం 204 పరుగుల లక్ష్యానికే ఆడతామని. దానికాయన.. 'మీరు ఆట మొదలెట్టండి, చివర్లో ఆలోచిద్దాం' అన్నారు. మాకు నియమాలు తెలుసు. చివర్లో సూపర్ ఓవర్ ఆడించండి అని మాత్రమే అడిగాం. తదుపరి మ్యాచ్‌కు ఆటంకం కలిగించటం మా ఉద్దేశ్యం కాదు' అని తెలిపాడు. విషయంపై స్పందించిన బీసీసీఐ..' కర్నాటక, హైదరాబాద్‌ల మ్యాచ్‌లో జరిగిన సంఘటనపై విచారణ జరుపుతాం. మ్యాచ్ రిఫరీ వద్ద నుంచి అనధికారిక వివరణ కోరాం. అన్ని విషయాలు తెలిసిన తర్వాత బీసీసీఐ నియమావళి ప్రకారం తగు చర్యలు చేపడతాం' అని ట్వీటర్ వేదికగా స్పష్టం చేసింది.

# బోపన్న జోడీ ఔట్

## సిడ్నీ ఇంటర్నేషనల్ సెమీస్‌లో ఓటమి

**సిడ్నీ :** భారత ఏస్ టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న సిడ్నీ ఓపెన్ నుంచి నిష్క్రమించాడు. పురుషుల డబుల్స్‌లో ఫ్రాన్స్ ఆటగాడు రోజర్ వాసెలిన్‌తో జతకట్టిన బోపన్న సిడ్నీ ఇంటర్నేషనల్ సెమీస్ సమరంలో పోరాడి ఓడాడు. గురువారం జరిగిన మ్యాచ్‌లో నాల్గో సీడ్ బోపన్న జోడీ 4-6, 7-5, 8-10తో టాప్ సీడ్ జంట మార్సెలో మెలో (బ్రెజిల్), లూకాజ్ కుబో (పోలండ్)ల చేతిలో ఓడింది. మూడు సెట్ల పోరును గంటన్నరలోపే ముగించిన బోపన్న జోడీ టాప్ సీడ్ జంటకు గట్టి పోటీనిచ్చారు. తొలి గేమ్‌లో తడబడినా రెండో గేమ్‌లో పుంజుకుని పోటీని మూడో సెట్‌కు తీసుకెళ్లారు. నిర్ణాయక సెట్‌లోనూ హోరాహోరీ పోరు జరుగగా పలు మార్లు ఆధిక్యం చేతులు మారింది. ఆఖర్లో చెలరేగిన టాప్ సీడ్ జంట తుది సెట్ నెగ్గి 2-1 విజయంతో ఫైనల్స్‌కు చేరుకున్నది. ఓవరాల్‌గా విజేత జోడీ 70 పాయింట్లు నెగ్గితే, బోపన్న జంట 64 పాయింట్లు సాధించారు.

# రైతులపై లావోణి చట్ట ప్రయోగం

**డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పేరుతో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన భూములకు ఎసరు పెడుతోంది.. అందుకు పాత చట్టాలకు బూజు దులిపి పేద రైతులపై ప్రయోగిస్తోంది. మహబూబ్‌నగర్ పట్టణానికి అతి దగ్గరలో ఉన్న దళిత, గిరిజన, బీసీ రైతులకు చెందిన 900 ఎకరాల భూమిపై 'లావోణి చట్టం' ప్రయోగించి లాక్కునే పనులు ప్రారంభించారు. భూములు ఇస్తే డబుల్‌బెడ్‌రూంలు మంజూరు చేయిస్తామని చెబుతున్నారు. అయితే, ప్రాణం పోయినా భూములు వదిలే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు.**

## అభివృద్ధి పేరుతో పేదల భూములకు ఎసరు

నవతెలంగాణ- మహబూబ్‌నగర్

30 ఏండ్ల కిందట పేదల పోరాటం ఫలితంగా అప్పటి ప్రభుత్వం 300 మంది గిరిజన, దళిత, బీసీ రైతులకు మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట శివారులో సర్వే నెం.867లో సుమారు 900 ఎకరాల భూమి పంపిణీ చేసింది. ఒక్కొక్కరికీ రెండెకరాల చొప్పున పంచింది. అప్పటి నుంచి వారు ఆ భూముల్లో కందులు, మొక్కజొన్న, పత్తి, రాగులు, వేరుశనగ వంటి పంటలు సాగు చేసుకుంటున్నారు. మరో 15 మంది బోర్లు వేసుకుని వరి సాగు చేస్తున్నారు. ఈ భూములపై రైతులు క్రాప్‌లోన్లు కూడా తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొంత మందికి కొత్త పాస్‌పుస్తకాలు కూడా ఇచ్చారు. రియల్ ఎస్టేట్ భూం పెరగడంతో ఆ భూములపై అధికార పార్టీ నాయకుల కన్నుపడింది. దాంతో మిగతావారికి కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా అడ్డుతగిలారన్న ఆరోపణలు ఉన్నాయి.

అయితే, పట్టణం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ భూముల్లో ఇప్పుడు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తున్నామని, అందువల్ల భూములు తిరిగి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. "ఈ భూములను లావుని చట్టం ప్రకారం తామే ఇచ్చాం.. తామే తీసుకుంటాం.. రైతులకిచ్చిన పట్టాలు చెల్లవు" అంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు పంపించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పట్టా పుస్తకాలు చూపిస్తున్న గిరిజన, దళిత, బీసీ రైతులు (ఫైల్)

**అధికార పార్టీ నాయకుల కోసమే..**

మహబూబ్‌నగర్ చుట్టూ నిర్మించే బైపాస్ రోడ్డు రైతుల భూముల మీదుగా వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఆ భూములపై స్థానిక ఎమ్మెల్యే అనుచరుల కన్ను పడింది. ఇండ్ల కోసం అయితే కొంత భూమి అవసరం ఉంటే వందల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ భూమి ప్రభుత్వానికి అవసరం ఉందని చెప్పించి స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అందుకే, ఈ భూమలు వదులుకుంటే ఇంటికో డబుల్ బెండ్‌రూం మంజూరు చేయిస్తామని నాయకులు చెబుతున్నట్టు రైతులు వాపోతున్నారు. కానీ ఒక ఇంట్లో ముగ్గురు నుంచి ఐదుగురు వరకు ఉన్నారు. ఒక్కరికే ఇల్లు కేటాయిస్తే మిగతా వారి పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రాణం పోయినా ఈ భూములను వదులుకోమని స్పష్టం చేస్తున్నారు.

### సర్కారుకు గిరిజనుల భూములే కావాలా



అప్పుడేమో మేలు చేస్తామని చెప్పి భూములు పంపిణీ చేశారు. ఇప్పుడేమో మళ్లీ వెనక్కి తీసుకుంటాం అంటున్నారు. గిదేం న్యాయం. మా భూముల జోలికి రాకండి.

అనుసూయ- వీరన్నపేట

### రాళ్లు, రప్పలు ఉండేవి



ఎప్పుడో నాకు పెండ్లి కాకముందు ప్రభుత్వం ఈ భూమిని మా ఆయనకు ఇచ్చింది. అప్పట్లో రాళు,, రప్పలు ఉండేవి. అప్పటి నుంచి కష్టపడి భూమిని చదును చేసుకుని పంటలు పండించుకుంటున్నాం. ఈ భూమిలోనే నా భర్త మృతిచెందాడు. ఈ భూమిని వదిలి యాడికి పోవాలే.

- దేవమ్మ, వీరన్నపేట

### పేదల భూముల జోలికి పోవద్దు



వీరన్నపేటలోని గిరిజన, దళిత, బీసీల భూముల జోలికి పోవొద్దని టీమాస్ ఫోరం డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ అవసరాల కోసమైతే భూములు చాలా ఉన్నాయి. ఇక్కడ అందరూ పేదలే. ఈ భూములు లాక్కునే యత్నం చేస్తే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తాం. ఒకవేళ భూములు తీసుకుంటే 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి.

చంద్రకాంత్- టీ మాస్ ఫోరం జిల్లా కన్వీనర్

### ప్రభుత్వ అవసరాల కోసం..

30 ఏండ్ల కిందట పంపిణీ చేసిన భూమిని ప్రభుత్వ అవసరాల మేరకు ఇప్పుడు వెనక్కి తీసుకుంటున్నాం. లావుని చట్టం ప్రకారం ఆ భూమి అమ్మకూడదు... కొనకూడదు. కొంత మంది ఆ భూమిని అమ్ముకున్నట్టు మా దృష్టికి వచ్చింది. వారికి మాత్రమే నోటీసులు ఇచ్చాం. మిగతా వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ప్రభాకర్‌రావు - అర్బన్ తహసీల్దార్



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.